శనివారం
1-3-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 159
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

ఉక్రెయిన్‌తో అమెరికా ఖనిజాల ఒప్పందం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుకున్నట్లుగానే ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో ఖనిజాల ఒప్పందాన్ని చేసుకున్నారు. ఉక్రెయిన్‌పై అమెరికా ఆధారాన్ని అదునుగా చేసుకొని ఆ దేశంపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చి కావాల్సిన పని చేయించుకున్నారు. ట్రంప్ ఇటీవల జెలెన్‌స్కీని నియంతగా ముద్రవేశారు. నాటో సభ్యత్వం గురించి మర్చిపోమన్నారు. రష్యాపై పోరులో ఉక్రెయిన్‌కు అందించిన సహాయానికి ప్రతిఫలాన్ని ఆశించడంలో తప్పులేదన్నారు. ఈ నేపథ్యంలో జెలెన్‌స్కీ తలొగ్గక తప్పలేదు. ఆయన అమెరికా బాట పట్టారు. ఆయనకు శ్వేతసౌధంలో ట్రంప్ శుక్రవారం ఆతిథ్యమిచ్చారు.



15 నుంచి 'స్పేడెక్స్' ప్రయోగాలు : ఇస్రో

న్యూదిల్లీ: నింగిలోనే ఉపగ్రహాలను అనుసంధానం చేసే మిషన్ (స్పేడెక్స్)ను చేపట్టి, ఇప్పటికే రెండు ఉపగ్రహాలను విజయవంతంగా అనుసంధానించిన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)... ఈ ప్రయోగాలను పునఃప్రారంభించేందుకు సిద్ధమైంది. మార్చి 15 నుంచి స్పేడెక్స్ ప్రయోగాలు చేపట్టనున్నట్లు ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ పేర్కొన్నారు. 'ప్రస్తుతం ఆ ఉపగ్రహం దీర్ఘవృత్తాకార కక్ష్యలో ఉంది. వివిధ ప్రయోగాలు చేపట్టేందుకు రెండు నెలల్లో 10 నుంచి 15 రోజుల అనుకూల సమయం లభిస్తుంది. ప్రస్తుతం వాటిని విడదీసి, రీ-డాకింగ్

- మిగతా 2 లో

పోసానికి 14 రోజుల రిమాండ్

విశాలాంధ్ర-రాజంపేట : వైసీపీ నాయకుడు, సినీనటుడు పోసాని కృష్ణమురళికి రైల్వేకోడూరు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. గురువారం రాత్రి 9.30 గంటల నుంచి శుక్రవారం తెల్లవారు జామున 5 గంటల వరకు దాదాపుగా 7 గంటల పాటు రెండు పక్షాల మధ్య సుదీర్ఘంగా వాదనలు కొనసాగాయి. పోసాని తరపున న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపించారు. బీఎన్ఎస్ చట్టం ప్రకారం పోసానికి 41ఏ నోటీసులు ఇచ్చి బెయిల్ ఇవ్వాలని పొన్నవోలు కోర్టును

- మిగతా 2 లో

యడియూరప్పకు పోక్సో కోర్టు సమన్లు

బెంగళూరు: కర్నాటక మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్పకు పోక్సో ప్రత్యేక కోర్టు శుక్రవారం సమన్లు జారీచేసింది. కర్నాటక సీఐడీ తాజా చార్జిషీటును పరిగణనలోకి తీసుకొన్నది. అయితే యడియూరప్ప మార్చి 15న న్యాయస్థానం ఎదుట హాజరు కావాల్సి ఉంది. కాగా, తన 17ఏళ్ల కుమార్తెను యడియూరప్ప లైంగికంగా వేధించినట్లు 2024, ఫిబ్రవరి 2 ఓ మహిళ ఫిర్యాదు చేశారు. ఈ ఘటన బీజేపీ నేత ఇంట్లో జరిగిందని పేర్కొన్నారు. అయితే ఆమె క్యాన్సర్‌తో మరణించారు. యడియూరప్పపై ఐపీసీలోని 354ఎ, 204, 214 సెక్షన్లతో పాటు పోక్సో చట్టంలోని 8వ సెక్షన్ కింద కేసు నమోదైంది.

ఇదీ లోకం!



కొల్లాం మేయర్ పీఠం సీపీఐ వశం

హనీ బెంజమన్ బాధ్యతల స్వీకరణ

కొల్లాం: కేరళలోని కొల్లాం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా సీపీఐ అభ్యర్థి హనీ బెంజమిన్ ఎన్నికయ్యారు. జిల్లా కలెక్టర్ ఎ.దేవిదాస్ అధ్వర్యంలో కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో మేయర్‌గా ఆమె ప్రమాణ స్వీకారం చేశారు. పది నెలల పాటు ఆమె మేయర్‌గా కొనసాగుతారు. మేయర్ ఎన్నికల్లో మొత్తం 45 ఓట్లు పోలయ్యాయి. సీపీఐ అభ్యర్థి హనీకి 37 ఓట్లు రాగా యూడీఎఫ్ అభ్యర్థి, మరుథాడి వార్డు కౌన్సిలర్ సుమికి ఏడు ఓట్లు వచ్చాయి. స్థానిక సంఘాల పదవుల బదిలీకి సంబంధించి సీపీఐ, సీపీఎం మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం కొల్లాం మేయర్ పదవీ కాలంలో చివరి ఏడాది సీపీఐకి అప్పగించాలి. ఒప్పందం మేరకు మేయర్ ప్రసన్న ఫిబ్రవరి 5న పదవీ బాధ్యతల నుంచి తప్పుకోవాలి. అయినా మరికొన్ని రోజులు కొనసాగారు. డిప్యూటీ మేయర్, ఆర్థిక స్థాయిసంఘం చైర్‌పర్సన్ కొల్లాం మధు, విద్యా స్థాయిసంఘం చైర్‌పర్సన్ సవితాదేవి, వర్క్స్ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ సంజీవ్ సుమన్ తమ పదవులకు రాజీనామా చేశారు. మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత హనీ బెంజమిన్ మాట్లాడుతూ చెత్త నిర్వహణ, అభివృద్ధికే తొలి ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. చెత్తరహిత నగరాభివృద్ధి తన

- మిగతా 2 లో

చారిత్రాత్మక విజయాల్లో
రక్షణశాఖ విశేష పాత్ర

గ్లోబల్ లీడర్‌షిప్‌లో యువతదే ప్రధాన భూమిక

- శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోవాలి
- రాజకీయాలకు ముందు సైన్స్ అధ్యాపకుడిని
- డీఆర్‌డీవో విజ్ఞాన్ వైభవ్ ప్రారంభోత్సవంలో రాజ్‌నాథ్‌సింగ్

విశాలాంధ్ర-హైదరాబాద్: శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోవాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. గ్లోబల్ లీడర్‌షిప్‌లో యువతదే కీలక పాత్ర అని స్పష్టం చేశారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా డీఆర్‌డీవో విజ్ఞాన్ వైభవ్-2025ను శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సైన్స్ అండ్ టెక్నాలజీలో వచ్చే మార్పులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. రక్షణ శాఖ చారిత్రాత్మక విజయాల్లో కేంద్రం విశేష పాత్ర పోషిస్తుందని స్పష్టం చేశారు. గత కొద్ది సంవత్సరాలుగా కేంద్ర రక్షణశాఖకు తాను మంత్రిగా ఉండడం అదృష్టంగా భావిస్తున్నాన్నారు. మానవుని మేధాసంపత్తు గొప్పదని చెప్పారు. సైన్స్ అండ్

- మిగతా 2 లో

పదవులు రాలేదని
నిరుత్సాహ పడొద్దు

- రాహుల్‌ను ప్రధానిని చేయడమే అజెండా
- మంచిని మైక్‌లో చెడును చెవిలో చెప్పండి
- టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో రేవంత్

2 లో

పదవులు రాలేదని నేతలు ఎవరూ నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కష్టపడి పనిచేసిన వారిని కచ్చితంగా పదవులు వరిస్తాయన్నారు. మంచిని మైక్ లో చెప్పండి... చెడును చెవిలో చెప్పాలి కానీ మనవాళ్లు అంతా ఉల్టా చెబుతున్నారని, ఈ పద్ధతిని మార్చుకోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

దేశవ్యాప్తంగా కులగణన

- బీసీలకు న్యాయం చేయాలి
- వక్తల డిమాండ్

విశాలాంధ్ర, హైదరాబాద్ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిజంగా బీసీ బిడ్డ అయితే దేశ వ్యాప్తంగా జన గణనతో పాటు కుల గణన చేపట్టాలని, తద్వారా జనాభా ప్రాతిపదికన చట్ట సభలతో పాటు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలు చేసి దశాబ్ధ కాలంగా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబాటుకు గురవుతున్న బీసీలకు న్యాయం చేయాలని రాజకీయ నాయకులు, బీసీ సంఘాల నేతలు, మేధావులు డిమాండ్ చేశారు. బీసీ హక్కుల సాధన సమితి అధ్వర్యంలో శుక్రవారం సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌లో దేశ జన గణనలో కుల గణన, బీసీలకు చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు-జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, విశ్రాంత ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, ప్రొఫెసర్ మురళి మనోహర్, ప్రొఫెసర్ ప్రభాంజన్ యాదవ్, వృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్, బత్తుల సిద్దేశ్వర్, బీసీ టైమ్స్ సూర్యారావు ప్రసంగించారు. దేశ జన గణనలో బీసీ కులగణన, బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు, జనాభా ప్రాతిపదికన నిధులు తదితర డిమాండ్ల సాధన కోసం రానున్న కాలంలో అన్ని బీసీ సంఘాలు, శక్తులు, వ్యక్తులు ఐక్య కార్యాచరణగా ఏర్పడి ఉద్యమాలను నిర్మించేందుకు ముందుకు రావాలని పిలుపునిస్తూ సమావేశం తీర్మానించింది. తొలుత బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనంజయ నాయుడు స్వాగతం పలుకగా, ఉప ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి వందన సమర్పణ

- మిగతా 2 లో

మామునూర్ ఎయిర్ పోర్ట్‌కు కేంద్రం అనుమతి

విశాలాంధ్ర-హైదరాబాద్: వరంగల్ జిల్లా మామునూర్ ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వశాఖ కార్యదర్శి అమిత్ కుమార్ జా... ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ కు లేఖ ద్వారా తెలిపినట్టు మంత్రి చెప్పారు. విమానాశ్రయ ప్రాధికార సంస్థ అభ్యర్థనకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎన్‌ఓసీ అడ్డంకిని మంత్రి కోమటిరెడ్డి ... జీఎంఆర్ సంస్థ యాజమాన్యంతో సంప్రదింపులు జరిపి ఎన్‌ఓసీ ఇచ్చేలా చేశారన్నారు. హెచ్ ఏఐఎల్ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ సమావేశం ఏర్పాటు చేసుకొని మామునూర్ విమానాశ్రయ అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న 150 కిలోమీటర్ల నిబంధనను సవరిస్తూ ఎన్ ఓసీ ఇచ్చారన్నారు. దీన్ని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఆమోదించిందని మంత్రి తెలిపారు.

స్వయం ఉపాధికి
అత్యంత ప్రాధాన్యం

- బీఆర్‌ఎస్ పాలనలో కార్పొరేషన్లు నిర్వీర్యం
- సబ్సిడీలు, మార్జిన్ మనీ ఇచ్చేందుకు సిద్ధం
- వ్యవసాయ రంగానికి పెద్దపీట
- మహిళా సంఘాలకు రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు
- రైజింగ్ తెలంగాణలో బ్యాంకర్ల పాత్ర కీలకం: భట్టి

విశాలాంధ్ర-హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. బేగంపేటలో శుక్రవారం బ్యాంకర్ల సమావేశం జరిగింది. భట్టి మాట్లాడుతూ... పదేళ్లుగా బీఆర్‌ఎస్ పాలకులు అన్ని కార్పొరేషన్‌లను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. సబ్సిడీలు, మార్జిన్ మనీ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలని కోరారు. సుమారు రూ.ఆరువేల కోట్ల విలువైన ఉపాధి పథకాలను ఆదివారం బ్యాంకర్లతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి వనపర్తిలో ప్రారంభిస్తారని చెప్పారు. ఇవి రాష్ట్ర జీడీపీని పెంచుతాయన్నారు. రైజింగ్ తెలంగాణలో బ్యాంకర్ల పాత్ర కీలకమని, ప్రపంచాన్ని ఆకర్షించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని అన్నారు. స్కిల్ యూనివర్సిటీ, ఐటీఐల అడ్వాన్స్‌మెంట్ ద్వారా నైపుణ్యం కలిగిన మానవ వనరులను, అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా, శాంతి భద్రతలు, సుహృద్భావ వాతావరణం కల్పించి ప్రపంచాన్ని ఆకర్షిస్తున్నామని వివరించారు. ప్రభుత్వ కృషి ఫలితంగా దావోస్‌లో రూ.1.80 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయని తెలిపారు. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. దీనికిగాను రూ.52 వేల కోట్లు కేటాయించామని తెలిపారు. రైతు రుణమాఫీ కింద సుమారు రూ.22 వేల కోట్లు రైతుల ఖాతాలో జమ చేశామన్నారు. రైతు భరోసా పథకం కింద ఇప్పటికే రూ.11,500 కోట్లు, రైతు బీమా కింద రూ.1,500 కోట్లు, రైతులకు ఉచిత విద్యుత్ పథకం కింద రూ.11 వేల కోట్లు, సన్నధాన్యం బోనస్‌గా రూ.1,800 కోట్లు, ఇవికాక కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రైతులకు ప్రయోజనం చేకూరుతుందని

- మిగతా 2 లో

రాజకీయ ప్రయోజనాలకే అసత్య ఆరోపణలు

- ఎస్ఎల్‌బీసీపై నిస్సిగ్గుగా దుష్ప్రచారాలు
- బీఆర్ఎస్ నేతలపై జూపల్లి ధ్వజం

విశాలాంధ్ర - హైదరాబాద్: బీఆర్ఎస్ నేతలంతా తమ రాజకీయ ప్రయోజనాలు, ఉనికి కోసమే అసత్య ఆరోపణలు చేస్తున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గాంధీభవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్ఎల్‌బీసీపై నిస్సిగ్గుగా, బాధ్యతారహితంగా దుష్ప్రచారాలు చేస్తున్నారని, ప్రకృతి విపత్తును కూడా రాజకీయం చేసి పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు. ఎస్ఎల్‌బీసీ ప్రమాద ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించిందని, సీఎం రేవంత్ రెడ్డి ఎప్పటికప్పుడు సమీక్షిస్తూనే ఉన్నారని తెలిపారు. మంత్రులం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. సొరంగంలో చిక్కుకున్న ఎనిమిది మందిని కాపాడేందుకు సహాయక బృందాలు శతవిధాల ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. నిపుణుల బృందం సలహాలు, సూచనల మేరకే ముందుకుసాగుతున్నామని స్పష్టం చేశారు. గతంలో కాళేశ్వరం ప్రాజెక్ట్ టన్నెల్ ఘటనలో ఏడుగురు చనిపోతే మీవలే తాము శవరాజకీయాలు చేయలేదని, అప్పుడు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ... ఎవరైనా ఘటన స్థలానికి వెళ్లారా అని ప్రశ్నించారు. కొండగట్టు బస్సు ప్రమాదం, పాలమూరు రంగారెడ్డి ప్రమాదం, శ్రీశైలం పవర్ హౌస్ లో అగ్నిప్రమాదం వంటివి చోటు చేసుకున్నప్పుడు

- మిగతా 2 లో

ఎస్ఎల్‌బీసీలో విషాదం

సొరంగంలో చిక్కుకున్న ఎనిమిది మంది సజీవ సమాధి

- మూడు మీటర్ల లోతు బురదలో మృతదేహాలు
- ఆధునిక పరికరాలు, రాడార్ల సాయంతో గుర్తింపు
- మృతుల్లో ఇద్దరు ఇంజినీర్లు, ఆరుగురు కార్మికులు

2 లో

సీపీఐ - క్విట్ ఇండియా ఉద్యమం

మహాత్మా గాంధీ నాయకత్వంలో జరిగింది మాత్రమే జాతీయోద్యమం కాదు. అది ప్రధాన స్రవంతి అన్నది వాస్తవం. అనేక ఇతర పోరాటాలూ ఉన్నాయి. వలసవాద పోరాటంలో గాంధీ-నెహ్రూ వారసత్వం నిస్సందేహంగా బలమైందే. సుభాశ్ చంద్రబోస్ నాయకత్వంలో ఆజాద్ హింద్ ఫౌజ్ పోరాటం, రాయల్ ఇండియన్ నేవీ ఉద్యమమూ గణనీయమైనవే.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

Form IV

Statement about ownership and other particulars about newspaper **VISALAANDHRA**

1. Place of publication : Vijayawada
2. Periodicity of its publication : Daily
3. Printer's Name : Edupuganti Nageswara Rao
   Nationality : India
   Address : 33-22-2, VISALAANDHRA ROAD, CHUTTUGUNTA. VIJAYAWADA-5200004, A.P.
4. Publisher's Name : Edupuganti Nageswara Rao
   Nationality : India
   Address : 33-22-2, VISALAANDHRA ROAD, CHUTTUGUNTA, VIJAYAWADA - 5200004, A.P.
5. Editor's Name : R.V.RAMARAO
   Nationality : India
   Address : 33-22-2, VISALAANDHRA, Chandram Buildings, CHUTTUGUNTA, VIJAYAWADA - 5200004, A.P.
6. Names and addresses of individuals : **VISALAANDHRA** Who own the newspaper and partners **VIGNANASAMITHI** or shareholders holding More than one percent of the total capital.

Members of the Governing Body

President	:	**Muppalla Nageswara Rao** Kothapeta-Guntur
Secretary	:	**Jalli Wilson** D.No.32-11-34, Mogalrajpuram, Vijayawada- 520004
Treasurer	:	**G. Obulesu** D.No.14-9-14, Dasari Bhavan, Hanumanpet, Vijayawada

Members :

K. Ramakrishna	Hanumanpet, Vijayawada
P. Harinatha Reddy	Chandram Buildings, Vijayawada
P. Kameswara rao	Srungavarapukota, Vizainagaram
Katti Narasimhareddy	Hanumanpet, Vijayawada
Chalasani Ajay Kumar	Suryaraopet - Vijayawada
P. Durga Bhavani	Ramakrishnapuram, VJA
P.V. Mallikarjunarao	Arundalpet, Guntur

I, Edupuganti Nageswara Rao, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-

Edupuganti Nageswara Rao

Date : 28-02-2025 Signature of Publisher

ఏకపక్ష నిర్ణయాలతో చేటు

అమెరికాకు చైనా హెచ్చరిక - సుంకాలపై వెనక్కి తగ్గమని సూచన

బీజింగ్: తమ దేశంపై రెట్టింపు సుంకాలను అమలు చేయబోతున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడాన్ని చైనా తీవ్రంగా ఖండించింది. ఏకపక్ష నిర్ణయాలు వద్దని సూచించింది. దీని వల్ల తమ మధ్య సంప్రదింపులకు విఘాతం కలగవచ్చని హెచ్చరించింది. ఫెంటనైల్ సంబంధిత వ్యవహారాల నెపంతో చైనా నుంచి దిగుమతి చేసుకునేవాటిపై అదనంగా 10శాతం సుంకం విధిస్తామని అమెరికా బెదిరిస్తోందని చైనా వాణిజ్య శాఖ (ఎంఓసీ) శుక్రవారం ఒక ప్రకటనలో దుయ్యబట్టింది. అమెరికా తీరు మార్చుకోకుంటే చైనా ప్రతిఘటిస్తుందని తేల్చిచెప్పింది. తమ న్యాయపరమైన హక్కులు, ప్రయోజనాలకు విఘాతం కలగనివ్వబోమని ఎంఓసీ ప్రతినిధి వెల్లడించారు. ఏకపక్షంగా అదనపు సుంకాలు విధించడమంటే డబ్ల్యూటీఓ నిబంధనలను అతిక్రమించడమేనని, బహుపక్ష వాణిజ్య వ్యవస్థను తక్కువ చేసినట్లు అవుతుందని చైనా అనేకసార్లు చెప్పిందన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు అత్యంత కఠినమైన విధానాలు కలిగిన దేశాల్లో చైనా ఒకటి కాగా అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణకు అమెరికాతో కలిసి పనిచేస్తున్నట్లు చెప్పారు. తమ దేశాన్ని అమెరికా పదేపదే ఎందుకు విస్మరిస్తోందని ప్రశ్నించారు. తమ ఉత్పత్తులపై అదనంగా 10 శాతం సుంకాలు విధిస్తామని బెదిరిస్తోందని, దీనివల్ల ఉన్న సమస్యలు పరిష్కారం కాకపోగా కొత్తవి పుట్టుకొస్తాయని హెచ్చరించారు. అంతేకాకుండా ప్రపంచ సరఫరా గొలుసుల అస్థిరమవుతాయని, అమెరికా వ్యాపారాలు, వినియోగదారులపై భారం పెరగవచ్చన్నారు. ఇలాంటి తప్పిదం మళ్లీ జరగదని, అమెరికా త్వరలోనే సన్మార్గాన్ని అనుసరిస్తుందని, చర్చలు జరిపి మనస్పర్థలు తొలగించుకునేందుకు ప్రయత్నిస్తుందని చైనా ఆశిస్తున్నట్లు అధికార ప్రతినిధి వెల్లడించారు.

4 నుంచి మెక్సికో, కెనడా, చైనాపై కొత్త సుంకాలు

వాషింగ్టన్: చైనా, మెక్సికో, కెనడాపై సుంకాల బాదుడుకు ట్రంప్ ప్రభుత్వం సిద్ధమైంది. మార్చి 4వ తేదీ నుంచి మెక్సికో, కెనడాపై సుంకాలు పెంచబోతోంది. అదే విధంగా చైనా దిగుమతులపై 10శాతం అదనంగా వసూలు చేయబోతోంది. ఈమేరకు యూనివర్సల్ టారిఫ్‌ను రెట్టింపు చేసింది. 'ట్రూత్' మాధ్యమంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ప్రకటన చేశారు. తాము నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే మార్చి 4వ తేదీ నుంచి సుంకాలు అమల్లోకి వస్తాయన్నారు. మెక్సికో, కెనడాపై 25శాతం సుంకాలు అమల్లోకి రానున్నట్లు తెలిపారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ బలోపేతమే లక్ష్యంగా ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

నేపాల్, పాక్‌లో భూకంపం

భారత్, టిబెట్‌లోనూ ప్రకంపనలు

ఖాట్మండు: నేపాల్‌లో భారీ భూంకంపం వచ్చింది. రాజధాని ఖాట్మండు సమీపంలో 6.1 తీవ్రతతో భూమి కంపించింది. ఇది జరిగిన కొన్ని గంటల్లోనే పాకిస్థాన్‌లో 4.5 తీవ్రతో భూకంపం వచ్చింది. అలాగే టిబెట్, భారత్‌లోనూ కొన్ని చోట్ల స్వల్ప ప్రకంపనలు సంభవించాయి. మధ్యరాత్రి 2.51 గంటలకు తమ ఇళ్లు ఊగిపోతుండటంతో గాఢనిద్రలో ఉన్న నేపాల్ ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. గత అనుభవాల దృష్ట్యా ప్రాణ-ఆస్థి నష్టంపై ఆందోళనకు గురయ్యారు. ఖాట్మండుకు తూర్పు దిశగా 65 కిమీల దూరంలో సింధూపల్ చౌక్ జిల్లా, భైరవ్‌కుండాలో భూకంప కేంద్రం ఉన్నట్లు జాతీయ భూకంపం పర్యవేక్షణ, పరిశోధన కేంద్రం నిర్ధారించింది. అలాగే, పాకిస్థాన్‌లో శుక్రవారం ఉదయం 5.14 గంటలకు 4.5 తీవ్రతతో భూకంపం సంభవించింది.

వాణిజ్య యుద్ధాలకు రష్యా వ్యతిరేకం: పెస్కోవ్

మాస్కో: వాణిజ్య యుద్ధాలకు రష్యా వ్యతిరే కమని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ అన్నారు. వాణిజ్య యుద్ధాలు ఎక్కడ జరిగినా... ప్రతికూల ప్రభావమే ప్రపంచంపై ఉంటుందని చెప్పారు. 'ప్రపంచంలో వాణిజ్య యుద్ధాలను కోరుకోం. వాణిజ్య యుద్ధాలు జరిగాయంటే వాటి వల్ల అన్ని దేశాలపై ప్రతికూల ప్రభావం ఉంటుంది' పెస్కోవ్ అన్నారు. అని యూరోపియన్ యూనియన్ దిగుమతులపై 25శాతం సుంకం విధించాలనే అమెరికా ప్రణాళికనుద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే బ్రిక్స్ భాగస్వాములతో పాటు మిత్రదేశాలపైనే రష్యా ఎక్కువగా దృష్టిని కేంద్రీకరిస్తున్నట్లు పెస్కోవ్ తెలిపారు. సుంకాలు-వాణిజ్య యుద్ధాలు లేకుండా స్నేహపూర్వకంగా పరస్పర ప్రయోజనాల దృష్ట్యా ఈ దేశాలతో కలిసి ముందుకెళతామన్నారు.

29 మంది డ్రగ్‌లార్డ్స్‌ను అమెరికాకు అప్పగించిన మెక్సికో

మెక్సికో సిటీ: మెక్సికోలో డ్రగ్స్ ముఠాలు రెచ్చిపోతుండటం అమెరికాకు కోపం తెప్పించింది. ఈ ముఠాల నిర్వీర్యానికి మెక్సికో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది. ఆ ముఠాలు నడిపే డ్రగ్‌లార్డ్స్ అప్పగింతకు డిమాండ్ చేసింది. ఇదే క్రమంలో మెక్సికోలోని ఎనిమిది నగరాల్లోని జైళ్ల నుంచి మొత్తం 29 మంది డ్రగ్‌లార్డ్స్‌ను అమెరికాకు అప్పగించినట్లు మెక్సికో ప్రభుత్వం వెల్లడించింది. అమెరికా విధించనున్న 25శాతం సుంకాలను అడ్డుకోవడానికే ఈ చర్య తీసుకున్నట్లు తెలిపింది. అమెరికాకు అప్పగించిన వారిలో రఫెల్ కారో క్వింటెరో ఉన్నాడు.

1985లో అమెరికా డీఈఏ ఏజెంట్ ఎన్రిక్ కికి కమరెనా హత్య కేసులో అతను ప్రధాన నిందితుడు. మెక్సికోలో మాదకద్రవ్యాల ముఠాలను, అక్రమ వలసదారులను కట్టడి చేయాలని, ఫెంటనైల్ తయారీని అడ్డుకోవాలని ట్రంప్ ఇప్పటికే హెచ్చరికలు చేశారు. అమెరికా డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ (డీఈఏ) మాజీ చీఫ్ మైక్ విజిల్ మాట్లాడుతూ మెక్సికో చరిత్రలో ఇలా ఎన్నడూ చేయలేదని వెల్లడించారు. కారో క్వింటెరో అప్పగింత విషయంలో అమెరికా చాలా పట్టుదలగా ఉండటంతో మెక్సికో తలొంచక తప్పలేదని తెలుస్తోంది.

కొల్లాం మేయర్ పీఠం సీపీఐ వశం

(మొదటిపేజీ తరువాయి)

లక్ష్యమన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త పడవేయడం పరిపాటిగా మారిందని, ఈ అలవాటును మాన్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. అనేక అభివృద్ధి ప్రాజెక్టులు జరగనున్నట్లు తెలిపారు. తోటి కౌన్సిలర్ల సహకారంతో అనుకున్న లక్ష్యాలు, అద్భుత ఫలితాలు సాధించగలమన్న నమ్మకం ఉందని హనీ బెంజమిన్ అన్నారు.

స్వయం ఉపాధికి అత్యంత ప్రాధాన్యం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం వృద్ధి సాధిస్తుందని చెప్పారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలతో సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేపట్టినట్టు తెలిపారు. వెయ్యి మెగావాట్లు ఉత్పత్తి లక్ష్యంగా సోలార్ కంపెనీలతో ఎంఓయూ కుదుర్చుకున్నట్టు వివరించారు. మహిళలను ప్రోత్సహించేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలని కోరారు. హైదరాబాద్ నగరానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, హైదరాబాద్‌కు మూసీ నది మణిహారంగా ప్రభుత్వం భావిస్తుందని చెప్పారు. మూసీ నదిని పునర్జీవింపజేసి ఆదాయంతో పాటు, పరిసరాల్లో నివసించే వారి ఆరోగ్యాన్ని పరిరక్షించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. నిర్వాసితులకు బ్యాంకర్లు ఆర్థికంగా చేయూత అందించాలన్నారు. నిర్వాసిత మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తాం అన్నారు. రూ.20వేల కోట్ల వడ్డీ లేని రుణాలు మహిళా సంఘాలకు అందించినట్టు తెలిపారు. కోటి మంది జనాభా ఉండే హైదరాబాద్ నగరంలో మహిళలకు ఆర్థిక చేయూత ఇస్తాం అన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో ఇండస్ట్రియల్, ఫార్మా, హౌసింగ్ క్లస్టర్లు పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తాం అన్నారు. లక్షలాది మందికి ఉపాధి కల్పించే ఎంఎస్ఎంఈ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు బ్యాంకర్లు ఆర్థిక చేయూత అందించాలని సూచించారు. సంక్షేమం, అభివృద్ధి జోడెడ్లుగా ప్రభుత్వం భావిస్తుందని, అందుకు అనుగుణంగా బ్యాంకర్లు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని డిప్యూటీ సీఎం అన్నారు.

రాజకీయ ప్రయోజనాలకే అసత్య ఆరోపణలు

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి, మంత్రులు ఘటన స్థలానికివెళ్లడం కానీ, బాధితులను పరామర్శించిన దాఖలాలు లేవని స్పష్టం చేశారు. శ్రీశైలం పవర్ హౌస్ లో ప్రమాదం జరిగితే అప్పుడు పీసీసీ అధ్యక్షులుగా ఉన్న రేవంత్ రెడ్డిని అడ్డుకున్నారని, అయినా తమ ప్రభుత్వం ఇప్పుడు బీఆర్ఎస్ నేతలను అడ్డుకోలేదని తెలిపారు. కృష్ణా బేసిన్‌లో సాగునీటి ప్రాజెక్ట్‌లను నిర్లక్ష్యం చేసింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమని, తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం అందించే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు విషయంలో రాద్ధాంతం చేయడం తగదని హితవు పలికారు. నల్గొండ ప్రజల సాగు, తాగునీటి కష్టాలు తీర్చే ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి తీరుతామని స్పష్టం చేశారు. మెట్టు సాయి కుమార్, అల్లం భాస్కర్, గజ్జి భాస్కర్ పాల్గొన్నారు.

7.8శాతం వృద్ధి సాధిస్తేనే సాధ్యం

వాషింగ్టన్: వికసిత్ భారత్ లక్ష్యం సాకారం కావాలంటే 7.8శాతం వృద్ధి రేటును సాధించాలని ప్రపంచ బ్యాంక్ సూచించింది. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా, అధిక ఆదాయం పొందే దేశంగా ఉండాలనే దిశగా కసరత్తు సాగుతున్న క్రమంలో ప్రపంచ బ్యాంకు కొన్ని సూచనలు చేసింది. ఈ మేరకు ఇండియా కంట్రీ మెమోరాండమ్ విడుదల చేసింది. దేశ స్థూల జాతీయ ఆదాయం ప్రస్తుతం ఉన్న దాని కంటే దాదాపు ఎనిమిది రెట్లు పెరగాలని వెల్లడించింది. ఆర్థిక రంగంతో పాటు భూ, కార్మిక రంగంలో సంస్కరణలు చేపట్టాలని, ఇందుకోసం ప్రస్తుత కార్యక్రమాలతో కొత్తవి చేపట్టాలని సూచించింది. 'అధిక ఆదాయ దేశంగా మారాలంటే రాబోయే దశాబ్దాల్లో భారతదేశ వృద్ధి రేటు సగటున 7.8 శాతంగా ఉండాలి. వేగవంతమైన సంస్కరణల ద్వారానే ఇది సాధ్యం' అని ప్రపంచ బ్యాంకు నివేదిక తెలిపింది.

ఎస్ఎల్‌బీసీలో విషాదం

విశాలాంధ్ర-హైదరాబాద్ : ఎస్ఎల్బీసీ సొరంగం ప్రమాదంలో చిక్కుకున్న ఎనిమిది మంది ప్రాణాలతో బయటపడతారని అందరూ ఆశించారు. కానీ ఈ ప్రమాదం చివరకు తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. సొరంగంలో చిక్కుకున్న ఎనిమిది మంది సజీవ సమాధి అయ్యారు. మూడు మీటర్ల లోతు బురదలో కూరుకుపోయి ఉన్న మృతదేహాలను అత్యాధునిక పరికరాలు, రాడార్ల సాయంతో గుర్తించారు. మృతదేహాల గుర్తింపులో ఐఐటీ మద్రాస్ నిపుణుల బృందం కీలక పాత్ర పోషించింది. మృతి చెందిన వారిలో ఇద్దరు ఇంజినీర్లు కాగా, మిగిలిన ఆరుగురు కార్మికులు. సొరంగంలో చిక్కుకున్న అందరూ మరణించారని నిర్ధారణ కావడంతో అక్కడ తీవ్ర విషాదం నెలకొంది. ఏడు రోజుల క్రితం గత శనివారం సొరంగంలో ప్రమాదం చోటుచేసుకుంది.

మూడో త్రైమాసికం వృద్ధిరేటు 6.2 శాతమే

న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి మందగించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లోని మూడో (అక్టోబరు- డిసెంబరు) త్రైమాసికంలో దేశ స్థూల దేశీయ ఉత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు 6.2 శాతానికి పరిమితమైంది. తయారీ, మైనింగ్ రంగాల్లో కార్యకలాపాలు మందగించడం వల్లే ఇటువంటి ఫలితాలొచ్చాయని పరిశీలకులు అంటున్నారు. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో జీడీపీ వృద్ధిరేటు అత్యధికంగా 9.5 శాతంగా నమోదైంది. ఈమేరకు వివరాలతో జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఓ) శుక్రవారం ఒక నివేదికను విడుదల చేసింది. ఇక ఈ ఆర్థిక సంవత్సరంలోని జులై-సెప్టెంబరు త్రైమాసికంలో జీడీపీ వృద్ధిరేటు 5.6 శాతంగా నమోదైన సంగతి తెలిసిందే.

అంచనాల సవరణ

2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీ వృద్ధిరేటుకు సంబంధించి తన అంచనాలను ఎన్ఎస్ఓ ఇప్పటికే ఒకసారి మార్చుకుంది. ఈసారి జీడీపీ వృద్ధిరేటు 6.4 శాతంగా ఉండొచ్చని ఈ ఏడాది జనవరిలో అంచనా వేసింది. అయితే జాతీయ పద్దుల అంచనాలతో రెండోసారి విడుదల చేసిన నివేదికలో జీడీపీ వృద్ధిరేటు 6.5 శాతానికి చేరొచ్చని ఎన్ఎస్ఓ పేర్కొంది.

దేశవ్యాప్తంగా కులగణన

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. రాష్ట్ర ఆఫీస్ బేరర్లు బొడ్డుపల్లి కృష్ణ, చింతకింది కుమార స్వామి, ఎల్.శ్రవ, ఏశాల అశోక్, కల్లెం కృష్ణ, కె.ప్రమీల, దీటి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్లు కల్పించాల్సిందే : కూనంనేని సాంబశివరావు

కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఉత్పత్తి కులాలయిన బీసీల వెనుకబాటు తనం అంతం కావాలంటే వారికి సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ప్రభుత్వాలు చేయూతను అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు ఏకైక మార్గం జనాభా దామాషా ప్రకారం బీసీలకు చట్ట సభలతో పాటు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడంతో పాటు ఆర్థికంగా వారిని బలోపేతం చేసేందుకు బడ్జెట్‌లో బీసీ జనాభాకు ఎంతో అంతా వాటా ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. వీటిని సాధించేందుకు జరిగే ప్రతి పోరాటంలో సీపీఐ ప్రత్యక్షంగా, పరోక్షంగా సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆయన హామీ ఇచ్చారు. బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలకు సన్నాహాలు చేస్తోందన్నారు. బీసీ రిజర్వేషన్ చట్టంతో సరిపెట్టకుండా కచ్చితంగా అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకునే విధంగా వత్తిడి తీసుకువస్తామని చెప్పారు. అజీజ్ పాషా మాట్లాడుతూ బీసీల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ అనేక సందర్భాల్లో పార్లమెంటులోనూ, అలాగే ప్రత్యక్ష ఉద్యమాల ద్వారా ప్రభుత్వాలపై వత్తిడి తీసుకువచ్చిందని అన్నారు. బీసీలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో న్యాయం జరగాలంటే ఐక్యంగా ఉద్యమించాలని, ఈ ఉద్యమాలకు జాతీయ స్థాయిలో కూడా సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. తెలంగాణ వృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీల అభ్యున్నతి కోసం ఏర్పాటు చేసిన బీసీ కార్పొరేషన్లను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాబోయే బడ్జెట్‌లో అన్ని కార్పొరేషన్లకు నిధులు కేటాయించి, వాటిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీ కుల గణనను స్వాగతిస్తున్నామన్నారు. దేశ వ్యాప్తంగా సైతం కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. చిరంజీవులు మాట్లాడుతూ రిజర్వేషన్లు కేవలం 50 శాతం మాత్రమే ఉండాలని భారత రాజ్యాంగంలో ఎక్కడా పొందుపరచలేదని, దేశ ప్రజలకు సమ న్యాయం చేయలేని సుప్రీం కోర్టు ఈ పరిధిని విధించిందని, బిసిలంతా ఏకమైతే ఈ గీత ఇట్టే చెరిగిపోతుందని ఇందుకు అందరూ సంసిద్ధం కావాలని కోరారు. మొదటి నుంచి బీజేపీ బీసీల పట్ల ద్వంద విధానాలను పాటిస్తూ తీవ్ర అన్యాయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టాలని 2010లో పార్లమెంటులో ఆందోళన చేపట్టిన బీజేపీ... 2021లో కులగణనకు తాము వ్యతిరేకమని సుప్రీం కోర్టుకు తెలిపిందన్నారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ కులం ఏమిటని తరచూ బీజేపీ నేతలు ప్రశ్నించడంపై ఎద్దేవా చేశారు. దేశ వ్యాప్తంగా కుల గణన చేపడితే రాహుల్ గాంధీ కులం ఏమిటో తెలియదా అని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌ను ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసం కాకుండా దేశంలోని 70 కోట్ల మంది బీసీల కోసం ఆలోచించాలని హితవు పలికారు.

పదవులు రాలేదని నిరుత్సాహ పడొద్దు

విశాలాంధ్ర-హైదరాబాద్: పదవులు రాలేదని నేతలు ఎవరూ నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కష్టపడి పనిచేసిన వారిని కచ్చితంగా పదవులు వరిస్తాయన్నారు. మంచిని మైక్ లో చెప్పండి... చెడును చెవిలో చెప్పాలి కానీ మనవాళ్లు అంతా ఉల్టా చెబుతున్నారని, ఈ పద్ధతిని మార్చుకోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. గాంధీభవన్‌లో శుక్రవారం పీసీసీ విస్తృతస్థాయి సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షుతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... నాలుగైదేళ్లు జిల్లా అధ్యక్షులుగా పనిచేసిన వారికి నామినేటెడ్ పదవులు , పార్టీలో నమ్మకంగా ఉన్నవారికి ఉన్నత పదవులు ఇచ్చామన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పిస్తున్నామన్నారు. మండలాలు, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఫీడ్‌బ్యాక్ తీసుకొని పదవులు, ప్రస్తుతం రెండేళ్ల కాలానికి కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇచ్చామన్నారు. మార్చి 10 లోపు జిల్లాల వారీగా ఇన్‌ఛార్జి మంత్రులు నామినేటెడ్ పదవులకు సంబంధించిన నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసే వరకూ విశ్రమించొద్దన్నారు. ప్రతిపక్షాలు చేసే విమర్శలను పట్టించుకోవద్దన్నారు. రాహుల్ ప్రధాని అయితే దేశం అభివృద్ధి చెందుతుందని, కాంగ్రెస్‌కు తక్కువ... ఎక్కువ అనే తారతమ్యాల్లేవన్నారు. అనుభవజ్ఞులైన ఇద్దరిని ఇప్పటికే రాజ్యసభకు నామినేట్ చేశాం. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి. రాష్ట్రంలో కులగణన అనేది అతిపెద్ద కార్యక్రమం. దేశంలోనే అత్యధిక పన్నులు కడుతున్న రాష్ట్రం తెలంగాణ. కష్టపడి పనిచేసే వారికి అవకాశాలు ఇవ్వాల్సిన బాధ్యత పార్టీపైనే ఉంటుందని పేర్కొన్నారు. రూ.4200 కోట్లు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కోసం ప్రభుత్వం ఖర్చు చేసిందని, 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని, రైతు భరోసాను రూ.12 వేలకు పెంచడంతోపాటు భూమిలేని పేదల కుటుంబానికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తున్నట్లు వెల్లడించారు. మన సక్సెస్ స్టోరీని మనమే చెప్పుకోవాల్సిన అవసరం ఉందని, మన ప్రభుత్వం కులగణన చేసి దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. దేశంలోనే అత్యధిక విదేశీ పెట్టుబడుల్ని ఆకర్షిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని ఇది మన చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసుకుంటున్నామని, దేశానికి మేం ఒక కొత్త మోడల్ ను సృష్టిస్తున్నామని తెలిపారు. మోదీని గద్దె దించే వరకు కష్టపడాలని పిలుపునిచ్చారు. రాహుల్ పట్టుదలతోనే కులగణన, ఎస్సీ ఉపకులాల వర్గీకరణ చేయగలిగామన్నారు. టీపీసీసీ నూతన ఇంచార్జ్‌గా మీనాక్షి నటరాజన్‌ను నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల్లో ఉంటేనే గెలుపు: మీనాక్షి

మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ నా కోసం రైల్వే స్టేషన్లకు నాయకులు రావొద్దన్నారు. నా బ్యాగ్‌లు ఎవరూ మోయొద్దన్నారు. ఆత్మ గౌరవాన్ని ఎక్కడ తక్కువ చేసుకోవద్దని సూచించారు. పేదల ముఖంలో నవ్వులు చూడాలని అప్పుడే మనం పని చేసినట్టు అవుతుందన్నారు. కార్యకర్తలు ఎప్పుడు ఫోన్ చేసిన మాట్లాడతానని, ఫ్లెక్సీలు, ఫొటోలు పెడితే నాయకులు ఎన్నికల్లో గెలవరని ప్రజల్లో ఉంటేనే గెలుస్తారని తెలిపారు.

15 నుంచి 'స్పేడెక్స్' ప్రయోగాలు

(మొదటిపేజీ తరువాయి)

చేసేందుకు అనుకరణ ప్రయోగాలు చేస్తున్నాం. ఇప్పటికే ఓ ప్రణాళిక సిద్ధం చేసుకున్నాం' అని ఇస్రో నారాయణన్ తెలిపారు. దిల్లీలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వివరాలు వెల్లడించారు. ఉపగ్రహాల్లో తగినంత ఇంధనం ఉందని... తదుపరి అనేక ప్రయోగాలు చేయాలనుకుంటున్నామని చెప్పారు. రెండు నెలల తర్వాత వచ్చే అనుకూల సమయంలోనూ మూడో దశ ప్రయోగాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. డాకింగ్, దృఢత్వ ప్రయోగాల అనంతరం రెండు ఉపగ్రహాల మధ్య విద్యుత్ శక్తి బదిలీ ప్రయోగాలు చేయాలనే ప్రణాళికలు వేసుకున్నట్లు ఇస్రో గతంలోనే వెల్లడించింది.

రక్షణశాఖ విశేష పాత్ర

(మొదటిపేజీ తరువాయి)

టెక్నాలజీలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రక్షణ శాఖలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో దేశం కొత్త ఒరవడిని సృష్టిస్తోందని పేర్కొన్నారు. దేశంలో పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతోందన్నారు. యూపీఐ లావాదేవీలలో భారత్ నేడు అగ్రగామిగా ఉందన్నారు. 2024లో భారత్‌లో మాత్రమే రూ. 171 బిలియన్ల లావాదేవీలు జరిగాయని వివరించారు. ఈ మొత్తం లావాదేవీల విలువ రూ. 2.45 లక్షల కోట్లని వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్‌లో మనం ముందంజ వేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. హార్డ్‌వేర్ నుంచి సాఫ్ట్‌వేర్ దృక్కోణం నుంచి కూడా... సైన్స్ అండ్ టెక్నాలజీలో ముందుకు సాగడం ముఖ్యమని తెలిపారు. రాజకీయాల్లో ప్రవేశించే ముందు సైన్స్ అధ్యాపకుడిగా చేసినట్లు కేంద్ర మంత్రి చెప్పారు. తొలుత గచ్చిబౌలి స్టేడియంలో అబ్దుల్ కలాం, సీవీ రామన్ విగ్రహాలకు రాజ్‌నాథ్ సింగ్, సీఎం రేవంత్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విజ్ఞాన్ వైభవ్‌లో భాగంగా డీఆర్‌డీవో అధ్వర్యంలో డిఫెన్స్, ఏరోస్పేస్ రంగంలో ఉత్పత్తులకు చెందిన 200 స్టాల్స్ ప్రదర్శించారు. యుద్ధాల్లో వినియోగించే మిస్సైల్స్‌ను స్టేడియంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు ప్రదర్శించనున్నారు. అందరికీ వీక్షించే అవకాశాన్ని అధికారులు కల్పించారు.

దేశ రక్షణలో హైదరాబాద్ పాత్ర కీలకం: రేవంత్

దేశాన్ని రక్షించడంలో హైదరాబాద్ అత్యంత క్రియాశీలక పాత్ర పోషిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దేశ రక్షణ బాధ్యత యువతీ యువకులపై ఉందని చెప్పారు. బీడీఎల్, డీఆర్డీఓ, మిథానీ, హెచ్ఏఎల్ వంటి దేశ రక్షణ కోసం రాకెట్లు, మిస్సైల్స్ తయారు చేస్తున్నాయని వివరించారు. లక్షలాది మంది విద్యార్థులకు దేశభక్తి, దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యతపై వారిలో స్ఫూర్తిని, అవగాహన కల్పించడానికి ఈ ప్రత్యేకమైన ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ నుంచి ప్రతి ఏటా లక్షకుపైగా ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు, ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్ చదివి అమెరికాకు వెళ్తున్నారని ముఖ్యమంత్రి చెప్పారు. వారిలో దేశభక్తితో పాటు దేశ రక్షణ ప్రాధాన్యతనలు వివరించడానికి ఈ వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నామని అన్నారు. దేశ రక్షణ కోసం అవసరమైన ఇంజినీర్లను తయారుచేయడం మరింత ముఖ్యమని తెలిపారు.

స్వాతంత్ర్యానికి ముందు నుంచి కూడా హైదరాబాద్‌లో బీడీఎల్, హెచ్ఎఎల్, మిథాని, డీఆర్‌డీఓ వంటి అనేక సంస్థలు దేశ రక్షణ కోసం ఉత్పత్తి రంగంలో విశేషంగా పని చేస్తున్నాయని వివరించారు. దేశ రక్షణ రంగానికి హైదరాబాద్, బెంగళూరు ముఖ్య కేంద్రాలుగా ఉన్నాయని అన్నారు. గతంలో మీతో చర్చించినట్లుగా హైదరాబాద్-బెంగళూరు డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌గా ప్రకటించాలని... తద్వారా భారీగా పెట్టుబడులు వస్తాయని అన్నారు. రాకెట్ తయారీ సహా ఆకాశ మార్గం (స్కై రూట్) వంటి స్టార్టప్‌లు అభివృద్ధి చెందుతాయని... అందుకోసం కేంద్ర ప్రభుత్వ సహకారం, మద్దతు అవసరమని తెలిపారు.

పోసానికి 14 రోజుల రిమాండ్

(మొదటిపేజీ తరువాయి)

కోరారు. అందుకు నిరాకరించిన మేజిస్ట్రేట్ తేజసాయి 14 రోజుల వరకు రిమాండ్ విధిస్తూ తీర్పు ఇచ్చారు. మార్చి 13 వరకు పోసాని రిమాండ్‌లో ఉండనున్నారు.

పోసానిని భారీ పోలీసు బందోబస్తు మధ్య శుక్రవారం 8 గంటల ప్రాంతంలో రాజంపేట సబ్ జైలుకు తరలించారు. ఆయనకు ఖైదీ నంబర్ 2261 కేటాయించారు. సినీ అభిమానులు, రాజకీయ పార్టీల మధ్య విద్వేషాలు, వైషమ్యాలు రెచ్చ గొట్టేలా వ్యవహరించారంటూ ఓబులవారిపల్లె మండలం చెన్నంరాజుపోడు మాజీ సర్పంచ్, జనసేన నాయకుడు జోగినేని మణి ఈ నెల 24న కృష్ణమురళిపై ఓబులవారిపల్లె పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోసానిపై 196,353(2), 111 రెడ్ విత్ 3(5) సెక్షన్ల క్రింద పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం రాత్రి పోసానిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సంబేపల్లి ఎస్ఐ భక్తవత్సలం అధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేసిన విషయం విదితమే.

పోసానిని భారీ పోలీసు బందోబస్తు మధ్య గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఓబులవారిపల్లె పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చారు. విచారణ అనంతరం రైల్వేకోడూరు కోర్టులో హాజరుపరిచారు.

టైలర్ వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : మన పూర్వికులను దర్జీలు తమ నైపుణ్యంతో ఆధునికత వైపు అడుగులువేయించారని కార్పొరేట్ కంపెనీల కారణంగా వీరి జీవితాలు ఇబ్బందికరంగా ఉన్నాయని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాష అన్నారు. టైలర్స్ డే సందర్భంగా శుక్రవారం రామవరం సెంటర్లో ఏర్పాటు చేసిన ఉత్సవంలో ఆయన పాల్గొని దర్జీలకు శుభాకాంక్షలు తెలిపారు. కేకును కట్ చేసి స్వీట్లు పంపిణి చేశారు. అనంతరం దర్జిల జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్నపేద వర్గాలు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకుంటేనే మనుగడ ఉంటుందన్నారు. ఆర్థికంగా వెనుకబడ్డ దర్జీ వృత్తిదారులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. రెడీమేడ్ దుస్తుల ప్రవేశంతో టైలర్ వృత్తి కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, దర్జీలు నర్సింహరావు, పురుషోత్తం, బ్లూ మూన్ యజమాని, సిబ్బంది పాల్గొన్నారు.

టైలర్స్‌ను సన్మానించిన వాసవి క్లబ్ నేతలు

విశాలాంధ్ర - ఇల్లందు : టైలర్స్ డే పురస్కరించుకొని ఇల్లందులోని సీనియర్ టైలర్లను వాసవి క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మీయంగా సన్మానించారు. నాలుగురు మహిళలతో పాటు నలుగురు పురుష దర్జీలను స్థానిక కటకం సెలక్షన్స్ ఫంక్షన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో సత్కరించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు బోనగిరి రవికిరణ్, ప్రధాన కార్యదర్శి కటకం సత్యేంద్ర కుమార్, కోశాధికారి తీర్థాల నాగరాజు, జోన్ చైర్మన్ పుల్లూరు సతీష్, ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడు పొద్దుటూరు నాగేశ్వరరావు, వాసవి క్లబ్ ఆఫీసర్స్ వ్యామసాని జనార్దన్, జొన్నల ఉపేందర్, తాటిపల్లి సుబ్బారావు, కటకం పెద్ద సత్యనారాయణ, గౌరిశెట్టి కృష్ణ (మాయ), జంగాల హరీష్, మామిడాల భాస్కర్, కటకం సుమన్, మహిళలు అర్వపల్లి విజయలక్ష్మి, పొద్దుటూరు మణి, కటకం అలేఖ్య, బోనగిరి కల్పన, పాబోలు స్వాతి, గౌరిశెట్టి లావణ్య, చారు గుండ్ల రాధిక, కటకం ప్రణవి, నాళ్ళ నందిని పాల్గొన్నారు.

త్రాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్ : జిల్లా వ్యాప్తంగా త్రాగునీరు సరఫరాకు ఇబ్బందులు రాకుండా పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, మున్సిపల్ సంబంధిత యంత్రాంగం పకడ్బందీ ప్రణాళికతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కేసముద్రం మండలం, రంగాపురం గ్రామంలో మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వెంటనే మరమ్మతులు చేసి ప్రజలకు త్రాగునీరు అందించుటలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా సమస్య పరిష్కరించాలని అన్నారు. వేసవికాలం నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అందించే త్రాగునీరు సరఫరాకు ఆటంకం లేకుండా ఇప్పటికే సంబంధిత సిబ్బంది అందరికీ తగు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. చిన్న చిన్న మరమ్మత్తులు ఏమైనా ఉంటే వెంటనే పరిష్కరించాలని, మున్సిపల్ పరిధి, గ్రామపంచాయతీ పరిధిలలో మిషన్ భగీరథ, ఇతర హ్యాబిటేషన్స్ ద్వారా సరఫరా అయ్యే త్రాగునీరును నిరంతరం పరిశీలిస్తూ ఉండాలనీ అన్నారు. ప్రతిరోజు గృహాలకు, హాస్టళ్లకు షెడ్యూలు ప్రకారము మంచి నీటిని సరఫరా చేయాలని అన్నారు. జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్, మిషన్ భగీరథ ఈఈ లక్ష్మారెడ్డి, సంబంధిత సిబ్బంది, పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

విశాలాంధ్ర ప్రతినిధి- పెద్దపల్లి, సింగరేణి : రామగుండం ఎరువుల కర్మాగారం కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజఠాకూర్ కార్మికులకు హామీ ఇచ్చారు. ఆర్ఎఫ్‌సిఎల్ కాంటాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షులు నెలకంటి రాము కార్మికులతో కలసి శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కలసి తమ సమస్యలు పరిష్కరించాల్సిందిగా కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్ఎఫ్‌సిఎల్ కాంట్రాక్టు కార్మికులకు అండగా ఉంటానని మీ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని, ఢిల్లీలో ఉన్న ఆర్ఎఫ్‌సిఎల్ కార్యాలయానికి వెళ్లి అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. మాజీ సర్పంచ్ చిట్టబోయిన రాజ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ కందుల సతీష్, హెూటల్ శంకర్, మల్లేష్, రమేష్ రెడ్డి, ఎరుకల అంజి, దాత శ్రీనివాస్, దూస రాజేష్, జనగామ శ్రీనాథ్, సొల్లు కుమార్, శ్రీనివాస్, తరుణ్, మరి కుమారస్వామి, శ్రీనివాస్ ఆనంద్, జస్వంత్, బిక్షపతి, ఫిరోజ్ తదితరులు అన్ని విభాగాల నుండి అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ఐజేయు లక్ష్యం



విశాలాంధ్ర- ఖమ్మం : జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే టీయూడబ్ల్యూజే (ఐజేయు) లక్ష్యమని ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.రామ్ నారాయణ పేర్కొన్నారు. టీయూడబ్ల్యూజే (ఐజేయు) జర్నలిస్ట్ యూనియన్ ఖమ్మం నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మం జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రాష్ట్ర కమిటీ సభ్యులు మాటేటి వేణుగోపాల్, రాష్ట్ర నాయకులు నర్వనేని వెంకట్రావు, జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు సామినేని మురారి ఖమ్మం నగర కమిటీ అధ్యక్షులు మైస పాపారావు, ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి శ్రీనివాస్‌లతో కలిసి ప్రారంభించారు. నగర కమిటీ అధ్యక్షుడు మైస పాపారావు అధ్యక్షతన జరిగిన సభలో రామ్ నారాయణ మాట్లాడుతూ ఖమ్మం పరిధిలో ఒక్కరోజే వందమందికి పైగా యూనియన్ సభ్యత్వం తీసుకోవడం సంతోషకరమన్నారు. ఆరు దశాబ్దాలకు పైబడి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలపై పెద్ద ఎత్తున పోరాటాలు చేసిన ఏకైక సంఘం నాడు ఏపీయూడబ్ల్యూజే నేడు టియుడబ్ల్యూజే యుడబ్ల్యూజే ఐజేయు అన్నారు. రెండు దశాబ్దాలుగా ఖమ్మం నగరంలో, జిల్లాలో జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్య పరిష్కారం కావడం లేదని, ఇక పోరాటమే శరణ్యం అన్నారు. పోరాడకుండా జర్నలిస్టుల ఏ ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని గుర్తు చేశారు.

వృత్తి నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : వృత్తి నైపుణ్య శిక్షణ తో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. శుక్రవారం పాల్వంచలోని నవ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్లో శిక్షణ పూర్తి చేసుకున్న ఐటిఐ విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేయు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శిక్షణ కేంద్రంలోని అన్ని తరగతి గదులను పరిశీలించారు. శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణ ఎలా ఉందని అడిగారు. ఈ కేంద్రంలో ఎంత మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వృత్తి విద్యలో శిక్షణ పొందిన విద్యార్థులు పరిశ్రమల స్థాపన ద్వారా పారిశ్రామిక వేత్తలుగా ఎదగొచ్చని కలెక్టర్ అన్నారు. పదవ తరగతి తర్వాత ఐదు సంవత్సరాల పాటు విద్యను కొనసాగించేందుకు అవసరమైన ఆర్థిక వనరులు అందరికీ అందుబాటులో ఉండకపోవచ్చన్నారు. అలాంటి వారికి తక్షణ ఉపాధి కల్పించే వృత్తి విద్యా కోర్సులు ద్వారా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని, ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని వివరించారు. జీవితంలో స్థిరపడటానికి వారి ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతుందన్నారు. ప్రపంచంలో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా సాంకేతిక సిబ్బంది డిమాండ్ బాగా ఉందన్నారు. విద్యార్థులు వృత్తి విద్య కోర్సులు, శిక్షణ పూర్తి చేయడం ద్వారా మంచి ఉపాధి అవకాశాలు వచ్చని తెలిపారు. అనంతరం శిక్షణ పూర్తి అయిన విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా ధ్రువపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఓ సంజీవరావు, నవ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్, శిక్షణ కేంద్ర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి : ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : యువత చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని అప్పుడు మంచి గుర్తింపు వస్తుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. ఏజెన్సీ ప్రాంత ప్రజల అభివృద్ధి కోసం పోలీస్‌శాఖ తరపున విశేషంగా కృషి చేస్తున్నమ న్నారు. దుమ్ముగూడెం పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం నుండి ములకపాడు క్రీడా మైదానంలో మొదలయిన మండల స్థాయి వాలీబాల్ పోటీలను ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ ఆపరేషన్ పరితోష్ పంకజ్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ సింగ్ కూడా పాల్గొ న్నారు. నాలుగు రోజులు పాటు జరగనున్న వాలీబాల్ పోటీలలో 54 టీమ్‌లు పాల్గొననున్నాయి. దుమ్ముగూడెం మండలంలోని ఏజెన్సీ ప్రాంత యువత కోసమే సుమారుగా రూ.2 కోట్ల వ్యయంతో పోలీసుల ఆధ్వర్యంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో నివసించే ఆదివాసిల అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టి జిల్లా పోలీస్ శాఖ పనిచేస్తున్నారు. ఇటీవల అండర్-19 మహిళల క్రికెట్ వరల్డ్ కప్‌లో అత్యద్భుత ప్రతిభ కనబరిచి వరల్డ్ కప్‌ను సాధించడంలో కీలక పాత్ర పోషించిన గొంగిడి త్రిష కూడా మన జిల్లా ఏజెన్సీ ప్రాంత ముద్దు బిడ్డ అని గుర్తు చేసారు. 141 బెటాలియాన్ అసిస్టెంట్ కమాండెంట్ రేవతి అర్జునన్, సిఐ అశోక్, ఎస్సైలు వెంకటప్పయ్య, గణేష్ పాల్గొన్నారు.

శ్రామిక ప్రజల ఐక్య నినాదం కొప్పుల పిచ్చమ్మ

విశాలాంధ్ర - గార్ల : వ్యవసాయ కార్మిక సంఘం ముఠా మేస్త్రిగా పనిచేస్తూ జీవితాంతం శ్రామిక ప్రజల ఐక్యత కోసం పాటుపడిన కొప్పుల పిచ్చమ్మ శ్రామిక వర్గ ప్రజల ఐక్య నినాదంగా నిలుస్తుందని విశ్వ సమాజం వ్యవస్థాపకులు, న్యాయవాది విశ్వ జంపాల అన్నారు. గురువారం మండల పరిధిలోని గోపాలపురం గ్రామానికి చెందిన వ్యవసాయ కార్మిక సంఘం ముఠా మేస్త్రి పిచ్చమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించి, జోహార్లు అర్పించారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోపాలపురం గ్రామంలో వ్యవసాయ కార్మిక నాయకురాలుగా పిచ్చమ్మకు మంచి గుర్తింపు ఉందన్నారు. నాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం గార్ల మండల అధ్యక్ష, కార్యదర్శులు జంపాల సతీష్, మేడేపల్లి సైదులు, నాయకులు జంపాల వెంకన్న, మంగళగిరి మాధవరావు, మంగళగిరి వెంకటేశ్వర్లు, దూదిపాల రఘురాం, నడిగొండ సాంబ, పిచ్చమ్మ కుమారులు ఉపేందర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలను సజావుగా నిర్వహించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లాలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఇంటర్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మార్చి 5 నుంచి మార్చి 25 వరకు ఇంటర్ పరీక్షల ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహణకు జిల్లాలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలన్నారు. ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం 23 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశామని అధికారులు తెలిపారు. విద్యార్థులకు పరీక్ష హాల్స్‌లో త్రాగు నీరు అందించాలని, పరీక్ష కేంద్రాలకు త్రాగునీటి సరఫరా ఉండే విధంగా మున్సిపల్, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన, ఆర్టిసి, విద్యుత్, పంచాయతీ, మునిసిపల్, పోస్టల్, సంబంధిత ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టైలర్ వృత్తిని దెబ్బతీస్తున్న కార్పొరేట్ కంపెనీలు

విశాలాంధ్ర - కొత్తగూడెం : సమాజానికి పూర్వం నుంచి నేటికీ ఎంతో సేవలు అందిస్తూ వస్తున్న టైలర్ వృత్తిదారులు, సిబ్బంది కష్ట కాలంలో ఉన్నారని ఆ సంఘం నేతలు ఆబిద్ హుస్సేన్, ఎమ్.ఎ. రెహమాన్ లు ఆవేదన వ్యక్తం చేశారు. దర్జీల వృత్తి, ఆర్థిక జీవితాలను వడ కార్పొరేట్ రెడీ మెడ్ కంపెనీలు చాలా కృంగదీశాయన్నారు. శుక్ర వారం టైలర్స్ డే సందర్భంగా స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో దర్జీల జెండాను ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వృత్తిదారులను ప్రభుత్వం వడ్డీలేని రుణాలు అందించాలని, 55 ఏళ్ళు దాటిన వారికి ప్రత్యేక పెన్షన్ రూ.10 వేలు అందించాలని అర్హులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. యోగా గురువు గుమలాపురం సత్యనారాయణ, రాంబాబు, సర్వేష్, సతీష్, షఫీ, అజీజ్, పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ టాలెంట్ టెస్ట్ విజేతలకు వాసవి క్లబ్ వితరణ

విశాలాంధ్ర - ఇల్లందు : ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో స్థానిక సిపిఐ కార్యాలయంలో 10 వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. శుక్రవారం సిపిఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ టెస్టులో విజేతలగా నిలిచిన విద్యార్థులకు ఎంతో సేవా దృక్పదంతో స్థానిక వాసవిక్లబ్ బాధ్యులు బహుమతులు అందించారు. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, కోశాధికారి బోనగిరి రవికిరణ్, కటకం సత్యేంద్ర కుమార్, నాగరాజు కార్యక్రమంలో పాల్గొని వారి చేతుల మీదుగా శీల్డ్, బహుమతులు అందించారు. విద్యార్థులు శ్రమ, పట్టుదలతో చదివి పదవ తరగతిలో మంచి మార్కులతో విజయం సాధించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సారయ్య, బంధం నాగయ్య, శంకర్, బాస శ్రీనివాస్‌లతోపాటు ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు సాయి, దీక్షిత్‌లు పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - ముదిగొండ : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్ర మైన కమలాపురం సాయి మెరిట్ హైస్కూల్ నందు విద్యార్థులు పలు రకాల సైన్స్ నమూనాలను తయారు చేసుకుని వచ్చి పాఠశాలలో ప్రదర్శించారు. తరగతి గదులే దేశ భవిష్యత్తుకు పునాదులంటూ ఓ మేధావి చెప్పిన మాటలను సాయి మెరిట్ హై స్కూల్ పాఠశాల విద్యార్థులు అక్షరాల నిజం చేస్తున్నారు. సాయి మెరిట్ హైస్కూల్ కరస్పాండెంట్ కందుల శంకరయ్య తొలిత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తల ఆలోచన విధానాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని తమకున్న వనరులతో ప్రయోగాలు చేయటం అలవాటు చేసుకోవాలని సూచించారు. తద్వారా మేధో శక్తి పెంపొందుతుందని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూరంపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న విజ్ఞాన ప్రతిభను వెలికి తీయడానికి సైన్స్ ఎక్స్‌పో నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణరావు, శ్రీనివాస్, నాగ బిక్షం, సుధాకర్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలి

విశాలాంధ్ర - గూడూరు: ప్రభుత్వ భూములలో అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయాలని తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్ అన్నారు. శుక్రవారం గూడూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి పక్కన గల ఐటీడీఏ విద్యా కేంద్ర ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయాలని స్థానిక డిప్యూటీ తహశీల్దార్ కోమల వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ భూభాగంలో 1/59, 1/70, ఆర్టికల్ 19(5)కి విరుద్ధంగా గూడూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి పక్కన గత 20 సంవత్సరాల క్రితం ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన విద్యా కేంద్రం ఉండేదని, ఆ విద్యా కేంద్రానికి సంబంధించిన ప్రభుత్వ భూమిని కొందరు గిరిజనేతర్లు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని, అట్టి నిర్మాణాలు వెంటనే నిలుపుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు పడిగా నాగేశ్వరావు దొర, తుడుందెబ్బ జిల్లా, మండల అధ్యక్షులు బొల్లి సారయ్య, లింగాల కిరణ్ కుమార్, తుడుందెబ్బ నాయకులు పడిగా మంగయ్య దొర, కొట్టెం వజ్జయ్య, ఈసం మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలి

విశాలాంధ్ర- తొర్రూర్: విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని మండల విద్యాశాఖ అధికారి మహంకాళి బుచ్చయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని ఈదులకుంట తండా మండల ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలని, పాఠశాలలోని విద్యార్థులను వారి సామర్థ్యాల విద్యార్థులను అడిగి తెలుసుకు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఉపాధ్యాయులకు తెలిపారు. అదేవిధంగా ఒక పాఠ్యాంశాన్ని బోధించి ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఈదుల కుంట తండా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్ మాధవి, ఉపాధ్యాయురాలు ఊర్మిళాదేవి, సిఆర్పి జే భాస్కర్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కీచక కాంట్రాక్ట్ లెక్చరర్‌ని కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర - ఖమ్మం : మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన కీచక లెక్చరర్‌పై కేసు పెట్టి కఠినంగా శిక్షించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. కొందరు లెక్చరర్‌లు వృత్తికే కళంకం తెస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికల రామకృష్ణ ఎస్ఎఫ్ఐ కార్యదర్శి ప్రవీణ్, జార్జిరెడ్డి, పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు మంద సురేష్, జిల్లా కార్యదర్శి మస్తాన్, జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చింతల రమేష్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ, సిపిఐ మహిళ నాయకురాలు మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి అన్నారు. కళాశాలలో విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని ఇటువంటి లెక్చరర్‌ను కఠినంగా శిక్షించాలన్నారు. శుక్రవారం వామపక్ష విద్యార్థి యువజన మహిళా సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్ ముజ్మల్‌ఖాన్‌కు వినతిపత్రం ఇచ్చారు. లెక్చరర్ వృత్తికి మచ్చ తెచ్చే విధంగా ప్రవర్తిస్తున్నారనిమండిపడ్డారు. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించే కీచక లెక్చరర్‌ను కఠినంగా శిక్షించి, లెక్చరర్ వృత్తి నుండి తొలగించాలని, పోక్సో కేసు నమోదు చేసి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం 45 సంవత్సరాలు పైబడి ఉన్న వారిని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలు లెక్చరర్స్‌గా నియమించాలని నిబంధనన్న ఆ నిబంధనలను తుంగలో తొక్కడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. తక్షణమే కీచక లెక్చరర్‌ను అరెస్టు చేయాలన్నారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు సుధాకర్, శివ, అజయ్, మనోజ్, వినోద్, వీరబాబు ప్రతాప్ రాకేష్ రాజు గోపి త్రినాథ్ మహేష్ తాటినిర్మల. వెంకటలక్ష్మి పూజిత నాగచులోచన బేగం అజిత అమరావతి తదితరులు పాల్గొన్నారు.

న్యూమెరస్ మోటర్స్ మల్టీయుటిలిటీ ఇ-స్కూటర్ 'డిప్లోస్ మాక్స్' విడుదల

హైదరాబాద్: స్వదేశీ ఎలక్ట్రిక్ వాహనాలలో ప్రత్యేకత కలిగిన నవీన తరపు ఒరిజినల్ పరికరాల తయారీదారు న్యూమెరస్ మోటర్స్, తాజాగా హైదరాబాద్‌లో తమ మల్టీయుటిలిటీ ఇ-స్కూటర్ 'డిప్లోస్ మాక్స్'ను పరిచయం చేసింది. క్లీన్ మొబిలిటీని పునర్నిర్వచించడానికి రూపొందించబడిన డిప్లోస్ మాక్స్, దాని ప్రతిష్ఠాత్మక డిప్లోస్ ప్లాట్‌ఫారం కింద విభిన్న వినియోగాలకు అనుగుణంగా వ్యక్తిగత మొబిలిటీ విభాగంలోకి కంపెనీ ప్రవేశాన్ని సూచిస్తుంది. ఈ వాహనాలు భద్రత, విశ్వసనీయత, మన్నిక సూత్రాలను కలిగి ఉంటాయి. ఇవి వివిధ రకాల వినియోగదారుల అవసరాలకు అనువైనవిగా చేస్తాయి. డిప్లోస్ మాక్స్ హైదరాబాద్‌లో రూ.1,12,199 ఎక్స్-షోరూమ్ ధరకు అందుబాటులో లభిస్తుంది. కంపెనీ ఈ వాహనం కోసం భారతదేశంలోనే అతిపెద్ద పైలట్ పరీక్షను నిర్వహించింది. ఇది 13.9 మిలియన్ కిలోమీటర్లకు పైగా ప్రయాణించింది.

హెచ్ఎంఐఎఫ్ 'ఆర్ట్ ఫర్ హెూప్-సీజన్ 4'కు రంగం సిద్ధం

న్యూఢిల్లీ: హ్యుందాయ్ మోటర్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎంఐఎల్) సీఎస్ఆర్ విభాగం అయిన హ్యుందాయ్ మోటర్ ఇండియా ఫౌండేషన్ (హెచ్ఎంఐఎఫ్), దాని ప్రధాన కళా కార్యక్రమం-'ఆర్ట్ ఫర్ హెూప్' నాల్గవ సీజన్‌ను ప్రారంభించింది. మూడు రోజుల కళ, సంస్కృతి ఉత్సవంలో భారతదేశం అంతటా 15 రాష్ట్రాల నుండి గ్రాంట్ గెలుచుకున్న 50 మంది కళాకారులు, ఆర్ట్ కలెక్టివ్స్‌కు మొత్తం రూ.60 లక్షల గ్రాంట్‌తో సత్కరిస్తారు. కళాత్మక వ్యక్తీకరణను ప్రోత్సహించే 'ఆర్ట్ ఫర్ హెూప్' కార్యక్రమం, కళాత్మక ప్రతిభను పెంపొందించడం, దేశ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటం, సృజనాత్మకత సామాజిక పురోగతికి తోడ్పడే భవిష్యత్తును పెంపొందించడంలో హెచ్ఎంఐఎఫ్ నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.

అధిక ప్రోటీన్ కలిగిన చిరుతిండిగా బాదంపప్పులకు గుర్తింపు

న్యూఢిల్లీ: ప్రపంచ ప్రోటీన్ దినోత్సవం సందర్భంగా, ఆల్మండ్ బోర్డ్ ఆఫ్ కాలిఫోర్నియా సహకారంతో నిర్వహించిన కొత్త యూగవ్ సర్వేలో, ఎక్కువ మంది భారతీయులు శక్తిని అందించడంలో, బలమైన రోగనిరోధక వ్యవస్థను నిర్వహించడంలో ప్రోటీన్ ముఖ్యమైన పాత్రను గుర్తించారని తేలింది. భారతదేశంలోని 17 నగరాల్లో 4,300 మంది స్పందనదారులతో నిర్వహించిన ఈ సర్వేలో, ప్రతి ముగ్గురు భారతీయులలో ఇద్దరు (65%) బాదంపప్పులను అధిక ప్రోటీన్ కలిగిన చిరుతిండిగా గుర్తించారని, లక్నో (38%), తిరువనంతపురం (37%), కోయంబత్తూర్ (34%), గౌహతి (34%), ఇండోర్ (31%) వంటి టైర్ 2 నగరాల్లో సైతం ఈ గుర్తింపు ఉందని తేలింది. ఆసక్తికరంగా, ఈ నగరాల్లో గుర్తింపు స్థాయిలు మెట్రోపాలిటన్ ప్రాంతాలలో ఉన్న వాటి కంటే ఎక్కువగా ఉన్నాయి, ఇది పట్టణ కేంద్రాలకు మించి ప్రోటీన్-అధికంగా కలిగిన స్నాక్‌గా బాదం యొక్క విస్తృత ఆమోదాన్ని సూచిస్తుంది.

మెడ్‌ట్రానిక్‌తో ఫిలిప్స్ భాగస్వామ్యం

గుర్గావ్: వైద్య సాంకేతికతలో అగ్రగామి అయిన మెడ్‌ట్రానిక్, ఆరోగ్య సాంకేతికతలో అగ్రగామి అయిన ఫిలిప్స్, స్ట్రక్చరల్ హార్ట్ డిసీజెస్ కోసం అధునాతన ఇమేజింగ్ టెక్నిక్‌లపై కార్డియాలజిస్టులు, రేడియాలజిస్టులకు అవగాహన కల్పించడానికి, శిక్షణ ఇవ్వడానికి భారతదేశంలో ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేస్తున్నట్లు ప్రకటించాయి. ముఖ్యంగా ఎండ్-స్టేజ్ రీనల్ డిసీజ్ (ఈఎస్ఆర్డీ) రోగులకు సేవలందించడంలో ఎకోకార్డియోగ్రఫీ (ఎకో), మాగ్నెటిక్ రెసొనెన్స్ ఇమేజింగ్(ఎంఆర్ఐ) వంటి మల్టీ-మోడాలిటీ ఇమేజింగ్‌లో 300 మందికి పైగా వైద్యుల నైపుణ్యాన్ని పెంచడాన్ని ఈ భాగస్వామ్యం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ శిక్షణ కార్యక్రమం ప్రఖ్యాత అంతర్జాతీయ, భారతీయ నిపుణుల మార్గదర్శకత్వంలో ఫిలిప్స్ అత్యాధునిక అల్ట్రాసౌండ్, ఎంఆర్ఐ వ్యవస్థలపై అందించే ఆచరణాత్మక అనుభవంతో కూడిన బోధనా సెషన్‌లను మిళితం చేస్తుంది.

వచ్చే వారం మూడు సామ్‌సంగ్ గెలాక్సీఎ సిరీస్ స్మార్ట్‌ఫోన్‌ల ఆవిష్కరణ

గురుగ్రామ్: సామ్‌సంగ్ వచ్చే వారం భారతదేశంలో మూడు కొత్త గెలాక్సీ ఎ సిరీస్ స్మార్ట్‌ఫోన్‌లను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తోంది. గెలాక్సీ ఎ భారతదేశంలో సామ్‌సంగ్ అత్యంత విజయవంతమైన స్మార్ట్‌ఫోన్ సిరీస్, సామ్‌సంగ్ ప్రతి సంవత్సరం లక్షలాదిగా ఈ ఫోన్లను విక్రయిస్తుంది. కొత్త గెలాక్సీ ఎ సిరీస్ స్మార్ట్‌ఫోన్‌లు గత సంవత్సరం విడుదల చేసిన గెలాక్సీ ఎ 35 మరియు గెలాక్సీ ఎ 55 స్మార్ట్‌ఫోన్‌ల వారసత్వాన్ని కలిగిఉంటాయి. గెలాక్సీ ఎ సిరీస్ స్మార్ట్‌ఫోన్‌లు కొత్త డిజైన్, మెరుగైన మన్నిక, అధునాతన భద్రతను కలిగి ఉంటాయి, ఇవి సౌకర్యవంతమైన, సురక్షితమైన వినియోగదారు అనుభవాన్ని నిర్ధారిస్తాయి. సంవత్సరాలుగా, సామ్‌సంగ్ గెలాక్సీ ఎ సిరీస్‌కు తమవైన రీతిలో ప్రతిష్ఠాత్మక ఫీచర్లను పరిచయం చేసింది.

హోమ్ లిఫ్ట్‌ను ప్రారంభించిన ఎలైట్ ఎలివేటర్స్

హైదరాబాద్: ప్రీమియం హెూమ్ లిఫ్ట్ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఎలైట్ ఎలివేటర్స్, తమ అత్యాధునిక ఎలైట్ ఎక్స్ 300 ఎక్స్ 300 ప్లస్ హెూమ్ లిఫ్ట్‌లు విడుదల చేసింది. దాని ఉత్పత్తి. పోర్ట్ ఫోలియోకు ఈ వినూత్న జోడింపులు ఆధునిక గృహ చలనశీలతలో కొత్త యుగాన్ని సూచిస్తాయని, లగ్జరీ, అధునాతన సాంకేతికత పర్యావరణ పరిరక్షణను మిళితం చేస్తాయని ఎలైట్ ఎలివేటర్స్ ఎండి విమల్ బాబు చెప్పారు. 2025 నాటికి యుఎస్ఏ, కెనడావంటి కొత్త భౌగోళిక ప్రాంతాలలో తమ మార్కెట్ ఉనికిని కార్యకలాపాలను విస్తరించే ప్రణాళికలతో, కంపెనీ హెూమ్ లిఫ్ట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందిఅన్నారు. కంపెనీ వృద్ధి పథం పట్ల తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, భారతీయ గృహ ఎలివేటర్ మార్కెట్ 2030 నాటికి 8-9 శాతం సీఏజీఆర్ వద్ద వృద్ధి చెందుతుందని, ఈ విస్తరణను సద్వినియోగం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

మహిళలను శక్తివంతం చేయాలి: గవర్నర్

హైదరాబాద్: మహిళలను విద్య, వాణిజ్యం, పారిశ్రామిక రంగాల ద్వారా శక్తివంతం చేయాల్సిన అవసరం ఉందని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పేర్కొన్నారు. మహిళా వ్యాపారులకు కొత్త అవకాశాలు అందించడమే లక్ష్యంగా కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (సీఓడబ్ల్యుఈ) ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మక ఉమెన్ ఇంటర్నేషనల్ సమిట్ ఆన్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ (డబ్ల్యుఐఎస్ఈ), బీ2బీ ఎక్స్‌పో 2025ను గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీలో ముఖ్య అతిథి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఈవెంట్ ఇన్నోవేషన్, సస్టైనబిలిటీ, అంతర్జాతీయ సహకార భావనను ప్రతిబింబిస్తుందన్నారు. మహిళా వ్యాపారవేత్తలను టెక్నాలజీ ద్వారా సాధికారత కల్పించేందుకు చర్చిస్తున్న ఈ సందర్భంలో వ్యాపార భవిష్యత్తు డిజిటల్తో ప్రపంచవ్యాప్తంగా అనుసంధానం అయ్యిందన్నారు. టెక్నాలజీ ద్వారా లింగ అసమానతలను తగ్గించుకోవాలన్నారు. కొత్త మార్కెట్లు తెరవాలన్నారు.

బాస్ వాలా చేతికి 'ఫ్రీడం' యాప్

హైదరాబాద్: ప్రముఖ పెట్టుబడిదారుడు, వ్యాపారవేత్త, బాస్ వాలా అధినేత శశి రెడ్డి ఆధ్వర్యంలోకి 'ఫ్రీడం' యాప్ వచ్చింది. ఈ యాప్ ఒక ఎడ్టెక్ ప్లాట్‌ఫారమ్. ఇది సువిజన్ హెూల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నడిచేది. ఇందులో బాస్ వాలా ఏడు మిలియన్ డాలర్లు (సుమారు 60 కోట్లు) పెట్టుబడి పెట్టింది. ఈ మేరకు ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా బాస్ వాలా వ్యవస్థాపకుడు, సీఈఓ శశిరెడ్డి మాట్లాడుతూ ఈ ఫ్రీడం యాప్ ద్వారా లభించే ఉపాధి ఆధార విద్యా కంటెంట్‌తో పాటు బాస్ వాలా వివిధ వ్యాపార రంగాల్లో వేల మంది నిపుణులను అందుబాటులోకి తెస్తుందన్నారు. టైర్ 2, టైర్ 3 పట్టణాల్లో వ్యాపారం ప్రారంభించాలని అనుకునే వ్యక్తులకు అవసరమైన వనరులు అందించనుందన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

విశాలాంధ్ర - వనపర్తి : రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మార్చి 2న ముఖ్యమంత్రి వనపర్తి జిల్లా పర్యటనను దృష్టిలో ఉంచుకొని శుక్రవారం ఉదయం జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, అదనపు కలక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు, జడ్పి సిఇఓ యాదయ్య, డిఎస్పీ వేంకటేశ్వరరావు, ఇతర సంబంధిత అధికారులతో కలిసి కే.డి.ఆర్. పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుచున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. బహిరంగ సభకు వచ్చే అతి ప్రముఖులు, రాష్ట్ర స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలకు అవసరమైన వసతులు పకడ్బందీగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులు ఉన్నారు.

లెక్కలేని లెక్కలు!

సంపాదకీయం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ ఎనకటికి ఒకడు 'కాణీ లేకుండా కాశీ యాత్రకు బయలుదేరి నట్లుంది'. ఊహలకందని లెక్కలు, కనులు కానని ఖర్చులు, అంచనాలకు మించిన అప్పులు... వెరసి వచ్చే ఐదేళ్లలో ఆంధ్రాకు అమరావతి తప్ప ఇంకేమీ మిగిలేటట్లు లేదు. 'అభివృద్ధి-సంక్షేమం సమతూకం' అనే పేరుతో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ చూస్తే సమతూకమేమోగాని ఈ రెండింటి మధ్య అంతులేని అంతరం అనివార్యంలా కన్పిస్తోంది. రూ.3,22,359 కోట్లతో భారీ బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ఇందులో రెవెన్యూలోటు రూ.33,185 కోట్లు, ద్రవ్యలోటు రూ.79,926 కోట్లు. ఈ తరహా అంచనా వ్యయంతో అడుగులేస్తే, పూర్తిస్థాయి అభివృద్ధీ సాధ్యం కాదు, అలాగని అందరికీ సంక్షేమమూ అసాధ్యమే. రెండింటిలోనూ కోత తప్పదని ఈ బడ్జెట్‌తో తేలిపోయింది. దీన్ని అతీగతీలేని బడ్జెట్ అని అనలేం. ఎందుకంటే ఈ బడ్జెట్‌కు 'అతి' కాస్త అధికంగానే ఉంది. 'గతి' మాత్రం ఎక్కడో తప్పినట్లుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో 4 లక్షల 21 వేల 201 కోట్ల రూపాయలు అప్పు చేశారని బడ్జెట్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా ప్రకటించింది. ఇప్పుడు మరి కూటమి సర్కారు దాదాపు 7 లక్షల కోట్ల రూపాయలకు పైగా అప్పు చేసినట్లుగా అంచనా. ఇంకోవైపు పూడ్చలేని లోటు కన్పిస్తోంది. ఈ నేపథ్యంలో 3 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ నిర్వహణ ఎలా సాధ్యం? ఇంత లోటును ఎలా పూడుస్తారు? అప్పులు చేస్తారా? ఆస్తులు అమ్ముతారా? లేక ప్రజలపై భారం మోపుతారా? దీనిపై స్పష్టత ఎక్కడుంది? అప్పుచేసి పప్పుకూడు తింటే జగన్ ప్రభుత్వానికీ, చంద్రబాబు ప్రభుత్వానికీ తేడా ఏముంది? ఏతావాతా గత ప్రభుత్వ బాటలోనే కూటమి కూడా నడుస్తోందని చెప్పక తప్పదు. అందరూ ఆ తాను ముక్కలేనని దానర్థం.

2024 ఎన్నికల ప్రచారంలో ఎన్‌డీఏ కూటమి (టీడీపీ+జనసేన+బీజేపీ) విపరీతంగా వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చింది. 'సంతకాడ సరుకులు కొనుడు కన్నా చాకిరేవులో ఉతుకుడు మేలన్నట్లు'గా జగన్ పెట్టిన హింసను భరించలేక ప్రజలు తప్పని పరిస్థితుల్లో కూటమిని కుర్చీలో కూర్చోబెట్టారు. అయితే అధికారంలోకి వచ్చిననాటి నుంచీ 'బాబు అండ్ కో' మోదీని స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తామని పదే పదే ప్రగల్భాలు పోతున్నారు. బడ్జెట్ ప్రసంగంలోనూ మంత్రివర్యులు పదిమార్లు 'మోదీ స్ఫూర్తి'ని ప్రస్తావించారు. ఇదో రకమైన విడ్డూరం. అస్తవ్యస్థ ఆర్థిక విధానాలతో దేశాన్ని దరిద్రావస్థలోకి నెట్టేసిన మోదీని స్ఫూర్తిగా తీసుకుంటే...ఇంకేమైనా ఉందా? ఈ రాష్ట్రాన్ని ఏం చేయాలని? అదెటు పోవాలని? అర్థంలేని కథతో అట్టర్‌ఫ్లాప్ హీరోను పట్టుకొని వందరోజుల సినిమా ఆడించాలంటే ఎలా? అందుకే తాజా బడ్జెట్‌కు దిశానిర్దేశం లేకుండా పోయింది. సూపర్‌సిక్స్ పేరుతో చేసిన ఎన్నికల వాగ్దానాలకు బడ్జెట్‌లో పరిపూర్ణంగా స్థానమిచ్చినట్లు గోచరించడం లేదు. సూపర్‌సిక్స్‌ను పూర్తిగా గాలికొదిలేశారా అన్న అనుమానమూ రాకమానదు. ఉచిత బస్సును అటకెక్కించారు. మహాశక్తి పేరుతో ప్రతినెలా మహిళకు రూ.1500 ఇస్తామన్నారు. బడ్జెట్‌లో ప్రస్తావించనేలేదు. ప్రతి నెలా నిరుద్యోగ భృతి రూ.3000 ఇస్తామన్నారు. దీనికి దిక్కులేదు. జాబ్ క్యాలెండర్ జాడలేదు. బీసీలకు 50 ఏళ్లు దాటితే పెన్షన్, చంద్రన్న బీమా పథకాలనూ పక్కనపెట్టేశారు. ఆటో, టాక్సీ, లారీ డ్రైవర్లకు ఏటా రూ.15,000 ఇస్తామని ప్రకటించారు. అదీలేదు. లాయర్లకు నెలకు రూ.10 వేలు, కాపు సంక్షేమానికి రూ.15,000 కోట్లు, పెళ్లికానుక లక్ష రూపాయలు ఇస్తామని డాంబికాలు పలికారు. వాటిని పూర్తిగా మర్చిపోయారు. ఇక తల్లికి వందనం, దీపం పథకాల్లోనూ భారీ కోత విధించారు. రెండేళ్ల తల్లికి వందనానికి రూ.25 వేల కోట్లు కావాలి. కేవలం రూ.9,400 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నారు. కోటీ 55 లక్షల మంది దీపం లబ్దిదారులను 90 లక్షలకు కుదించడమే గాక, బడ్జెట్‌లో రూ.4 వేల కోట్లను కాస్త రూ.2,601 కోట్లకు తగ్గించేశారు. డ్వాక్రా మహిళలకు 10 లక్షల వరకూ సున్నావడ్డీకి రుణమిస్తామని ప్రకటించిన కూటమి ఈ బడ్జెట్‌లో దానిపై ఒక్క మాటా చెప్పలేదు. అంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీలేవీ 2025-26 బడ్జెట్‌లో కానరాలేదంటే, దానర్థం నాటి వాగ్దానాలను పూర్తిగా విస్మరించినట్లేనా? ఒట్టుని తీసి గట్టుమీద పెట్టి నాలుగు సంచికల్లో బడ్జెట్ లెక్కలు చెపితే, జనం నమ్ముతారా? అరచేతిలో అద్భుత రాజధాని పెరుమాళ్లకెరుక! కళ్లముందు కన్పించే అప్పులకుప్ప ఆందోళనకరం. వ్యవసాయ రంగానికి, నీటిపారుదల రంగానికి ప్రాధాన్యతే ఇవ్వలేదు. సాగునీటి రంగానికి కనీసం 10% కేటాయింపులు ఉండాలి. అంటే లెక్క ప్రకారం బడ్జెట్‌లో రూ.32 వేల కోట్లు కేటాయించాలి. కానీ ఈరోజున సాగునీటికి కేటాయించింది కేవలం రూ.11,314 కోట్లు మాత్రమే. 3.5% కూడా లేదు. పోలవరం కాకుండా రాష్ట్రంలో సాగునీటికి రూ.77,845 కోట్ల రూపాయలు కావాలి. ఒక్క రాయలసీమకే రూ.40,480 కోట్లు అవసరం. ఉత్తరాంధ్రకూ అంతే. ఈ అరకొర కేటాయింపులతో కచ్చితంగా రాయలసీమ, ఉత్తరాంధ్రలకు అన్యాయం జరుగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. కేంద్రంలోని ఎన్‌డీఏ పుణ్యమా అని ద్రవ్యోల్బణం దెబ్బకు, ధరల దరువుకు సామాన్యుడు ఏభై కిలోల గోనెసంచిలో అరకిలో వంకాయలేసుకొని ఇంతే ప్రాప్తమన్నట్లు జీవితాన్ని నెట్టుకొస్తున్నాడు. ఈ పరిస్థితుల్లో ధరల స్థిరీకరణకు మన రాష్ట్రంలో కనీసం రూ.4,500 కోట్లు అవసరం. కానీ రూ.300 కోట్లే కేటాయించారు. గిట్టుబాటుధరల్లేక రైతులు ఓపక్క అల్లాడుతుండగా, సరసమైన ధరలకు సరుకులు సగటుజీవికి అందక కళ్లు బైర్లుకమ్ముతుంటే, ఈ నిధులు సరిపోతాయా? అదే విధంగా అన్నదాత సుఖీభవకు రూ.10,400 కోట్లు అవసరం కాగా రూ.6,300 కోట్లు మాత్రమే కేటాయించారు. మ్యాచింగ్ గ్రాంట్ల కోసం నిరీక్షిస్తూ రైతన్న పొట్టకొట్టడం ఎంతవరకు సబబు. కడుపునింపని కొటేషన్లు మాత్రం బడ్జెట్ పుస్తకంలో బోలెడన్ని ఉన్నాయి. గారిడీలెక్కలూ గాదెకింద పందికొక్కుల్లా బలిసికొట్టుకుంటున్నాయి. ఈ రాష్ట్రాన్ని ఎటు మోసుకుపోవడానికో అర్థం కావడం లేదు. ఈ బడ్జెట్‌తో 'భవిష్యత్ చిత్రమొకటి' స్పష్టంగా కన్పిస్తోంది. కూటమి పాలనలో ఏపీ చరిత్రలోనే రికార్డు స్థాయి అప్పులకు రంగం సిద్ధమైందని నూటికి నూరుపాళ్లు బడ్జెట్ కుండబద్దలుకొట్టి విపులీకరిస్తోంది.

శ్రీశ్రీ కవితా వారసుడు కె.రా.

గోలి సీతారామయ్య

కమ్యూనిస్టు కవి కాగితాల రాజేశ్వరరావు (కె.రా.)ను తలచుకోవటమంటే 70 దశకపు ఉద్యమాల రోజులను తలచుకోవడమేనని చెప్పాలి. యువజన సమాఖ్య, అభ్యుదయ రచయితల సంఘం (అరసం), ప్రజానాట్యమండలి వేదికలపైన, అప్పుడప్పుడు పార్టీ వేదికలపైన మహోగ్రరూపంతో, ఆవేశభరితంగా ఉపన్యాసాలిస్తున్న కాలం అది. పర్వతాలు విరిగిపడుతున్న చప్పుడు, శ్రీశ్రీ హోమజ్వాలల భుగభుగలు కె.రా. ఉపన్యాసాల్లో విన్న వాళ్లు, కళ్లారా చూసి ఆనందించినవాళ్లు ఇప్పటికీ సందర్భం వచ్చినప్పుడు గుర్తు చేసుకుంటుంటారు. కె.రా. ఒక ఆశ్చర్యం, ఒక ఆవేశం, ఇంకా చెప్పాలంటే ఒక అద్భుతం. ఇల్లూ, వాకిలీలేని దిగువ మధ్యతరగతికి చెందినవాడికి ఇంత విప్లవం (విపరీతం) తగునా అని విస్తుబోయిన వాళ్లు వున్నారు. ఏదో హితవు చెప్పబోయిన వాళ్లకి విశాలాంధ్ర నా చిరునామా, పామీదత్ భవన్‌లోనే (అప్పట్లో సీపీఐ జిల్లా, నగర సమితి కార్యాలయం) మా నిత్య వ్యాపకమని అనేవాడు. వైయక్తికమైన ఆస్తిపాస్తుల గురించి ఎప్పుడూ పాకులాడ లేదు. విజయవాడ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన తండ్రి కాగితాల కృష్ణమూర్తి నుంచి సంక్రమించిన కమ్యూనిస్టు ఆశయానికి, ఆవేశం మేళవించిన ఒక రసభరితమైన ఆవిష్కరణ కె.రా. విజయవాడలో ప్రత్యేకించి ఏలూరు రోడ్డుపైన పార్టీ ప్రతి ఊరేగింపులో ఎర్రజెండాగా ఎగిరి, నినాదమై మోగినవాడు. న్యూ ఇండియా హోటల్ సెంటర్‌లో జరిగే బహిరంగ సభల్లో నినాదాలు ఇవ్వడంలో కె.రా. ఒక ప్రత్యేకమైన ఆకర్షణ. గొంతులో స్పష్టమైన భాష, గంభీరమైన స్వరం వల్ల రాజేశ్వరరావు ప్రజానాట్యమండలి కళా ప్రదర్శనల్లో ముందుగా ప్రేక్షకుల్ని అలర్ట్ చేసే వ్యాఖ్యాతగా, నటుడుగా, రచయితగా మారిపోయాడు. ఇది ఇష్టపూర్వకంగా చేసిన ఒక సాంస్కృతికోద్యమ ప్రయాణం. ఇక సాహితీలోకంలో తనకంటూ ఒక పీట వేసుకు కూర్చున్నాడు. ఎన్నో మెరుపులు మెరిపించాడు. మిత్రులంతా ఆప్యాయంగా కె.రా. అని పిలుచుకునే కాగితాల రాజేశ్వరరావు విశాలాంధ్ర దినపత్రిక కేంద్రంగా తన కవితా ప్రస్థానం ప్రారంభించాడు. అభ్యుదయ సాహిత్యోద్యమంలో ప్రముఖ పాత్ర వహించాడు. కె.రా. అంటే ఒక నిబద్ధత. ఒక అలుపులేని ప్రయాణం. పీడిత ప్రజల పక్షాన నిలిచి అగ్నిసుమమై వికసించిన వాడీ వేడి గల ఉత్తేజం.

1971లో మంగళాపురం, తాడేపల్లిగూడెంలో పార్టీ నిర్వహించిన రాజకీయ శిక్షణా శిబిరాల్లో కె.రా. పాల్గొనడమే గాక విశాలాంధ్ర దినపత్రిక సబ్ ఎడిటర్ గంజి వీరా, మల్నీడి సమత, అరుణోదయ ప్రింటింగ్ ప్రెస్ శానం శేషగిరి రావు (శేషు) తదితర మిత్రులతో అరుణోదయం నాటిక ప్రదర్శించాడు. పార్టీ ఈ కాలంలోనే సమరశీల ప్రజోద్యమాలు చేపట్టింది. అధిక ధరలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా సాగిన పోరాటంలో కె.రా. అరెస్టయి లాఠీదెబ్బలు తిని, నెల రోజులు జైలులో వున్నాడు. అప్పుడే "ఉక్కు కటకటాల వెనుక ఒక్కడినే మెలకువలో" అనే ప్రసిద్ధ గేయం రాశాడు. ఈ దశలోనే పెద్ద ఎత్తున భూపోరాటాలు, అరసం, ప్రజానాట్యమండలి పునర్ నిర్మాణాల కోలాహలం, వెంటనే విజయవాడ (1975)లో పార్టీ 10వ మహాసభలు అద్భుతమైన రీతిలో దిగ్విజయంగా జరిగాయి.

రాష్ట్రంలో ఈ మహాసభలు ఒక చరిత్ర సృష్టించాయి. వేలాదిమంది యువతీ యువకులు సమీకృతమయ్యారు. కడలి కెరటాల మాదిరి ఉత్సాహ సంద్రాన ఉప్పొంగి పోయారు. పార్టీకి సముచితమైన యువనేతలు కూడా ఈ కాలంలోనే రూపుదిద్దుకున్నారు. సరిగ్గా ఈ సంరంభపు కాలంలో కె.రా. నాటికలు, పాటలు, గేయాలు రాశాడు. 'నా పార్టీ' అనే పేరుతో గేయ కావ్యం రాయాలని అప్పుడే అనుకున్నాడు. పార్టీ స్వర్ణోత్సవాల సందర్భంగా దాన్ని సంక్షిప్తంగా రాసి శ్రీకారం చుట్టాడు. అరసం తరఫున కవితా గోష్ఠులు నిర్వహించాడు. విజయవాడ ఏలూరు రోడ్డులో విశాలాంధ్ర బుక్ హౌస్ మేడపైన అరసం తరఫున జరిగే సాహిత్య సభల్లో అమెరికన్ కమ్యూనిస్టు ఏంజెలా డేవిస్‌ను (ఏంజెలా డేవిస్ స్త్రీల హక్కుల కోసం, జాతి వివక్షతకు వ్యతిరేకంగా పోరాడిన యోధురాలు. 1980, 1997ల్లో అమెరికా వైస్ ప్రెసిడెంట్‌గా కమ్యూనిస్టు పార్టీ తరఫున పోటీ చేశారు.) విడుదల చేయాలని కె.రా. నిప్పులు కురిపించే వాగ్ధాటితో మాట్లాడుతుంటే తొలి ఎర్రజెండా కవి తుమ్మల వెంకటరామయ్య విస్తుపోయి అభినందించారని ఆర్టిస్ట్ మోహన్ "రాజేశ్వరరావును కన్నకాలం గురించి" అనే వ్యాసంలో రాశాడు. మిలిటెంట్ అనే పత్రికను నడిపాడు. కృష్ణా జిల్లా అరసం ప్రధాన కార్యదర్శిగా చాలా కాలం పనిచేశాడు. ఒక్కమాటలో చెప్పాలంటే మహాకవి శ్రీశ్రీ ఆశించిన ముందుయుగం దూతగా కె.రా. నిలిచాడు. తన రాజకీయ చైతన్యాన్ని, కవితాశక్తిని ఉద్దీపనం చేసుకున్నాడు. ప్రతిక్షణం ప్రజా

శ్రేయస్సుకు పరితపించాడు. తన కలం, గళం ద్వారా శ్రామికజన సమరాలకు నీరాజనం పట్టాడు. 1970వ దశకంలో కొత్త గొంతులు లేచాయి. శ్రీశ్రీ వారసులు కొంతమంది వచ్చారంటూ ఒకటే సందడి. నిజమే కాలం అలాంటి వారసుల్ని తీసుకువచ్చిన మాట వాస్తవమే. కాగితాల రాజేశ్వరరావు ఆ వరసలో ముందు భాగంలో ఉన్నమాట కూడా నిజమే. మార్క్సిజాన్ని శ్రీశ్రీ తెలుగు సాహిత్యానికి దారిచూపించే టార్చిలైట్‌గా చేశాడు. మార్క్సిజం తాత్విక పునాదిగా కష్ట జీవుల కోసం ఆవిర్భవించిన కమ్యూనిస్టు పార్టీని, దాని త్యాగాల నెత్తుటి జాలుల్ని కవిత్వమయం చేసినవాడు కె.రా. ఆయన గురించి తెలియని కొత్త తరం కవితాలోకంలోకి వచ్చేసింది. ఇంకో విషయం ఏమంటే కె.రా. బతికి వున్నప్పుడు తన కవిత్వాన్ని పుస్తక రూపంలో చూసుకోలేక పోయాడు. దీనివల్ల కె.రా. కవిత్వం సాహితీలోకానికి ఆలస్యంగా అందింది. దీనివల్ల కె.రా. గురించి తెలియనివారికి కొంత అతిశయోక్తి అనిపించినప్పటికీ, శ్రీశ్రీకి సముచిత కవితా వారసుడు కెరా అని చెప్పటానికి "నా పార్టీ" కావ్యం ఒక ప్రబలమైన ఉదాహరణ.

కవిత్వారంభం నుంచి సుప్రసిద్ధ కవి గజ్జెల మల్లారెడ్డి, రాంభట్ల ప్రభావంతో ఎదిగిన కె.రా. మాత్రాబద్ధ ఛందస్సులో కవిత్వాన్ని రాయడం అలవాటుగా చేసుకున్నాడు. శబ్దం, అర్థం జమిలిగా ఉండి అంత్యప్రాసలతో అలరారడం దీని నిజమైన సొగసు. చదివినవారి హృదయంలో కె.రా. కవిత్వం తిష్ట వేసుక్కూర్చుంటుంది. అందుకే కె.రా. కంటే ఆయన కవిత్వం చాలామంది మిత్రులకు గుర్తుండిపోయింది. కాలక్రమంలో తన స్థానాన్ని, తన ప్రత్యేకతను నిలబెట్టుకున్న ప్రతిభావంతమైన కవనశీలి కె.రా.

1925 నుంచి జాతీయోద్యమంలో భాగంగా భారత కమ్యూనిస్టు పార్టీ చేసిన సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానం, సంస్థానాల రద్దు కొరకు సమరశీల పోరాటాలు, ఉత్తేజభరితమైన మహత్తర సంఘటనల్ని కెరా కావ్యమయం చేశాడు. త్రికరణ శుద్ధిగా నమ్మిన ఆశయాన్ని, పార్టీపై ఉన్న ఎనలేని ప్రేమను కె.రా. ఈ విధంగా వ్యక్తీకరించాడు. కె.రా. కవితా ప్రస్థానంలో ఇది ఒక మైలురాయి.

చిలీ దేశపు మహాకవి పాబ్లో నెరుడా కవితను "శిక్షించాలంటున్నా" పేరుతో 1972 లోనే కె.రా. తెలుగులోకి అనువదించాడు. దాన్ని మరలా ఆర్టిస్ట్ మోహన్ చొరవతో 2003లో పునఃముద్రణ జరిగింది. మోహన్ ముందుమాట రాసి బొమ్మలు వేశాడు. దీన్ని చూసిన ప్రముఖ సాహితీవేత్త చేకూరి రామారావు కె.రా. కవితాశక్తిని గుర్తించి "ఛందోతరంగవేది రాజేశ్వరరావు" అనే పేరుతో రాసిన ముందుమాటలో "ఇవి ఆయన కోరితే రాసినవి కావు. నా మనస్తృప్తి కోసం రాసినవి. చివరగా ఒక మాట చెప్పనా? ఆయన కవిత్వంలో ఆత్మదర్శనం చేసుకుంటున్నాను" అన్నారు. ఇది కె.రా.కు లభించిన మంచి గుర్తింపు. అన్ని ప్రక్రియల్లో రచనలు చేసినా కె.రా. సాహితీ వ్యాసంగంలో కవిత్వానిదే పెద్దపీట. తన నవలలకు ప్రారంభంలోను, అధ్యాయాల దగ్గర కవితా పంక్తులతో ప్రారంభించటం చేసేవాడు. కె.రా. సృష్టించిన మొత్తం కవిత్వం అంతా ఒక ఎత్తయితే "నా పార్టీ" గేయం ఒక ఎత్తు. ఈ దీర్ఘకావ్యం కె.రా. ప్రాణమని చెప్పాలి. నా పార్టీ కావ్యం ఒక్కమాటలో చెప్పాలంటే ఉదాత్తమైన ఆశయం, ఉన్నతమైన ఉద్యమాచరణలకు ప్రశంసనీయమైన కవితాభిషేకం. కవిత్వాన్ని లక్ష్యశుద్ధితో ప్రేమించి, ఆరాధించి, సృజించడమే గాక, జీవితమే కవిత్వంగా బతికిన కమ్యూనిస్టు కవి రాజేశ్వరరావు.

అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,
సెల్ : 99491 45650

సీపీఐ - క్విట్ ఇండియా ఉద్యమం

ఆర్వీ రామారావ్

మహాత్మా గాంధీ నాయకత్వంలో జరిగింది మాత్రమే జాతీయోద్యమం కాదు. అది ప్రధాన స్రవంతి అన్నది వాస్తవం. అనేక ఇతర పోరాటాలూ ఉన్నాయి. వలసవాద పోరాటంలో గాంధీ-నెహ్రూ వారసత్వం నిస్సందేహంగా బలమైందే. సుభాశ్ చంద్రబోస్ నాయకత్వంలో ఆజాద్ హింద్ ఫౌజ్ పోరాటం, రాయల్ ఇండియన్ నేవీ ఉద్యమమూ గణనీయమైనవే. రెండవ ప్రపంచ యుద్ధం తరవాత మన దేశంలో వలసవాద పాలన కొనసాగించడం అసాధ్యమై పోయింది. కమ్యూనిస్టు పార్టీ, ఇతర కమ్యూనిస్టు బృందాలు సాగించిన పోరాటమూ ప్రబలమైందే. కమ్యూనిస్టు పార్టీ పత్రాలలో సీపీఐ పాత్ర నిక్షిప్తమై ఉంది. క్విట్ ఇండియా ఉద్యమంలో కమ్యూనిస్టు పార్టీ పాల్గొనలేదని వాదించే వారూ ఉన్నారు. ఈ మాట చెప్పే వారు కమ్యూనిస్టు పార్టీ పాత్రను, స్వాతంత్ర్యోద్యమంలో ఏ పాత్ర లేని ఆర్.ఎస్.ఎస్, హిందూ మహాసభను, సీపీఐని ఒకే గాటన కట్టేవారికీ కొదవలేదు.

క్విట్ ఇండియా ఉద్యమంలో కమ్యూనిస్టు పార్టీ పాల్గొనక పోవడానికి ప్రత్యేకమైన కారణాలు ఉన్నాయి. క్విట్ ఇండియా ఉద్యమానికి ముందు కమ్యూనిస్టు పార్టీ వలసవాద వ్యతిరేక ఉద్యమాన్ని చాలా బలంగానే నిర్వహించింది. ఆర్.ఎస్.ఎస్., హిందూ మహాసభకు ఇలాంటి చరిత్ర లేదు. 1920ల నుంచే అంటే సీపీఐ ఏర్పడక ముందే కమ్యూనిస్టులు స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న దాఖలాలు ఉన్నాయి. 1922-1927 మధ్య మోపిన పెషావర్ కుట్ర కేసు, 1924-1925 నాటి కాన్పూర్ కుట్రకేసు, 1929-1933 మధ్య సాగిన మీరట్ కుట్రకేసులో నిందితులందరూ కమ్యూనిస్టులే. వ్యవస్థాపరంగా సీపీఐ ఏర్పడడానికి ముందు కూడా కమ్యూనిస్టు భావజాలం ఉన్న వారు సమరశీలంగా



పోరాడారు. ఈ పోరాటాల్లో షౌకత్ ఉస్మానీ, ఎస్.ఎ.డాంగే, ముజఫర్ అహమద్, సోహన్ సింగ్ జోష్, పి.సి.జోషి, ఫిలిప్ స్ప్రాట్ లాంటి వారి పాత్ర అద్వితీయమైంది. వీరి మీద భారత శిక్షాస్మృతిలోని 121 ఎ ప్రకారం దేశ ద్రోహం కేసులు కూడా మోపారు.

స్వయం నిర్ణయాధికారంతో కాంగ్రెస్ సంతృప్తి పడుతున్న రోజుల్లోనే కమ్యూనిస్టులు సంపూర్ణ స్వాతంత్ర్య నినాదం ఇచ్చారు. 1921లో అహమదాబాద్ లో జరిగిన కాంగ్రెస్ మహాసభలో మౌలానా హస్రత్ మోహానీ సంపూర్ణ స్వాతంత్ర్య నినాదం ఇచ్చారు. ఒక తీర్మానం కూడా ప్రతిపాదించారు. 1925లో సీపీఐ వ్యవస్థా రూపం సంతరించుకున్నప్పటి నుంచీ సంపూర్ణ స్వాతంత్ర్యం కోసమే నినదిస్తూ వచ్చింది. అందుకే సీపీఐ మీద నిషేధం విధించారు. 1927లో బొంబాయిలో ఆమోదించిన నూతన నిబంధనావళిలో కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ స్వాతంత్ర్యం కోసమే పిలుపు ఇచ్చింది. దానితో పాటు వయోజనులందరికీ ఓటు హక్కు, భూస్వామ్య వ్యవస్థ రద్దు, ప్రజా వ్యవస్థల జాతీయకరణ లాంటి అంశాలను సీపీఐ లేవనెత్తింది. 1931లో సీపీఐ బ్రిటిష్ కర్మాగారాలను, బ్యాంకులను, జల మార్గాలను, రైల్వే, సముద్ర మార్గాలను జాతీయం చేయాలని గట్టిగా కోరింది. రైతుల రుణాలన్నింటినీ రద్దు చేయాలన్నదీ సీపీఐ ప్రధాన నినాదంగానే ఉంది. కార్మికుల వేతనాలు పెంచాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని, సమాన పనికి స్త్రీ పురుషులకు సమాన వేతనం ఉండాలని కూడా సీపీఐ పోరాడింది. ఈ లక్ష్యాలను సాధించడంలో భాగంగానే సీపీఐ కార్మిక సంఘాలను, రైతు సంఘాలను, మహిళా సంఘాలను, విద్యార్థి సంఘాలను, కళాకారుల-రచయితల సంఘాలను నెలకొల్పి ఉద్యమ పరిధిని విస్తృతం చేసింది. రెండో ప్రపంచ యుద్ధం మొదలు కాగానే యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలను నిర్వహించింది కూడా కమ్యూనిస్ట్ పార్టీయే. ఈ ప్రదర్శనల్లో లక్షలాది మంది పాల్గొన్నారు. యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలకు సుభాశ్ చంద్ర బోస్ మద్దతు ఇచ్చారు.

జర్మనీ సోవియట్ యూనియన్ మీద దాడి చేసిన తరవాత రెండో ప్రపంచ యుద్ధంపై సీపీఐ వైఖరి మారింది. ఫాసిస్టు వ్యతిరేక శక్తులను సమైక్య పరిచి పోరాడాలని నిర్ణయించింది. ఈ కారణంగానే సీపీఐ క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనలేదన్న అభిప్రాయం బలపడింది. కానీ సత్వరం స్వాతంత్ర్యం ప్రకటించాలని కోరుతూ సీపీఐ రైతులను, కార్మికులను సంఘటితం చేసింది. సీపీఐ ఆవిర్భవించిన నాటి నుంచే సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పోరాడుతూ వచ్చింది. ఇదే తమ అంతిమ లక్ష్యం అని భావించింది. కాంగ్రెస్ సంపూర్ణ స్వాత్యం అడగడానికి దాదాపు దశాబ్దం ముందు నుంచే సీపీఐ సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం నినదిస్తూనే ఉంది. బ్రిటిష్ వారిని ప్రథమ శత్రువుగా భావించింది. క్విట్ ఇండియా ఉద్యమం కొనసాగుతున్న సమయంలో సీపీఐ దేశ వ్యాప్తంగా రైతులను, కార్మికులను సమీకరించడంలో నిమగ్నమైంది. సీపీఐ క్విట్ ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించడానికి కారణాలను ఈ నేపథ్యంలో చూస్తే భిన్న వైఖరి అనుసరించడానికి కారణం ఏమిటో తెలుస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో భాగం కావాలని సీపీఐ భావించింది. దీనిలో భాగంగా రాజీ లేని పోరాటం చేసింది. అందుకే ఒక వైపు ప్రపంచ యుద్ధం సాగుతున్నా సీపీఐ వివిధ వర్గాల వారిని సమీకరించగలిగింది. మొదట్లో సీపీఐ క్విట్ ఇండియా ఉద్యమంలో భాగమైనా తరవాత ఆ ఉద్యమం హింసా మార్గం పట్టినందువల్ల ఆ ఉద్యమానికి దూరంగా ఉండిపోయింది. నాజీ శక్తులు సోవియట్ మీద దాడి చేస్తున్న సమయంలో క్విట్ ఇండియా ఉద్యమం అనడం అదును కానప్పుడు ఉద్యమించడం అని సీపీఐ భావించింది. క్విట్ ఇండియా ఉద్యమంలో సీపీఐ పాల్గొన లేదని నిందించే వారు జపాన్ సేనలు భారత భూభాగంలోకి చొచ్చుకు వస్తున్న వాస్తవాన్ని గుర్తించలేదు.

గుప్పెడు కన్నీళ్లు... చారెడు ప్రేమల కవిత్వం

కవిత్వం రాయడమంటే సలసల కాగిపోవడం కదా... పదం పుట్టుకకు పరవశించడం కదా... సెలయేరు కావడం... కన్నీటి చెలమ కావడం.. ఫకాలున ఏడ్వడం...ఫెడిల్మని నవ్వడం... తెలియని వారిని తలచుకోవడం... తెలిసిన వారిని అసహ్యించుకోవడం...తెలిసీ తెలియని వారి కోసం వెదుకులాడుకోవడం... వెర్రిగా ఆకాశం వైపు చూడడం... ఆవేశంగా భూమిని కౌగలించుకోవడం... భూమ్యాకాశాల మధ్య ఏమీలేని ఖాళీ తనంలోకి పరువులు పెట్టడం. ఇదే కవిత్వమంటే. మనిషవ్వడం... కాలేకపోతున్నందుకు వగచడం. కాలేని వారిని చూసి "ఇలా బతుకుతున్నారర్రా" అని నాలుగు పద్యాలతో వారిలో కదలిక తీసుకువచ్చేందుకు ప్రయత్నించడం. కవిత్వమంటే మనల్ని మనం పుటం పెట్టుకుని మనిషి రూపం దాల్చడం. ఇదంతా ఎలా అంటారా... ఇదిగో ఈ నెల్లూరమ్మాయి సుధా మురళిలాగన్నమాట. "కళ్లకు నిండుగా కాటుక పెట్టుకున్నట్టు/చిక్కటి నవ్వు నవ్వుతావే నిజమేనా అది / అసలు నీదేనా హాసమది" ఇలా ప్రశ్నించడమే కాదు. కుదిపేయడమే కదా కవిత్వమంటే. ఇదంతా అసంపూర్ణమే అని తెలియడమే కదా సంపూర్ణం కావడమంటే. ఓ వేదనని మోస్తూ బతుకుతున్నాం కదా... దానికే నాలుగు అక్షరాలిచ్చి నిలువెత్తు మనిషితనం కూర్చాలనుకున్న కవిత్వమే రాశారు ఈ సుధా మురళి. ఓ సోమవారం ఉదయపు వేళ అలవాటుగా తిరగేస్తున్న ఓ పత్రిక సాహిత్య పేజీలో ఈ సుధామురళి కవిత ఒకటి చూశాను. కింద పేరు కాకుండా కవిత్వం మాత్రమే చదివే అలవాటున్నందున ఆ పనే చేశాను. భలే రాశారు ఎవరో అనుకుంటూ కింద పేరు చూశాను. ఈ పేరే. సుధామురళి. ఆ కిందనే ఫోన్ నంబర్ కూడా ఉంది. చాలా సేపు తటపటాయించాను ఫోన్ చేసేందుకు. అమ్మాయా... అబ్బాయా... భార్య పేరు ముందు పెట్టుకుని కవిత్వం రాసిన పురుషుడా... భర్త పేరు వెనుక పెట్టుకుని రాసిన స్త్రీ మూర్తా అన్నదే నా సంశయం. కారణమేంటంటే ఆ రోజు నేను చదివిన కవిత కచ్చితంగా మహిళే రాసి ఉండాలి. ఎందుకంటే అంతటి వేదన అనుభవించాక దాన్ని అక్షరంగా మార్చడం మగాడికి సాధ్యం కాని పని. ఎందుకు సాధ్యం కాదో సాటి పురుషుడిగా నాకు అనుభవమే. స్త్రీ అయినా కాని అంత బలంగా చెప్పడం కూడా సాధ్యం కాదు. అయినా అలాంటి కవిత రాశారంటే కచ్చితంగా మరిన్ని మంచి పద్యాలు ఇంతకు ముందు రాసి ఉండవచ్చు అనుకున్నాను. ఎవరైనా కానీ రోజు వారి జీవితంలో ఎదురయ్యే అనేకానేక సంఘటనలను మోసుకుంటూ మానవత్వం తొణికిసలాడుతూ బతకడం ఈ కాలంలో సాధ్యం కాదు. ఇదిగో, ఇలా కవిత్వమై వెలిగిన తర్వాత మాత్రమే మన కళ్లకు ఎరగడం నేర్పిస్తారు. ఆ పద్యం చదివిన రోజే మధ్యాహ్న వేళ ఫోన్ చేశాను. అవతలి

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

నుంచి స్త్రీ గొంతు " హలో" అంటూ. నేను కుదట పడ్డాను. చెప్పకపోవడమే " అమ్మాయే రాసింది ఈ కవిత" అని ఓ అసంకల్పిత భయానికి సమాధానం చెప్పుకున్నాను. పెద్దగా మాటల్లేవు. " బాగుందమ్మా కవిత " నేను. " థాంక్స్ సార్" సుధమ్మ. నిజానికి చాలా మాట్లాడాలనే అనుకున్నాను ఫోన్‌కి ముందు. కానీ సుధమ్మ గొంతు విన్నాక మాట పెగల్లేదు. ఆమే కాదు... అతను కావచ్చు... మరెవ్వరో కావచ్చు... నీకు పరిచయం లేని వారే కావచ్చు... నువ్వు ఇంతకు ముందు వినని వారే కావచ్చు... నీకు ఇంతకు ముందు తారసపడని వారే కావచ్చు... ఒక్క పద్యంతో నిన్ను ఖండఖండాలుగా చేసిన తర్వాత మాటలెలా వస్తాయి. ఒక్క వాక్యంతో నీ మనుగడనే ప్రశ్నార్థకం చేసిన తర్వాత గొంతు ఎలా పలుకుతుంది. నిన్ను నువ్వు కోల్పోయేలా, కోపగించుకునేలా, అసహ్యించుకునేలా, అవేదన చెందేలా, అనుమానించేలా, ప్రశ్నించుకునేలా చేసిన ఒక్క పద్యం నీ ముందు వినమ్రంగా నిలుచున్న తర్వాత నువ్వు మనిషివి కాగలవా. నే కాలేకపోయా. అందుకే, ఆ ఒక్క మాట మాత్రమే లోయలోంచి వచ్చినట్లుగా వచ్చి ఆ తర్వాత మటుమాయమైంది. సుధమ్మే కాదు... నన్ను కదిపి, కుదిపి, నాకు నన్ను పరాయివాడిగా చేసిన వారి ఏ కవిత్వమైనా, "నీది ఒక బతుకేనా" అని ప్రశ్నించిన వారి ఏ పద్యమైనా చదివితే నేనే కాదు... నువ్వూ ఇలాగే మౌనిలా మిగిలిపోతావేమో. "మడికట్టు కట్టుకున్న నా దేహం/ అనేకానేక రంపాల మధ్య చిక్కుకోబోయే/ సజీవ శిలకు తార్కాణం/ ఎవరికేం తెలుసు ఎన్ని సుళ్లు మౌన ముద్రలు వేస్తున్నాయో/ ఎవరికేం అంచనా ఉంటుంది నా వేదన భాగాలు ఎన్ని తునకలై లోలోపలే/ విరుచుకుపడుతున్నాయో" ఇది అస్తిత్వ వేదన. ఎవరిది. ఓ స్త్రీది. ఓ వర్గానిది. లేదూ ఆ రెండూ జతకలిసిన ఓ సమాజానిదా. ఇది తెలుసుకోవడానికి ముందు నేటి అస్తవ్యస్త సమాజాన్ని తెలుసుకోవాలి. నిరంతరం కాలి బూడిదైపోతున్న విలువల గురించి తెలుసుకోవాలి. మనిషితనం కోసం వెదుకులాట ఓ నిత్యకృత్యం అయ్యిందన్న నిజాన్ని గ్రహించాలి. నీ జన్మ మీదా, నీకు తెలియకుండానే నీ అస్తిత్వం మీద, నువ్వు చేయని నేరానికి నిన్ను దోషిని చేస్తూ వ్యాఖ్యానాలు చేస్తున్న, విసుర్లు విసురుతున్న వారి మీదా నువ్వు ఎంత ఆగ్రహిస్తున్నావో, ఎంత నలిగిపోతున్నావో, ఓ అమానవీయ సమాజం మధ్యలో ఎంత నలిగిపోతున్నావో నీకు తెలిసేందుకైనా సుధా మురళి కవిత్వం చదవాలి. నిజానికి ఈ కవిత్వం రాసిన వారి పేరైతే సుధా మురళి కానీ... స్త్రీ, పురుష భేదం లేకుండా పాఠకులే కాదు సమస్త మానవులూ ఈ కవిత్వం తాము రాశామని, తమ అనుభవమేనని భావించవచ్చు. సుధమ్మ అంగీకరిస్తుంది కాబట్టి మీ పేరు మీదే ఈ కవిత్వాన్ని ప్రకటించవచ్చు. ఎందుకంటారా... నీది, నాది, మనది, ఈ సమాజానిది మాత్రమే అయినా బాధ, భయం, ఆక్రోశం, ఆవేదన, చిరాకు, కోపం, ఇలా తయారవుతున్నామేమిటర్రా, ఇలా మిగులుతున్నామేమిటర్రా అనిపించే అనేకానేక పార్శ్వాలే సుధా మురళి కవిత్వం. సుధమ్మకి ఎంత కోపం ఉందో, అంత అవగాహన కూడా ఉంది ఈ సమాజం మీదా... ఈ మనుషుల మీదా. అందుకే ఆమెకి ఏ వస్తువువైనా, ఏ సంఘటనైనా కొత్తగా కాదు.... వివిధ రూపాల్లో కనిపిస్తుంది. ఈ ప్రేమ రాహిత్యపు లోకానికి. తానే కాదు... అందరూ కోల్పోయిన, కోల్పోతున్న ప్రేమ దక్కకపోతే ఎలా ఉంటుందో చెప్పిన వాళ్లే. నేటి అవ్యవస్థలో ప్రేమ తన ఉనికిని కోల్పోవడమే కదా అసలు సిసలు దుర్మార్గం. అది తెలియపోవడమే కదా అందరి దౌర్భాగ్యం. అదిగో, ఆ ప్రేమ లేకపోతేనే ఎలా ఉంటుందో చెప్పింది కాబట్టే సుధా మురళి సామాజిక కవయిత్రి అయ్యింది. ఈ సంకలనంలో చాలా పద్యాలు ఇంతకు ముందు చదివినవే. ఆ రోజు కాసిన్ని కన్నీళ్లో, మరికొన్ని బాధలో అనుభవించినవే. కానీ, ఇదిగో ఇలా పుస్తకంలా వస్తున్నప్పుడు, వీటన్నింటిని ఒకేసారి చదవుతున్నప్పుడు శకలాలు శకలాలుగా తెగిపడిన అనుభూతి నాకు తెలుస్తోంది. అవును, చాలా కలత చెందాను, అవమాన పడ్డాను. నేనూ ఇలాగే ఉన్నానా అని సందేహించాను. మరీ ఇంత కాదేమో అని సర్దుకున్నాను. మరీ ఇంత కాకుంటే కొంతైనా అలా ఉన్నానా అని సిగ్గటిల్లాను. కొన్ని పద్యాలు చదివి బెంగటిల్లాను. మరికొన్ని చదివి భంగ పడ్డాను. ఎంత కాదన్నా పురుషుడ్ని కదా.... మరీ ఇలా కాదేమో అని సందేహించాను. సృజనకారుడిగా మాత్రం ఇదంతా నిజమే అని అంగీకరిం చాను. ఎలా ఉండాలో తెలియని వారికి... ఇలా మాత్రం ఉండకూడదని కచ్చితంగా తెలుస్తుంది ఈ సుధా మురళి కవిత్వం చదివితే. "ఇప్పుడిక / ఒక్కటయ్యే వీలు లేదు/ రా...!? విడిపోదాం.../ నాకేం కావాలో నిన్ను అడగలేను/ ఇల్లంతా అన్నీ ఉంటాయ్/ ఒక్క నేను ఉండను అంతే/ నాకేం కావాలో నీకు తెలియదు/ అడిగినదేదీ కాదనకపోవడం చేస్తావుగా/ ఒక్క నువ్వు నువ్వుగా నాకు మిగలవు అంతే " అంటారు సర్దుబాటు పద్యంలో.

ఇదేం కవిత్వం కాదు. జీవితమంతే. అప్పుడెప్పుడో... ఆ చాలాకాలం క్రితమే గుడిపాటి చలం చెప్పేశాడు. మరి ఇప్పుడు సుధా మురళి కూడా ఎందుకు చెప్పింది. ఎందుకంటే ఎంత మంది చెప్పినా నువ్వు, నేను వినం కాబట్టి. క్యాలండర్ తేదీలని, సంవత్సరాలని మారుస్తుంది కాని మనుషుల్ని కాదర్రా బాబు అని చెప్పడానికే మళ్లీ రాసింది ఈ సుధామురళి. కాకపోతే కొత్తగా కన్నీరయ్యింది. కొత్తగా తేల్చేసింది. కొత్తగా చీదరించుకుంది. ఇదిగో ఈ కొత్తదనమే సుధా మురళి కవిత్వం అయింది. విజిల్ వస్తే ఆపేయడానికి ఇది కుక్కర్ వంట కాదుగా. అచ్చమైన అమ్మ వండి వార్చిన అన్నం ముద్ద. ఇలా రెండు పద్యాలు ముట్టుకుంటే చాలు ఈ కవిత్వం పండిందని చెప్పడానికి. ఇదంతా సుధామురళి కవిత్వం చదివాక నేను అనుభవించింది. మీరు చదవండి ఇలాంటి అనుభూతే మిగులుతుంది. ఎందుకంటే మనమంతా మనుషులం కదా. రక్తమాంసాలతో పాటు కాసిన్ని ప్రేమలు, ఆప్యాయతలు, బంధాలు, అనుబంధాలు కూడా కావాలనుకునే వాళ్లం కదా... చదవండి... మీకే తెలుస్తుంది.

ఎస్సీ కమిషన్‌లో ఖాళీల భర్తీ

రాహుల్ వినతి

న్యూఢిల్లీ: జాతీయ ఎస్సీ కమిషన్‌లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ పోస్టులను భర్తీ చేసి దళితుల హక్కులు, ప్రయోజనాలను కాపాడాలని ప్రధాని మోదీని కోరారు. పోస్టులను ఖాళీగా ఉంచడమంటే... అది బీజేపీ ప్రభుత్వ దళిత వ్యతిరేకమన్న భావనను స్పష్టం చేస్తున్నదని ఆయన ఆరోపించారు. ఎస్సీ కమిషన్ ఓ రాజ్యాంగ సంస్థ అని, దాన్ని బలహీనపరచడం అంటే రాజ్యాంగంపై దాడి చేయడమే అని, దళితుల సామాజిక హక్కుల్ని కాలరాసినట్లు అవుతుందని రాహుల్ గాంధీ తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. కావాలనే ఖాళీలను భర్తీ చేయడం లేదన్నారు. ఏడాది కాలంగా ఎస్సీ కమిషన్‌లో రెండు కీలక పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఎస్సీ కమిషన్‌లో అధికారులు లేకుంటే ఫిర్యాదులపై ఎవరు చర్యలు తీసుకుంటారని అడిగారు. తక్షణమే పోస్టులను భర్తీ చేయాలని, అప్పుడే ఆ సంస్థ సమర్థవంతంగా పనిచేస్తుందని తెలిపారు. ప్రస్తుతం ఎస్సీ కమిషన్ అధిపతిగా కిషోర్ మక్వానా ఉన్నారు. వైస్ చైర్మెన్, ఓ సభ్యుడి పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

జనాభా ఆధారంగా పునర్విభజన వద్దు: స్టాలిన్

చెన్నై: కేవలం జనాభా ఆధారంగా దక్షిణాది రాష్ట్రాల పార్లమెంట్ సీట్లను నిర్ణయించొద్దని సీఎం ఎంకే స్టాలిన్ కేంద్రాన్ని కోరారు. అలాంటి ప్రయత్నం ఏదైనా జరిగితే దాన్ని వ్యతిరేకిస్తామని అన్నారు. పార్లమెంటరీ నియోజకవర్గాల సరిహద్దులను పునర్నిర్మించే ప్రక్రియ ద్వారా తమ రాష్ట్రానికి ఎటువంటి అన్యాయం జరిగినా సహించేది లేదన్నారు. తమ డిమాండ్ స్పష్టంగా ఉందని, కేవలం జనాభా ఆధారంగా పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన జరపవద్దు అని, జనాభా నియంత్రణకు దక్షిణా రాష్ట్రాలు తీవ్ర చర్యలు తీసుకున్నాయని, ఇప్పుడు సరిహద్దులు పునర్విభజన ద్వారా ఆ రాష్ట్రాలను శిక్షించవద్దు అని స్టాలిన్ తన 72వ పుట్టిన రోజు సందర్భంగా వీడియో సందేశాన్ని విడుదల చేశారు. తమిళ భాష, సంస్కృతిని కాపాడుకునేందుకు కూడా పోరాటం చేస్తానన్నారు.

తొక్కిసలాటపై పిటిషన్‌కు సుప్రీం తిరస్కృతి



న్యూఢిల్లీ: ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటపై విచారణ జరపాలంటూ ఆనంద్ లీగల్ ఎయిడ్ ఫోరం ట్రస్టు సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. మరణాల సంఖ్య రైల్వే శాఖ దాచిపెడుతున్నట్లు పిటిషన్‌లో ఆరోపించింది. అయితే విచారణ అనంతరం శుక్రవారం సుప్రీంకోర్టు ఆ అభ్యర్థనను తోసిపుచ్చింది. ప్రత్యక్ష సాక్షుల ప్రకారం రైల్వే స్టేషన్ తొక్కిసలాటలో సుమారు 200 మంది మరణించినట్లు పిటిషనర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ సమయంలో... మీరు చెప్పిన విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తోందా అని సుప్రీంకోర్టు పిటిషనర్‌ను ప్రశ్నించింది. 200 మరణాలు సంభవించినట్లు చెబుతున్నారు... దానికి ఏమైనా ఆధారాలు ఉన్నాయా అని నిలదీసింది. కొంత సమయం విచారణ జరిగిన తర్వాత కోర్టు ... ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. బాధిత కుటుంబాలు కోర్టును ఆశ్రయించే వరకు వేచి చూద్దామని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. కాగా, ఈ నెల 15న న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో కుంభమేళాకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఒక్కసారిగా ప్లాట్‌ఫాంపైకి రావడంతో ఆ తొక్కిసలాట జరిగింది. ఆ ఘటనలో సుమారు 18 మంది మరణించారు.

ఈశా ఫౌండేషన్‌పై చర్యలొద్దు: సుప్రీం

న్యూఢిల్లీ: అక్రమ నిర్మాణాల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈశా ఫౌండేషన్‌కు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. ఈ వ్యవహారంలో మద్రాసు హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వుల్లో తాము ఎలాంటి జోక్యం చేసుకోలేమని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటేశ్వర్ సింగ్ ధర్మాసనం స్పష్టం చేసింది. ఫౌండేషన్‌పై బలవంతపు చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. తమిళనాడు వెల్లియంగిరిలో ఈశా ఫౌండేషన్ ఉంది. ఇది అక్రమంగా, పర్యావరణ అనుమతులు తీసుకోకుండా నిర్మించినట్లు రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు ఆరోపించింది. ఈ మేరకు నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులపై ఫౌండేషన్ మద్రాసు హైకోర్టును ఆశ్రయించింది. అక్కడ టీఎన్‌పీసీబీ నోటీసులను హైకోర్టు కొట్టివేసింది. నిబంధనల ప్రకారమే నిర్మాణం జరిగినట్లు పేర్కొంది. అయితే, కాలుష్య నియంత్రణ బోర్డు ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. శుక్రవారం అత్యున్నత న్యాయస్థానం దీనిపై విచారణ జరిపింది. యోగా, ధ్యాన కేంద్రం అన్ని పర్యావరణ నిబంధనలు, కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాలకు లోబడే నిర్మాణం జరిపినట్లు తెలిపింది. ఆ ఫౌండేషన్‌పై బలవంతపు చర్యలు తీసుకోవద్దని టీఎన్‌పీసీబీని ఆదేశించింది.

భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ నష్టాల్లో ముగిశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ ప్రకటనలు వాణిజ్య యుద్ధ భయాలు రేపుతుండగా ఆ ప్రభావం స్టాక్ మార్కెట్లపై పడింది. దేశీయ బ్యాంకుల నాలుగో త్రైమాసిక ఫలితాలు బలహీనంగా నమోదు కావచ్చన్న అంచనాలు, ఈక్విటీ మార్కెట్‌లో విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు వెరసి బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ (సెన్సెక్స్) 1414 పాయింట్లు కోల్పోయింది. 73 వేల 198 పాయింట్ల వద్ద ముగిసింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ (నిఫ్టీ) 420 పాయింట్ల నష్టంతో 22 వేల 124 పాయింట్ల వద్ద స్థిరపడింది. శుక్రవారం ఒక్కరోజే రూ.8.8 లక్షల కోట్ల మదుపరుల సంపద ఆవిరైంది.

రైతులపై కేంద్రానికి కక్ష

తక్షణం ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించాలి: కాంగ్రెస్

న్యూఢిల్లీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలోని రైతులపట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ మండిపడింది. తక్షణం పంటల కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు చట్టబద్ధత కల్పించాలని మరోసారి డిమాండ్ చేసింది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు ప్రకారం ఎంఎస్‌పీని నిర్ణయించాలని పేర్కొంది. మద్దతు ధరను పారదర్శకంగా, ప్రభావవంతంగా చేయడానికి ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసిందని, ఫిబ్రవరి 22 వరకు ఈ కమిటీ ఏడు సమావేశాలు, ఉప కమిటీ 39 సమావేశాలు జరిగాయని కాంగ్రెస్ నాయకుడు అభయ్ దూబే తెలిపారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఇంకా ఎంతకాలం కాలయాపన చేస్తారని ప్రశ్నించారు. వ్యవసాయమంత్రికి విమానాల్లో తిరగడం తప్ప రైతుల సమస్యలు పట్టవన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా రైతులు ఇబ్బందులు పడుతున్నాకూడా ఎవరూ వాటి గురించి మాట్లాడరన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేకి అని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఇచ్చే బోనస్‌లను నిలిపివేసి, భూమి హక్కులను లాక్కొనే ప్రక్రియ ప్రారంభించిందని... ఖర్చులో 50 శాతం కంటే ఎక్కువ కనీస మద్దతు ధర చెల్లించడానికి నిరాకరించారని దూబే పేర్కొన్నారు. 'దేశంలోని బీజేపీ ప్రభుత్వం రైతులపై ప్రతీకారేచ్ఛతో రగులుతోంది. మొదట వారి భూమి హక్కులను లాక్కోవడానికి ఆర్డినెన్స్‌లను తీసుకువచ్చింది. తరువాత వ్యవసాయంపై క్రూరమైన నల్ల చట్టాలను చేసింది. తరువాత వారి మార్గాల్లో ఇనుప ముళ్ల కంచెలు వేసింది. వారి రక్తం కళ్ల చూస్తూనే ఉంటుంది. ఇప్పుడు పంటల ధరకు చట్టపరమైన హక్కులను డిమాండ్ చేసినప్పుడు కాలయాపన చేస్తూనే ఉంది' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటల ఎంఎస్‌పీకి చట్టబద్ధత కోసం కాంగ్రెస్ పార్టీ బీజేపీ ప్రభుత్వానికి అవసరమైన ఆధారాలు సమర్పిస్తూనే ఉందని ఆయన అన్నారు. వ్యవసాయంపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ (2024-25) డిసెంబర్ 17, 2024న సభలో తన నివేదికను సమర్పించింది. దీనిలో, 13 నవంబర్ 2024న జరిగిన సమావేశాన్ని ఉటంకిస్తూ, ఎంఎస్‌పీ చట్టబద్ధత కల్పించకుంటే రైతులు ప్రయోజనం పొందబోరని స్పష్టంగా చెప్పబడిందని దూబే అన్నారు. స్వామినాథన్ సిఫార్సు సి2+50 ప్రకారం మద్దతు ధర ఇవ్వడంలేదని, ఈ ఫార్ములాను అమలు చేయాలని కూడా పార్లమెంటరీ కమిటీ సిఫార్సు చేసిందని ఆయన అన్నారు.

బస్సులో అత్యాచార ఘటన

నిందితుడి అరెస్టు

పూణే: మహారాష్ట్రలోని పూణేలో అత్యంత రద్దీగా ఉండే బస్‌స్టేషన్‌లలో ఒకటైన స్వర్‌గేట్‌లో పార్కింగ్ చేసిన బస్సులో 26 ఏళ్ల యువతిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. ఘటన జరిగిన 75 గంటల్లో నిందితుడు రామ్‌దాస్ (36)ను పోలీసులు పట్టుకొన్నారు. శ్రీరూర్‌లోని చెరుకు తోటలో రామ్‌దాస్ దాక్కున్నట్లు సమాచారం అందండంతో డ్రోన్లు, జాగిలాలతో పోలీసులు గాలించారు. నిందితుడి ఫొటోను విడుదల చేసి... ఆచూకీ తెలిపిన వారికి రూ.లక్ష రివార్డును ప్రకటించారు. ఈక్రమంలో గురువారం అర్ధరాత్రి నిందితుడికి ఆకలేసి ఒక ఇంటికి వెళ్లగా... ఆ ఇంట్లోని వ్యక్తి నిందితుడిని గుర్తుపట్టి పోలీసులకు సమాచారమివ్వడంతో పోలీసులు వెంటనే ఆ ప్రాంతానికి చేరుకొని రామ్‌దాస్‌ను అరెస్టు చేశారు. పూణేలోని స్వర్‌గేట్ బస్‌స్టేషన్‌లో మంగళవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఈ దారుణం చోటుచేసుకుంది. కాగా పోలీసుల దర్యాప్తులో నిందితుడి గురించి కీలక విషయాలు వెల్లడయ్యాయి. నిందితుడు రామ్‌దాస్ నేర స్వభావం కలవాడని... అనేక చోరీలకు పాల్పడినట్లు తేలింది. 2019లో ఓ ట్యాక్సీ కొనుగోలు చేసినప్పటినుంచి పూణే-అహల్యనగర్ మార్గంలో తిప్పుతున్నాడు. అయితే అప్పటినుంచి అతడు నగలతో కనిపించిన వృద్ధులను తన ట్యాక్సీలో ఎక్కించుకొని, నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి వారిని బెదిరించి... నగలు, డబ్బు దోపిడీ చేసేవాడని పోలీసులు తెలిపారు. నిందితుడిపై దొంగతనం, దోపిడీ, చైన్‌స్నాచింగ్ మొదలైన కేసులు ఉన్నట్లు గుర్తించామన్నారు. 2019లో ఓ నేరం కేసులో జైలు శిక్ష అనుభవించి.. ప్రస్తుతం బెయిల్‌పై బయట ఉన్నట్లు తెలిపారు. అంతేకాకుండా అతడు తరచూ స్వర్‌గేటు బస్టాండ్ వద్ద తిరుగుతూ.. అక్కడికి వచ్చిన ప్రయాణికులకు తనను తాను పోలీస్‌గా పరిచయం చేసుకునేవాడని అన్నారు. యువతిపై అత్యాచారానికి ముందు కూడా నిందితుడు ఇన్‌షర్ట్ వేసుకొని... నీట్‌గా రెడీ అయ్యాడని, ఆమెకు కూడా తనను పోలీసుగా పరిచయం చేసుకొని, అక్కా అంటూ మాట కలిపి నమ్మించాడని పేర్కొన్నారు.

సిద్ధరామయ్యపై 'శీష్ మహల్' ఆరోపణలు

బెంగళూరు: కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మరో వివాదంలో చిక్కుకున్నారు. ఆయన అధికారిక నివాసాన్ని 'శీష్ మహల్' తరహాలో పునరుద్ధరించడానికి ప్రజాపనుల విభాగం దాదాపు రూ.2.6 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఒకవైపు ప్రభుత్వం వద్ద నిధులు లేవని పేర్కొంటూ... మరోవైపు అధికారులు అనవసర ఖర్చులు చేస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్ విమర్శించారు. రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన మిగతా పనులు పూర్తిచేసిన తర్వాత ముఖ్యమంత్రి తన సొంత పనులు చేసుకోవడంపై దృష్టిసారించాలన్నారు. ప్రభుత్వ నిధులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే... ప్రభుత్వం వాటిని ఇతర ప్రయోజనాలకు మరలిస్తుందని అన్నారు. ప్రభుత్వం ఇదేవిధంగా వ్యవహరిస్తే రాష్ట్ర అభివృద్ధి కుంటుపడుతుందని చెప్పుకొచ్చారు. సీఎం అధికారిక భవనం పునరుద్ధరణలో భాగంగా రూ.1.7 కోట్లను హెల్పర్ రూమ్‌లు, ఇతర నిర్మాణాలకు కేటాయించగా, రూ.89 లక్షలను ఎలక్ట్రికల్ అప్‌గ్రేడ్, ఎయిర్ కండిషనింగ్ మొదలైన సదుపాయాల కోసం వినియోగించినట్లు ఆర్థికశాఖ నుంచి నివేదికలు వెలువడడంతో ప్రతిపక్ష నేతలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) భూముల వ్యవహారంలో అక్రమాలకు పాల్పడినట్లు సిద్ధరామయ్య ఇప్పటికే ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం విదితమే.

బద్రీనాథ్‌లో విరిగిపడిన మంచు చరియలు

- చిక్కుకున్న 57 మంది కార్మికులు
- 35 మందిని రక్షించిన సహాయక బృందాలు
- మిగిలిన వారి కోసం గాలింపు
- ఉత్తరాఖండ్ చమోలి జిల్లాలో ఘటన

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్ రాష్ట్రం బద్రీనాథ్ సమీపంలోని చమోలి జిల్లా మనా గ్రామంలో శుక్రవారం భారీ ప్రమాదం చోటుచేసుకుంది. బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్‌వో) కు సంబంధించిన కార్మికులు రోడ్డు నిర్మాణం పనులు చేస్తుండగా వారి శిబిరంపై మంచు చరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో మొత్తం 57 మంది కార్మికులు చిక్కుకుపోయారు. ఇప్పటి వరకు వారిలో 35 మందిని రక్షించారు. అయితే ఎత్తయిన సరిహద్దు గ్రామమైన మనా సమీపంలో శుక్రవారం హిమపాతంలో కార్మికులు చిక్కుకున్నారని అధికారులు తెలిపారు. వారిని కాపాడేందుకు భారత సైన్యం, ఇండోటిబెటన్ సరిహద్దు పోలీసులు, సహాయక బృంద బలగాలు శ్రమిస్తున్నాయి. ఈ ప్రాంతంలో భారీగా మంచు కురుస్తోంది. దీంతో సహాయ చర్యలకు, మరిన్ని సహాయక బృందాల తరలింపులో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. భారీ హిమపాతం కారణంగా మనా-బద్రీనాథ్ మధ్య ఉన్న బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్‌వో) శిబిరం ఈ మంచు చరియల కింద కూరుకుపోయినట్లు చమోలీ జిల్లా మేజిస్ట్రేట్ సందీప్ తివారీ తెలిపారు. 'వర్షం, హిమపాతం కారణంగా మేము హెలికాప్టర్‌లను మోహరించలేకపోతున్నాం. కదలిక కష్టంగా ఉంది. అక్కడ శాటిలైట్ ఫోన్లు, ఇతర పరికరాలు అందుబాటులో లేకపోవడంతో మేము వారితో స్పష్టమైన సంభాషణను కలిగి లేము. కానీ ఎటువంటి ప్రమాదానికి సంబంధించిన అధికారిక సమాచారం మాకు అందలేదు. మాకు ఉన్నతాధికారుల నుంచి పూర్తి మద్దతు అందుతోంది. మా బృందం అక్కడికి చేరుకుని వారిని సురక్షితంగా కాపాడుతుందని ఆశిస్తున్నాం' అని చెప్పారు. బద్రీనాథ్ నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మనా, భారతదేశం-టిబెట్ సరిహద్దులో 3,200 మీటర్ల ఎత్తులో ఉన్న చివరి గ్రామం. కాగా, ఈ ఘటనపై ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి విలేకరులతో మాట్లాడుతూ మంచు చరియల కింద చిక్కుకున్న కార్మికులను కాపాడేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు ధామి తెలిపారు. ఇండో టిబెటన్ బోర్డర్ పోలీసు సిబ్బంది సహాయం కూడా తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లా అధికార యంత్రాంగంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని అన్నారు. 'సాధ్యమైనంత త్వరగా అందరినీ సురక్షితంగా రక్షించడమే మా ప్రయత్నం' అని అన్నారు. కొనసాగుతున్న మంచు, వర్షం మధ్య జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్), ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సంఘటనా స్థలానికి బయలుదేరాయి. ప్రతికూల వాతావరణం, దాని ప్రభావం గురించి అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. చండీగఢ్‌లోని డిఫెన్స్ జియోఇన్ఫర్మేటిక్స్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ (డీజీఆర్‌ఈ) చమోలి, ఉత్తరకాశీ, రుద్రప్రయాగ్, పితోర్‌గఢ్, బాగేశ్వర్ జిల్లాల్లో 2,400 మీటర్ల ఎత్తులో ఉన్న ప్రదేశాలకు గురువారం సాయంత్రం 5 గంటలకు 24 గంటల పాటు హిమపాతం హెచ్చరిక జారీ చేసింది. డెహ్రాడూన్‌లోని వాతావరణ కార్యాలయం కూడా శుక్రవారం ఉదయం ఈ జిల్లాల్లో 3,500 మీటర్లు, అంతకంటే ఎక్కువ ఎత్తులో ఉన్న ప్రదేశాలలో భారీ వర్షాలు, మంచు కురుస్తుందని అంచనా వేసింది. దీంతో రాష్ట్ర అత్యవసర కార్యకలాపాల కేంద్రం సంబంధిత జిల్లా మేజిస్ట్రేట్‌లను అప్రమత్తం చేసింది. బోర్డర్ ఆర్గనైజేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీఆర్ మీనా కూడా ఈ ఘటనపై స్పందించారు. ఇప్పటికే ఘటనా స్థలానికి నాలుగు అంబులెన్సులు పంపించినట్లు తెలిపారు.

అయితే, భారీగా మంచు కురుస్తుండటంతో ఘటనా స్థలానికి చేరుకోవడం ఇబ్బందిగా మారిందన్నారు. బీఆర్‌వో విషయానికొస్తే... దేశ సరిహద్దుల వెంట క్లిష్టమైన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం చేపట్టడమే ఈ విభాగం పని. సరిహద్దుల్లో రోడ్లు సరిగ్గా లేని ప్రాంతాల్లో సైన్యం తరలింపు ప్రభుత్వానికి సవాలుగా మారింది. అలాంటి ప్రాంతాల్లో గస్తీ లేకపోవడంతో అక్రమ చొరబాటుదారులకు, శత్రుదేశాలకు అదొక వరంగా పనిచేస్తోంది.

అందుకే అలాంటి సమస్యలను ఎదుర్కొనే వ్యూహాల్లో భాగంగా కేంద్రం ఈశాన్య భారత్‌లో సరిహద్దుల వెంట అనేక ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం చేస్తోంది.

ప్రజాస్వామ్య విలువలకు దెబ్బ

స్పీకర్‌కు ఆతిశీ లేఖ

న్యూఢిల్లీ: ఆప్ ఎమ్మెల్యేలు 21 మందిపై ఏకపక్షంగా సస్పెన్షన్ వేటు వేయడంపై ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత ఆతిశీ తీవ్రంగా స్పందించారు. ఈ సస్పెన్షన్ 'ప్రతిపక్షాలకు అన్యాయం,' 'ప్రజాస్వామ్య విలువలపై తీవ్రమైన దెబ్బ' అని ఆతిశీ స్పీకర్ విజేందర్ గుప్తాకు శుక్రవారం లేఖ రాశారు. 'తీవ్రమైన బాధ, విచారంతో ఈ లేఖ రాస్తున్నా. న్యాయం, సమానత్వం ప్రజాస్వామ్యానికి అతిపెద్ద బలం. అయితే కొద్ది రోజులుగా ఢిల్లీ అసెంబ్లీ పరిణామాలతో ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు అన్యాయం జరగడమే కాకుండా ప్రజాస్వామ్య విలువలపై గట్టి దెబ్బ పడింది. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎమ్మెల్యేలు తమ వాదనను వినిపించే హక్కును రాజ్యాంగం కల్పించింది. అయితే ప్రతిపక్షాల గొంతుకను అణచివేస్తే, సభ లోపల- వెలుపల ప్రజల సమస్యలను లేవనెత్తకుండా ఎమ్మెల్యేలను అడ్డుకుంటే ప్రజాస్వామ్యం ఎలా మనుగడ సాగిస్తుంది' అని ఆతిశీ లేఖలో ప్రశ్నించారు. 'అన్యాయం కొనసాగిందని, సస్పెండ్‌కు గురైన ఎమ్మెల్యేలు ప్రజాస్వామ్య పద్ధతిలో ఢిల్లీ అసెంబ్లీ ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళుతుండగా భద్రతా బలగాలు అడ్డుకున్నాయి. ఇది ఎమ్మెల్యేలనే కాకుండా ప్రజలు ఇచ్చిన తీర్పును అవమానించడమే. గౌరవనీయులైౖ స్పీకర్‌గారూ... మీరు కూడా గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు. కొన్ని కారణాల వలన మిమ్మల్ని కూడా సభ నుండి సస్పెండ్ చేసినా అసెంబ్లీ ఆవరణలోకి వెళ్లకుండా, గాంధీ విగ్రహం ఎదుట నిరసన చేపట్టకుండా అడ్డుకోలేదు. ఇది ప్రజాస్వామ్యం కల్పించిన హక్కు. కానీ నేడు ప్రతిపక్ష ఎమ్మెల్యేల హక్కులకు భంగం వాటిల్లుతోంది. పార్లమెంటులో సైతం నిరసన తెలిపే విధానం కొనసాగుతుంది' తెలిపారు. ఢిల్లీ సీఎం కార్యాలయం నుండి అంబేద్కర్ ఫొటో తొలగించడంపై నిరసన తెలపడంతో ఆతిశీ సహా 21 మంది ఆప్ ఎమ్మెల్యేలను మంగళవారం అసెంబ్లీ నుండి సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ప్రసంగానికి అంతరాయం కలిగించినందుకు స్పీకర్ సస్పెన్షన్‌కు ఆదేశించారు

కేంద్రమంత్రి పర్యటనకు నిరసన

డీఎంకే, విద్యార్థిసంఘాల ఆందోళనలు

చెన్నై: కేంద్ర విద్యాశాఖ సహాయక మంత్రి సుకాంత మజుందార్ పర్యటనను వ్యతిరేకిస్తూ డీఎంకే, ఫెడరేషన్ ఆఫ్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్స్ -తమిళనాడు (ఎఫ్ఎస్ఓ-టీఎన్) శుక్రవారం ఆందోళన చేపట్టాయి. ఐఐటీ మద్రాస్‌లో ఒక కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఆయన చెన్నై వచ్చారు. ఆందోళనల నేపథ్యంలో ఐఐటీ మద్రాస్ వెలుపల భారీగా పోలీస్ సిబ్బందిని మోహరించారు. వివాదాస్పద త్రిభాషా విధానం, రాష్ట్రానికి నిధుల విడుదలపై డీఎంకే ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసం ప్రజలంతా ఐక్యంగా ముందుకు రావాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. త్రిభాషా విధానం, డీలిమిటేషన్‌కి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో పాల్గొనాలని ప్రజలను కోరారు. ప్రస్తుతం తమిళనాడు ప్రభుత్వం రెండు కీలక సవాళ్లు ఎదుర్కొంటోందని, ఒకటి భాష, రెండు డీలిమిటేషన్. ఇవి తమిళనాడు ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, ప్రజల సంక్షేమాన్ని దెబ్బతీస్తాయని అన్నారు. ఈ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, రాష్ట్రాన్ని రక్షించుకునే ఆందోళనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సోషల్‌మీడియా ఎక్స్‌లో పేర్కొన్నారు. కర్నాటక, పంజాబ్, తెలంగాణ సంఘీభావం ప్రకటించాయని అన్నారు. త్రిభాషా విధానం ఇప్పటికే కేంద్రం నుండి నిధుల నిలిపివేతకు దారితీసిందని, డీలిమిటేషన్‌తో రాష్ట్ర ప్రాతినిధ్యం తగ్గించబోమని అన్నారు. తమిళనాడు సంక్షేమం, భవిష్యత్తు గురించి ఎప్పటికీ రాజీపడబోమని అన్నారు. తమిళనాడు ప్రతిఘటిస్తుంది, తమిళనాడు విజయం సాధిస్తుంది అని స్టాలిన్ స్పష్టం చేశారు.

దేవేంద్ర ఫడ్నవీస్‌కు బెదిరింపులు

ముంబై: మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు హత్య బెదిరింపులు వచ్చాయి. పాకిస్థాన్ ఫోన్ నెంబర్ నుంచి ఈ బెదిరింపులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం ఉదయం పాకిస్థాన్ నంబర్ నుంచి మహారాష్ట్ర సీఎం కార్యాలయంపై దాడి చేయనున్నట్లు ముంబై పోలీసులకు వాట్సాప్ మెసేజ్ వచ్చింది. బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి తనను తాను మాలిక్ షాబాజ్ హుమాయున్ రాజా దేవ్‌గా పేర్కొన్నారు. ఈ బెదిరింపు మెసేజ్‌తో ముంబై పోలీసులు అప్రమత్తమై సీఎం భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ బెదిరింపు మెసేజ్‌పై దర్యాప్తు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. కాగా, ఇటీవలే మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండేకు కూడా హత్య బెదిరింపులు వచ్చాయి. షిండే కారును బాంబులతో పేల్చేస్తామంటూ ముంబై పోలీసులకు మెయిల్ చేశారు. అయితే దర్యాప్తులో బూటకమని తేలింది. కొద్దిరోజుల వ్యవధిలోనే సీఎంకు బెదిరింపులు రావడం కలకలం రేపుతోంది.

మహిళా జడ్జీల తొలగింపు ఏకపక్షం, చట్టవిరుద్ధం: సుప్రీం

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్‌లో 2023లో ఇద్దరు మహిళా సివిల్ జడ్జీల తొలగింపునకు సంబంధించిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ చర్య శిక్షాపూరితం, ఏకపక్షం, చట్టవిరుద్ధమని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎన్.కోటేశ్వర్‌సింగ్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం వ్యాఖ్యానించింది. 15 రోజుల్లోగా ఇద్దరు మహిళా జడ్జీలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించింది. 2017, 2018 సంవత్సరాల్లో అదితి కుమార్ శర్మ, సరితా చౌదరి మధ్యప్రదేశ్ న్యాయవిభాగంలో జడ్జీలుగా చేరారు. ప్రొబేషన్ సమయంలో ఒక జడ్జి వివాహం చేసుకున్నారని, కోవిడ్-19 మహమ్మారి బారిన పడ్డారని, గర్భస్రావం జరిగిందని, ఆమె సోదరుడికి కేన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయిందని ధర్మాసనం పేర్కొంది. 'ప్రసవం జరిగితే పరిపూర్ణ మాతృత్వ భావన కలుగుతుంది. అయితే గర్భస్రావం మహిళల శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపు తుంది. ఆత్మహత్యకు సైతం దారితీయ వచ్చు. పునరావృతమయ్యే గర్భస్రావాలు ఆరోగ్యంపై తీవ్రప ప్రభావాలు కలిగిస్తాయి. గర్భస్రావం గుర్తింపు, అపవాదుతో సహా అనేక అంశాలలో ఒంటరితనానికి గురిచేస్తుంది. న్యాయవ్యవస్థలో మహిళా అధికారులు పెరుగుతున్నప్పుడు వారు బాధ్యతలు నిర్వర్తించడానికి అవసరమైన సౌకర్యవంతమైన వాతావరణం కల్పించకపోవడం సరికాదు' అని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు. ఒక్కోసారి మహిళా జడ్జీలు కోర్టుల్లో రోజంతా విధులు నిర్వహించేందుకు తరచుగా నొప్పి నివారణ మందులు ఉపయోగిస్తారని ధర్మాసనం పేర్కొంది. గర్భధారణ సమయంలో మహిళలకు వివక్ష నుండి స్వేచ్ఛ అనేది విలువైన హక్కు అని తెలిపింది. 2023 నవంబర్ 11న మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఆరుగురు మహిళా సివిల్ జడ్జీల పనితీరు సంతృప్తికరంగా లేదని ఆరోపిస్తూ వారిని విధుల నుండి తొలగించింది. ఈ కేసును సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. గతేడాది ఆగస్టులో మధ్యప్రదేశ్ హైకోర్టు పూర్తిస్థాయి ధర్మాసనం ఆ ఉత్తర్వులను పున:పరిశీలించి, నిబంధనలు-షరతులతో నలుగురిని తిరిగి నియమించాలని నిర్ణయించింది. మిగిలిన ఇద్దరు అదితి కుమార్ శర్మ, సరితా చౌదరిని నియమించేందుకు నిరాకరించింది. ఆ ఇద్దరి తొలగింపునకు సంబంధించిన విషయంలో గతేడాది డిసెంబర్‌లో తీర్పుని రిజర్వ్ చేసిన సుప్రీంకోర్టు నేడు వెల్లడించింది.

విశాలాంధ్ర హైదరాబాద్

అంగరంగ వైభవంగా మల్లన్న స్వామి ఉత్సవం

విశాలాంధ్ర - హైదరాబాద్ : మల్లన్న స్వామి దీవెనలు ప్రజల అందరిపై ఉండాలని దేవరకద్ర ఎమ్మెల్యే, మహబూబ్ నగర్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్ రెడ్డి ఆకాంక్షించారు. ప్రతి ఏడాది మహాశివరాత్రి అనంతరం దేవరకద్ర మండలం వెంకటాయపల్లి గ్రామంలో మల్లన్న స్వామి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. స్వామి వారికి బండారితో భక్తులు భారీ ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా శుక్ర వారం నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే జీఎంఆర్‌తో పాటు మాజీ జిల్లాపరిషత్ చైర్మన్ స్వర్ణ సుధాకర్ రెడ్డిలు హాజరయ్యారు. గ్రామస్థులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ పాఠశాల వద్ద నిర్మించిన ప్రహరీ గోడకు, ముదిరాజ్ భవనానికి శంకుస్థాపన చేశారు. అంతకుముందు స్వామి ఊరేగింపు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రంలోని మైలారం తరువాత తెలంగాణ రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా ఈ గ్రామంలో స్వామి వారి ఉత్సవాలలో గొలుసు తెంపుడు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు స్వామివారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వివిధ గ్రామాల నుండి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. వివిధ గ్రామాల నుండి వచ్చిన భక్తులకు గ్రామస్థులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నాలాపై స్లాబ్‌తో భవిష్యత్‌లో ఇబ్బందులు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి డివిజన్, సర్దార్ పటేల్ నగర్ స్ట్రీట్ నెంబర్ 2లో నాలాపై పైకప్పు (స్లాబ్) తొలగించి మరల నూతనంగా 40 ఫీట్ల వెడల్పుతో పైకప్పు (స్లాబ్) నిర్మిస్తున్నారు. దీనివల్ల వర్షాకాలంలో నీటి ప్రవాహం పెరిగి కాలనీలోని స్ట్రీట్ నెంబర్ 1,2,3లో ఉన్నటువంటి ఇళ్లలోకి నాలాలోని మురుగునీరు చేరి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారు. శుక్రవారం కాలనీవాసులు మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి మల్కాజిగిరి సర్కిల్ ఉప కమిషనర్ రాజు, ఈఈ లక్ష్మణ్, డిఈ మహేష్, ఏఈ నవీన్‌ని వారు ఎదుర్కొంటున్న సమస్యను వివరించారు. గతంలో కూడా పలుమార్లు ఈ సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకురావడం జరిగిందని, కమిషనర్ స్పందించి కాలనీ వాసులు ఎదుర్కొంటున్న నాలా సమస్యను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాకబ్, రాజు, విశ్వనాథం, కమల్, సత్యనారాయణ, మధుస్వాతి, పుష్పమ్మ, అనిత, నరసమ్మ, ఏమీనా, లలిత, స్వప్న, ముంతాజ్, లేఖ, అనురాధ, శిల్పతో పాటు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో సర్కిల్‌కు తరలివెళ్లారు.

భవాని పోలీ క్లినిక్ సీజ్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం (సిఈఏ) ఉల్లంఘనలపై చర్యల్లో భాగంగా, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా.సీ.ఉమా గౌరి, డా.వినోద్, జిల్లా ప్రోగ్రాం అధికారి (క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం), రిసాలా బజార్, బొల్లారం వద్ద ఉన్న భవాని పోలీ క్లినిక్‌ను శుక్రవారం సీజ్ చేశారు. ఈ క్లినిక్ అనేక సంవత్సరాలుగా నడుస్తున్నప్పటికీ, నమోదును చేయించుకోక పోవడంతో, ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం కలిగించే విధంగా అనియంత్రిత వైద్య సేవలను అందించడం గుర్తించి ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అధికారిక తనిఖీ సందర్భంగా, నిర్వాహకులు నకిలీ జనరల్ ఫిజీషియన్‌గా అవతారమెత్తి, శక్తివంతమైన యాంటీబయాటిక్స్ రాయడం, ఐ.వి.ఇన్ఫ్యూజన్లు ఇవ్వడం వంటి అనుచిత వైద్య చర్యలు చేపడుతున్నట్లు అధికారుల దృష్టికి వెళ్లింది. విద్యార్హతలు లేకపోవడం, చట్ట విరుద్ధంగా క్లినిక్ నడుపుతుండడంతో చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. భవాని క్లినిక్ అర్హత లేని వ్యక్తులచే నడపబడుతుందనే ఫిర్యాదు ఆధారంగా ఆకస్మిక తనిఖీ నిర్వహించగా, క్లినిక్ సిఈఏ చట్టాన్ని ఉల్లంఘిస్తూ, అక్రమంగా అలోపతిక్ మందులు అందించడంతో పాటు, ప్రజల జీవితాలను ప్రమాదంలోకి నెడుతున్న పరిస్థితి. నిర్వాహకులు ఇంకా అక్రమ వైద్య సేవలు కొనసాగించడాన్ని ధృవీకరించి భవాని క్లినిక్‌ను అధికారికంగా సీజ్ చేసినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా.సీ. ఉమా గౌరి తెలిపారు.

కనెక్టింగ్ రోడ్లకు ప్యాచ్ వర్క్‌లు చేపట్టాలి

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీలేశ్వరరావుకి శుక్రవారం 11వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మద్ది యుగంధర్ రెడ్డి ఉప్పల్ డిపో నుండి కెనరా నగర్ వరకు ఉన్న వరంగల్ హైవే కనెక్టింగ్ రోడ్లు (బుద్ధానగర్ రోడ్ నంబర్ ఒకరినుండి రోడ్ నంబర్ ఎనమిది వరకు) సరిగాలేక గుంతలు ఏర్పడిన కారణంగా వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు సంభవిస్తున్నాయి, తక్షణమే ప్యాచ్వర్కు నిర్వహించి మరమత్తులు చేయాలనీ, మెడిపల్లి వైకుంఠధామం నందు నిర్వహనలేక మరుగుదొడ్లు చాలా అశు భ్రంగా వున్నాయి. ఎక్కువ చెత్తపేరుకు పోయి నీళ్లు ఆగి నాచు ఎక్కువ ఏర్పడి జారిపడి ప్రమాదాల జరుగుతున్నాయి. కావున కావలసిన కనీస అవసరాలు ఏర్పాటు జరిపించాలని, గ్రీనరీ ఉండేలా చూడాలని 11వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మద్ది యుగంధర్ రెడ్డి, అశోక్ రెడ్డి, మహేష్, ప్రవీణ్, ఆదిత్య మోహన్, మాధవరెడ్డి కలసి వినతిపత్రం సమర్పించారు, దానికిగాను కమిషనర్ స్పందిస్తూ తక్షణమే కావలసిన చర్యలు మొదలు పెడతామని భరోసా ఇచ్చారు.

యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ యువత భవిష్యత్తును మెరుగుపరిచే దిశగా జీహెచ్ఎంసీ చర్యలు చేపట్టిందని, అందులో భాగంగా లైట్‌హౌస్ కేంద్రాల ద్వారా యువతకు నైపుణ్యాన్ని పెంపొందించి, ఉద్యోగ అవకాశాలు అందించడమే లక్ష్యమని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమం హైదరాబాద్ యువతకు ఉద్యోగ అవకాశాలు పొందేందుకు, స్వయం ఉపాధి అభివృద్ధి చేసుకునేందుకు ఉపయోగపడు తుందని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలోని మొజంపురా బజార్ ఘాట్‌లో ఏర్పాటు చేసిన మల్లేపల్లి లైట్‌హౌస్ సెంటర్‌ను శుక్రవారం జీహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యువతకు నైపుణ్య శిక్షణను అందించి, ఉపాధి అవకాశాలు కల్పిండంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. అందులో భాగంగా యువతకు స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, లైట్‌హౌస్ కమ్యూనిటీస్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో నగర యువతకు నైపుణ్యం, ఉపాధి అవకాశాలు కల్పించేం దుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిహెచ్ఎంసి అంటే శానిటేషన్ మాత్రమేనని అనుకుంటారని, కానీ జిహెచ్ఎంసి మరో కోణంలో ముందడుగు వేస్తుందన్నారు. నగర అభివృద్ధితో పాటు యువతకు ఉద్యోగ, స్వయం ఉపాధి కల్పనకు అధిక ప్రాధాన్యత నిస్తుందని వివరించ్చారు. 2023లో చందానగర్‌లో ప్రారంభమైన లైట్‌హౌస్ ప్రోగ్రామ్ ద్వారా ఇప్పటి వరకు 1300 మందికి పైగా యువత వివిధ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నారని, అందులో 500 మందికిపైగా యువత ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలతో, స్వయం ఉపాధి ద్వారా ఆదాయాన్ని పొందుతున్నారని తెలిపారు. యుబిఎస్ సంస్థ తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా జీహెచ్ఎంసీ లైట్‌హౌస్ కేంద్రాల నిర్వహణకు ఆర్థిక మద్దతును అందిస్తోందని, అందులో భాగంగా ఈ రోజు ప్రారంభమైన మల్లేపల్లి లైట్‌హౌస్ సెంటర్ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ, కెరీర్ మార్గదర్శకత్వాన్ని అందించనుందని పేర్కొన్నారు. మల్లేపల్లి లైట్‌హౌస్ సెంటర్‌లో యువతకు కెరీర్ మార్గదర్శకత్వం, వ్యక్తిత్వ వికాసం కోసం 50 గంటల ఫౌండేషన్ కోర్సు, స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సులు, ఐటీ, డిజిటల్ స్కిల్స్ కోసం 'టెక్ హబ్ ' ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీ పార్లర్, మేకప్ తరగతులు, ఆన్‌లైన్ లెర్నింగ్ మరియు కెరీర్ కౌన్సెలింగ్ తదితరాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. 14-17 ఏళ్ల యువత కోసం యువత భవిష్యత్‌కు సిద్ధం కావడానికి వ్యక్తిత్వ వికాసం మరియు కెరీర్ మార్గదర్శకత్వం కల్పించే లైట్‌హౌస్ కిరణ్ కోర్సును మల్లేపల్లి కేంద్రంలో మొదటిసారిగా అందిస్తున్నారని చెప్పారు. జీహెచ్ఎంసీ మరియు ఎల్‌సిఎఫ్ భాగస్వామ్యంతో నగరంలో ఉపల్, బోరబండ వంటి ప్రాంతాల్లో కొత్త లైట్‌హౌస్ సెంటర్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా గలదని ,రాబోయే 3 సంవత్సరాల్లో 5 వేల మందికి పైగా యువతకు ఉపాధి అవకాశాలు, కెరీర్ మార్గదర్శకత్వం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి నాంపల్లి కార్పొరేటర్ జాఫర్ ఖాన్, జోనల్ కమీషనర్ అనురాగ్ జయంతి, డిప్యూటీ కమిషనర్ సురేందర్, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజలు, నిరుద్యోగ యువత, లైట్ హౌస్ కమ్యూనిటీస్ ఫౌండేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

చెడు స్నేహాలకు దూరంగా ఉండాలి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : చెడు స్నేహితులకు దూరంగా ఉండాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల హాల్ టికెట్‌లను ఆయన ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్య తరువాత రానున్న నాలుగు సంవత్సరాల సమయమని చాలా విలువైనదని అన్నారు. మీ భవిష్యత్తు బాగుండాలని, మీ తల్లిదండ్రులలాగా మీరు కష్టపడకూడదని వారు కూలి పనులు చేస్తూ, వ్యవసాయ పనులు చేసుకుంటూ, వాళ్ళు పడే కష్టాలను సైతం ఇష్టపడుతున్నారని ఆయన చెప్పారు.

మీ తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని దృష్టిలో ఉంచుకొని మంచిగా చదువుకొని జీవితంలో మీరు స్థిరపడాలని ఆయన సూచించారు. మీకోసం మీ తల్లిదండ్రులే కాకుండా మేము కూడా తపన పడుతున్నామని, మీరంతా మంచిగా చదువుకొని జీవితంలో స్థిరపడాలని కోరుకుంటున్నాం అని ఆయన స్పష్టం చేశారు. ఇంటర్మీడియట్ పరీక్షలు ముగిసిన తర్వాత నెల రోజుల పాటు మీకోసం ఇంజనీరింగ్ మరియు నీట్ ఎంట్రెన్స్ పరీక్షలకు క్రాష్ కోర్స్ ఏర్పాటు చేస్తామని ఈ కోర్సులో చేరిన వారికి ఉచితంగా వసతి భోజన సదుపాయాలు కల్పించడం జరుగుతుంది అని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న పాపిరెడ్డి గారు ఈ రోజు పదవీ విరమణ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించి, శుభా కాంక్షలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు హాల్ టికెట్స్ పంపిణీ చేసి ఆల్ ది బెస్ట్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, టిజిఓ రాష్ట్ర ఉపాధ్యక్షులు యం.రామకృష్ణ గౌడ్, కళాశాల ప్రిన్సిపాల్ భగవంతచారి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ పాలనలో ఆరోగ్యందే కీలకపాత్ర

జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి

విశాలాంధ్ర - హైదరాబాద్ : నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అనిమల్ బయోటెక్నాలజీలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జరిగిన కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ముఖ్యఅతిథిగా హాజరై ఒక ఆరోగ్యం "ప్రజారోగ్యం, పట్టణ పాలనలో దాని భూమిక" అన్న అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నేషనల్ సైన్స్‌డే కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని, ఈరోజు సర్ సి.వి రామన్‌ను స్మృతులను స్మరించుకుంటూ మన భవిష్యత్తును రూపొందించడంలో సైన్స్ కీలకపాత్రను హైలైట్ చేసిన రోజన్నారు. సైన్స్ సమాజాన్ని ప్రగతి పథంలో నడిపించే ప్రాముఖ్యతను ఆయన చెప్పారు. ఒక ఆరోగ్యం దృక్పథాన్ని అవలభించడం ద్వారా ప్రజారోగ్యం, జంతు ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ పరస్పర సంబంధాన్ని అర్థం చేసుకోవడం సమర్థవంతమైన పట్టణ పాలనకు కీలకంగా మారుతుందని ఇలంబర్తి పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ వివిధ ఆరోగ్య, పర్యావరణ ప్రాజెక్టుల ద్వారా ఒక ఆరోగ్య విధానాన్ని అమలు చేయడానికి చేస్తున్న కృషిని ఆయన వివరించారు. నగరాలు వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో ప్రజారోగ్యం, జంతువుల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ అంతర్గతంగా అనుసంధానమై ఉన్నాయని, దీనిని గుర్తించి చర్యలు తీసుకోవడం అనివార్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఐ.ఏ.బి డైరెక్టర్ డా.జి.తారు శర్మ, పి.హెచ్.డి విద్యార్థులు, పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రతి ఉద్యోగికి తాము అందించిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని అడిషనల్ కమిషనర్ (అడ్మిన్) వేణుగోపాల్ అన్నారు. జిహెచ్ఎంసి పరిధిలో వివిధ కేటగిరీలలో పనిచేసిన 15 మంది ఉద్యోగులకు ఉద్యోగ వయోపరిమితి పూర్తయిన నేపథ్యంలో జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం రిటైర్మెంట్ వీడ్కోలు సభను నిర్వహించి, వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ వేణుగోపాల్ మాట్లాడుతూ పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగులందరూ తమ ఉద్యోగ జీవితంలో ఎంతో నిబద్ధత, అంకిత భావంతో సేవలందించారన్నారు. వారి కృషి, అందించిన సేవలు తమ సహచర ఉద్యోగులకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. ప్రతి ఉద్యోగికి రిటైర్మెంట్ సహజమని, రిటైర్మెంట్ అనేది జీవితంలో కొత్త అధ్యాయం లాంటిదని, రిటైర్మెంట్ పొందిన వారు వారి కుటుంబ సభ్యులతో సమయం గడుపుతూ, తమ ఆసక్తులకు ప్రాధాన్యం ఇస్తూ ఆరోగ్యంతో, ఆనందంగా గడపాలని ఆయన సూచించారు.

పదవీ విరమణ పొందిన వారి వివరాలు...

చార్మినార్ జోన్ జాయింట్ కమిషనర్ ఎ.శైలజ, రాజేంద్రనగర్ ఆడిట్/అకౌంట్ సెక్షన్ అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ షేక్ అబ్దుల్ సత్తార్, రాజేంద్రనగర్ సర్కిల్-11 హెల్త్ అండ్ శానిటేషన్ విభాగం శానిటరీ సూపర్ వైజర్ డి.క్రిష్ణ కిషోర్, ఎల్బీనగర్ సర్కిల్-4 ట్యాక్స్ సెక్షన్ సూపరింటెండెంట్ డి.నర్సింహా, చార్మినార్ సర్కిల్-9 ట్యాక్స్ సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ రహమతుల్లా బేగ్, గోషామహల్ సర్కిల్-14 హెల్త్ సెక్షన్ కామాటన్ శారద, కార్వాన్ సర్కిల్-13 టౌన్ ప్లానింగ్ విభాగం కామాటి నర్సింహా చారి, ఇంజనీరింగ్ విభాగం క్వాలిటీ కంట్రోల్ సెల్-2 మాన్ మజ్దూర్ రాజు, సర్కిల్-2 ఉప్పల్ హెల్త్ అండ్ శానిటేషన్ పి.హెచ్ వర్కర్ ఇ.నర్సింహా, సర్కిల్-12 మెహిదీపట్నం కామాటన్ ఎస్.సద్గున, కామాటి అమీర్ అలీ, అర్బన్ ఫారెస్ట్రీ హెడ్ ఆఫీస్ చౌకీదార్ ఎ.ఆనంద్, సర్కిల్ -9 చార్మినార్ యు.ఎం.ఎస్ సెక్షన్ ఫీల్డ్ వర్కర్ కె.యాదగిరి, సర్కిల్-2 ఉప్పల్ హెల్త్ అండ్ శానిటేషన్ పి.హెచ్.వర్కర్ ఎ.బాలయ్య, సర్కిల్-27 అల్వాల్ పి.హెచ్ వర్కర్ సి.ఆగమ్మ పదవీ విరమణ పొందారు. సిపిఆర్ఓ మహమ్మద్ ముర్తుజా, జాయింట్ కమిషనర్ రెవెన్యూ కులకర్ణి, ఏ.ఎం.సిలు జీవన్ కుమార్, శారద, సహ ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే - ఐజేయూ సభ్యత్వ నమోదు ప్రారంభం

విశాలాంధ్ర - మొయినాబాద్: రంగారెడ్డి జిల్లాలో టీయూడబ్ల్యూజే -ఐజేయూ బలోపేతం చేసేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా యూనియన్ కార్యవర్గ సమావేశం తొర్రురులోని శ్రీరస్థు బ్యాంకెట్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 3వ తేదీ వరకు జిల్లాలో యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టిన తర్వాత జిల్లా మహాసభలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఈ మహాసభల సందర్భంగా జిల్లాలో 25 ఏళ్ళు పూర్తి చేసుకున్న జర్నలిస్టులకు ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆయా నియోజకవర్గాలకు జిల్లా కమిటీ బాధ్యులు, ఆయా ప్రెస్‌క్లబ్‌ల అధ్యక్షులు ఇంచార్జ్ లుగా వ్యవహరిస్తారని ఆయన తెలిపారు.

జిల్లా బాధ్యులు సమిష్టిగా కృషి చేసి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యునియాన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, మాఫీసిల్ జర్నలిస్ట్ ఫోరమ్ రాష్ట్ర కన్వీనర్ గుడిపల్లి శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ జాతీయ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సలీమ్ పాషా, సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కటకం సుభాష్, ప్రసాద్, సంయుక్త కార్యదర్శులు జగన్ గౌడ్, రాజేష్,కోశాధికారి సంరెడ్డి శశిపాల్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు పాండు, వెగ్గలం శ్యామ్, బద్దుల మల్లేష్ యాదవ్, దర్శనం జంగయ్య, రచ్చ శేఖర్, ఆవంచ సురేందర్, పాల్గొన్నారు.

మానవునిలో సాత్వికత పెంపొందడానికి లలితకళలు దోహదం

విశాలాంధ్ర - హైదరాబాద్ : దేశంలో సంగీతం, నృత్యం, నాటక రంగాలలో విశేష కృషి చేసిన మహనీయుల అనుభవాలను నేటి తరానికి అందించాలనే ప్రయత్నంలో భాగంగా కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖలో భాగమైన సంగీత నాటక అకాడమీ, న్యూఢిల్లీ, తెలుగు విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఏర్పాటు చేసిన 'ప్రతీగ్యా' కార్యక్రమాన్ని శుక్రవారం పర్యిటీలోని ఎన్.టి.ఆర్ కళామందిరంలో నిర్వహించడం జరిగింది. విశ్వవిద్యాలయం సంస్కృతి పర్యాటక శాఖ అధిపతి డా.వనజా ఉదయ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు ప్రసంగిస్తూ మానవునిలో సాత్వికతను ఉద్దీపింపచేయడానికి లలితకళలు ఎంతో దోహద పడతాయని, కళారాధన మానవీయ విలువలని, మానవత్వాన్ని పునరుజ్జీవింపచేస్తాయన్నారు. అతిథిగా విచ్చేసిన సంగీత నాటక అకాడమీ కౌన్సిల్ మెంబర్ డా.ఎస్పీ భారతి మాట్లాడుతూ దేశంలోని నలుమూలలో గొప్ప కళాకారులను

వారి అనుభవాలను ప్రతీగ్యా కార్యక్రమం ద్వారా ప్రజలకు పరిచయం చేస్తున్న కేంద్ర సంగీత నాటక అకాడమీకు అభినందనలు తెలియజేశారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన సంగీత నాటక అకాడమీ ప్రతినిధి దీప్ జోషీ ప్రతీగ్యా కార్యక్రమ విశేషాలతోపాటు కేంద్ర సంగీత నాటక అకాడమీ దేశ వ్యాప్తంగా లలితకళల అభ్యున్నతికి చేస్తున్న వివిధ కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. ప్రతీగ్యా కార్యక్రమంలో భాగంగా సంగీత రంగం నుండి పద్మశ్రీ డా.ఎల్లా వెంకటేశ్వరరావు మృదంగంపై తనదైన శైలిలో అద్భుతమైన ప్రదర్శనా ప్రసంగం చేసి సభికులను ఆకట్టుకున్నారు. తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు విశ్వవిద్యాలయం తెలుగుసాహిత్య సాంస్కృతిక పరిశోధన రంగాలకు చేస్తున్న కృషిని వివరించారు. తొలుత సంగీత విద్వాంసులు వైజర్స్ బాల సుబ్రహ్మణ్యం ప్రార్థనాగీతం ఆలపించారు. సంగీత నాటక అకాడమీ పక్షాన తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు నిత్యానందరావు ప్రదర్శనా ప్రసంగాలను చేసిన డా.ఎల్లా వెంకటేశ్వరరావుని, డా.భాగవతుల సేతూరాంని ఘనంగా సత్కరించారు.

శరవేగంగా వరంగల్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారతీయ రైల్వేలో ప్రయాణీకులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలను అందించాలనే దృక్పథంతో భారీ స్థాయిలో రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి పనులు చేపట్టడం ద్వారా గొప్ప పరివర్తన దిశగా పురోగమిస్తుంది. అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ (ఏ.బి.ఎస్.ఎస్.) కింద, తెలంగాణ వ్యాప్తంగా 40 రైల్వే స్టేషన్‌లను రూ.2,737 కోట్ల అంచనా వ్యయంతో, ఆధునిక ప్రయాణీకుల సౌకర్యాలను అందించడానికి, వాటిని ప్రాంతీయ జనాభాకు వృద్ధి కేంద్రాలుగా మార్చడానికి పునరాభివృద్ధి చేయబడుతున్నాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆగస్టు 2023, ఫిబ్రవరి, 2024లో తెలంగాణ రాష్ట్రంలో స్టేషన్ల పునరాభివృద్ధికి శంకుస్థాపన చేయడంతో ఈ పథకానికి మరింత ప్రోత్సాహం లభించింది. ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా పెద్ద ఎత్తున చేపట్టిన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పనులను ఈ జాబితాలో చేర్చారు. వాటితో పాటుగా జంట నగరాల ప్రాంతంలో ఇప్పటికే ఉన్న ఇతర రైలు టెర్మినల్లలో రద్దీని తగ్గించడానికి చర్లపల్లి స్టేషన్ సకల సౌకర్యాలతో అభివృద్ధి చేయబడింది. నగర ప్రజల సౌకర్యార్థం ప్రత్యామ్నాయ టెర్మినల్‌గా అవతరించింది. రైల్వే మంత్రిత్వశాఖ రైల్వే స్టేషన్‌లను ఆధునీకరించడం, దీర్ఘకాలిక దృష్టితో నిరంతర ప్రాతిపదికన అభివృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకుని అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ విధానాన్ని రూపొందించింది.

రైల్వేస్టేషన్ సంక్షిప్త సమాచారం...

భారతదేశం అంతటా రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేసే లక్ష్యంతో అమృత్ భారత్ స్టేషన్ పథకం, (ఏబిఎస్ఎస్) కింద పునరాభివృద్ధి చేయబడుతున్న తెలంగాణలోని 40 రైల్వేస్టేషన్లలో వరంగల్ రైల్వే స్టేషన్ ఒకటి. వరంగల్ రైల్వేస్టేషన్ గొప్ప చరిత్రతో, సాంస్కృతిక ప్రాముఖ్యత కలిగి, ఆధునిక సౌకర్యాలతో, ఈ ప్రాంతం రవాణా వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తూనే ఉంది. తెలంగాణలోని వరంగల్ నగరం నడిబొడ్డున ఉన్న వరంగల్ రైల్వే స్టేషన్‌కు గొప్ప చరిత్ర ఉంది. ఈ స్టేషన్ దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ఢిల్లీ-చెన్నై ప్రధాన మార్గంలో భాగం. ఈ స్టేషన్ నిర్మాణం కాకతీయ వాస్తుశిల్పం నుండి ప్రేరణ పొందింది. ఇది ఈ ప్రాంత సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తుంది. గడిచిన కొన్ని సంవత్సరాలుగా ఈ స్టేషన్లో కొత్త ప్లాట్‌ఫారమ్‌లు, ట్రాక్‌లు, సౌకర్యాల జోడింపుతో సహా అనేక విస్తరణలు, ఆధునికీకరణలు చేపట్టబడినాయి. వరంగల్ రైల్వే స్టేషన్ ఒక ప్రధాన రవాణా కేంద్రం. ఇది నగరాన్ని భారతదేశంలోని వివిధ ప్రాంతాలకు కలుపుతుంది. దీనికి నాలుగు ప్లాట్‌ఫారమ్‌లు ఉన్నాయి. ప్రస్తుతం ఈ స్టేషన్, విశాలమైన కాన్కోర్స్, వెయిటింగ్ హాల్స్, ఫుడ్ స్టాల్స్, రెస్ట్‌రూమ్‌లతో సహా వివిధ ప్రయాణీకులకు అనుకూలమైన సౌకర్యాలతో మరింత పునరాభివృద్ధి అవుతోంది. ఇది దివ్యాంగ ప్రయాణీకులకు ప్రత్యేక టాయిలెట్లు, ర్యాంప్‌లు వంటి సదుపాయాలను కూడా కలిగి ఉంది. వరంగల్ రైల్వే స్టేషన్ సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోకి వస్తుంది. నాన్-సబర్బన్ గ్రేడ్-3 (ఎన్.ఎస్.జి-3)గా వర్గీకరించబడింది. కాజీపేట -విజయవాడ సెక్షన్‌లోనున్న ఈ స్టేషన్ రూ 41.09 కోట్ల వార్షిక ఆదాయంతో సగటు రోజుకు 31,887 మంది ప్రయాణీకుల రాకపోకలతో కాజీపేట, హనుమకొండ, వరంగల్, మట్టువల్లు ఉన్న ప్రయాణీకులకు సేవలను అందిస్తుంది. వరంగల్ స్టేషన్ నుండి 18 జత రైళ్లు ఒరిజినేట్/ టర్మినేట్ అవుతాయి. దాదాపు 137 రైళ్లు ఆగుతాయి. ఈ స్టేషన్ న్యూఢిల్లీ, హౌరా, చెన్నై, విజయవాడ, విశాఖపట్నం, సికింద్రాబాద్-తిరుపతి వంటి అనేక దిశలలో ముఖ్యమైన సూపర్‌ఫాస్ట్ రైళ్లకు స్టాప్‌లను కలిగి ఉంది.

విద్యా నిధికి బాసటగా జిల్లా పోలీసు యంత్రాంగం

విశాలాంధ్ర - హైదరాబాద్ : విద్యా నిధికి మహబూబ్ నగర్ జిల్లా పోలీసులు బాసటగా నిలిచారు. శుక్రవారం జిల్లా ఎస్పీ డి జానకి, సీనియర్ పోలీసు అధికారులతో కలిసి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయికి 3 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంకల్పం మంచిదైతే ఒక చిన్న ఆలోచన కూడా మంచి ఫలితాలు ఇస్తుందన్నారు. ఈ సంవత్సరం జనవరిలో మహబూబ్‌నగర్ విద్యా నిధి ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, మంచి ప్రయత్నం చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పుడు ప్రశంసలు వస్తున్నాయన్నారు. అంతే కాదు, ప్రజలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారవేత్తలు తమ వంతుగా విద్యా నిధికి అండగా నిలుస్తూ, విరాళాలు అందజేస్తున్నారని, వారందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని ఆయన చెప్పారు. రానున్న 4 సంవత్సరాల్లో 10 కోట్ల రూపాయలు విద్యా నిధి కోసం నిధులను సేకరించాలని లక్ష్యం పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. ఈ విద్యా నిధికి వచ్చే ప్రతి పైసా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం ఖర్చు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, డిఎస్పీ వెంకటేశ్వర్లు, సిఐలు గాంధీ నాయక్, ఇజాజుద్దీన్, అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

మేరు దర్జీ సంఘం సంక్షేమానికి కృషి

విశాలాంధ్ర - పటాన్ చెరువు : మేరు దర్జీ సంఘం సంక్షేమానికి కృషి చేస్తానని మేరు దర్జీ సంఘం నిర్మాణానికి తన వంతుగా ఐదు లక్షల విరాళాన్ని అందజేస్తానని పటాన్ చెరువు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. శుక్రవారం టైలర్స్ డే సందర్భంగా దర్జీ సంఘం అధ్యక్షులు నారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన టైలర్ డే సమావేశానికి కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ టైలర్స్ సంఘం గత 13 సంవత్సరాలుగా ఉత్సవాలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. దర్జీ మేరు సంఘం భవన నిర్మాణానికి తనవంతు సహాయంగా అక్షరాల 5 లక్షల రూపాయల విరాళాన్ని తన సొంత నిధులను ఇవ్వడానికి కృషి చేస్తానని తెలిపారు. జిహెచ్ఎంసి పరిధిలో టైలర్స్ సంఘం సంక్షేమానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రకాల సహాయాన్ని పథకాలను టైలర్స్ సంఘం ప్రతినిధులు అందరికీ అందించడానికి అధికారుల తో చర్చిస్తానని సూచించారు. టైలర్స్ సంఘం నాయకులు ప్రభుత్వం నుంచి పథకాలన్నింటినీ సద్వినియోగం చేసుకునేందుకు ముందడుగు వేయాలని పేర్కొన్నారు. మోడ్రనైజేషన్ డిజైనర్లతో ఫ్యాషన్ ఫ్యాషన్ టెక్నాలజీని అలవర్చుకొని మేరు దర్జీ సంఘం యువతీ యువకులు కృషి చేయాలని పేర్కొన్నారు. మాజీ కార్పొరేటర్లు సపన్నదేవ్, శంకర్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్ టైలర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇంధన సంరక్షణ అవగాహన వార్షిక ప్రచారం ముగింపు

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : ఇంధన సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రతి సంవత్సరం నిర్వహించే సంరక్షణ సామర్థ్య మహోత్సవం - సక్షం శుక్రవారం, హైదరాబాద్, నాంపల్లి, తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళామందిరంలో విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమాన్ని, భారత్ ప్రభుత్వం, పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో, తెలంగాణ రాష్ట్రస్థాయి చమురు పరిశ్రమ సమన్వయ కర్త నిర్వహించారు. ఈ పదహారు రోజులు, ప్రచారంలో పరిశ్రమ ప్రతినిధులు, విధాన నిర్మాతలు, విద్యార్థులు, సాధారణ ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ప్రభుత్వ పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ వీఎస్ఎన్‌వీ ప్రసాద్, ఐఎఫ్ఎస్, స్వచ్ఛమైన స్థిరమైన ఇంధన వినియోగం అవసరాన్ని ప్రస్తావిస్తూ, సంపత్తిని సంరక్షించడానికి అందరి బాధ్యతను గుర్తు చేశారు. అవగాహన ర్యాలీలు, శిక్షణ శిబిరాలు, పాఠశాల పోటీలు, వాక్‌థాన్‌లు, సైక్లోథాన్‌లు, ఎల్‌పీజీ పంచాయతీలు, మేథోమథన సదస్సులు, సాంకేతిక సెమినార్లు నిర్వహించబడినాయి. ఈ కార్యక్రమాల ద్వారా వేలాదిమంది ప్రజలు డిజిటల్ మీడియా, రేడియో, టెలివిజన్, ప్రింట్ మీడియాలో భాగస్వామ్యం అయి, ఇంధన సంరక్షణ సందేశాన్ని విస్తృతంగా వ్యాప్తి చేశారు.

చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్స్ విద్యార్థులతో విజ్ఞానశాస్త్ర ప్రదర్శన

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్ : జీవితంలో ప్రతీది సైన్స్‌తో ముడిపడి ఉందని చిన్నప్పటి నుండే పిల్లలలో సైన్స్ టెంపర్ పెంపొందించడానికి విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలు ఎంతో దోహదపడతాయని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్ డిజేబుల్డ్ చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్‌లో ఉన్న 6 నుండి 18 సంవత్సరాల పిల్లలతో ఓల్డ్ బోయినపల్లిలోని తార హోమ్ నందు నిర్వహించిన సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వల చేసి సైన్స్ ఎగ్జిబిషన్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జీవితంలో సైన్స్‌తో ప్రతి ఒక్కటి ముడిపడి ఉందని అన్నారు. పిల్లలలో సైంటిఫిక్ టెంపర్ పెంపొందించడానికి విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ఈ ప్రదర్శన వల్ల పిల్లల్లో నిగుడికృతమై ఉన్న ప్రతిభతో సమాజానికి ఉపయోగపడే ఎన్నో ఆవిష్కరణలు ఆవిష్కరించవచ్చని తెలిపారు. ఈ విజ్ఞాన ప్రదర్శనలో ఉన్న జిల్లాలో ఉన్న 57చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్, 07 డిజేబుల్డ్ చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూన్స్‌లో ఉన్న 800 పిల్లలు పాల్గొనడం అభినందనీయమని అన్నారు. ఈ సైన్సు ఎగ్జిబిషన్‌లో పాల్గొనడమే వారు ప్రైజ్ సాధించడం అన్నారు. అనంతరం కలెక్టర్ 6-18 సంవత్సరాలలోపు విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ ప్రాజెక్టులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సైన్స్, మాథ్స్‌లో ఉన్నత స్థాయిలో ఎదిగేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి అబ్దుల్ జావిద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని, వృత్తిలో భాగంగా ప్రతి హోం ను సందేశం ఇవ్వడం జరుగుతుందని జాతీయ న్యాయ సేవ ద్వారా ఉచితంగా లీగల్ ఏడ్ అందించడం జరుగుతుందన్నారు. ఫ్రెండ్లీ ఎన్విరాన్మెంట్ ఫర్ ది డిసేబుల్డ్ చైర్మన్ గంగారం మాట్లాడుతూ సైన్స్ ఎగ్జిబిషన్‌లో దివ్యాంగులు పాల్గొని వారు సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి చైర్ పర్సన్ శైలజ, ఎస్సిపిసిఆర్ నెంబర్ బృందాధర్, అపర్ణ, రాగజ్యోతి, తార హోం ఫాదర్ జోస్ మాథ్యూ, జి డబ్ల్యు ఓ అక్కేశ్వరరావు, నబి, లలిత, ప్రమోద, జిల్లా సైన్స్ ఆఫీసర్ ధర్మేందర్రావు, జ్యూరీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టన్నెల్ బోరింగ్ మిషన్ వరకు ట్రాక్ పునరుద్ధరణ పనుల్లో

సింగరేణి రెస్క్యూ బృందాల అవిశ్రాంత కృషి



విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్.ఎల్.బి.సి. వద్ద కీలక రెస్క్యూ ఆపరేషన్‌లో సింగరేణి బృందాలు ఉత్సాహంగా పాల్గొంటున్నాయి. శుక్రవారం సాహసోపేతంగా సొరంగ మార్గంలో జరుగుతున్న రెస్క్యూ చర్యలను సంస్థ చైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ స్వయంగా పరిశీలించారు. సంస్థ చైర్మన్ తమతో పాటు ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొనడంతో సిబ్బంది మరింత ఉత్సాహంతో పని చేస్తున్నారు. ఎన్.డి.ఆర్.ఎఫ్ కల్నల్‌తో కలిసి సింగరేణి చైర్మన్ 14 కిలోమీటర్ల సొరంగ మార్గంలో ప్రమాద స్థలి చేరువ వరకు పరిస్థితిని సహాయక చర్యలను పరిశీలించారు. సింగరేణి రెస్క్యూ బృందాల ఆధ్వర్యంలో జరుగుతున్న గ్యాస్ కటింగ్ పనులను ఆయన దగ్గరగా ఉండి పర్యవేక్షించారు. ట్రాకు పునరుద్ధరణ జరగాలంటే దానిపై కూలిన టన్నెల్ బోరింగ్ మిషన్ (టీ.బి.ఎం) భాగాలను తొలగించాల్సి ఉంటుంది. ఈ పనిలో సింగరేణి రెస్క్యూ సిబ్బంది తమ వద్ద గల అత్యాధునిక గ్యాస్ కటింగ్ యంత్రాల ద్వారా ఇనుప పైపులను, గడ్డర్లను కత్తిరిస్తూ వేరు పరుస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశానికి చేరుకోవడం కోసం ఈ ట్రాక్ పునరుద్ధరణ అత్యవసరం కనుక దీనిపై సింగరేణి రెస్క్యూ బృందాలు నిరంతరాయంగా పని చేస్తున్నాయి. అదే సమయంలో ట్రాక్ మీద పేరుకుని ఉన్న బురద మట్టిని కూడా రెస్క్యూ బృందాలు తొలగిస్తున్నాయి. మొత్తం 250 మంది సింగరేణి రెస్క్యూ సభ్యులు 24 గంటలు ఈ పనిలో పాల్గొనేందుకు వీరిని నాలుగు షిఫ్టులకు తగిన విధంగా విభజించడం జరిగింది. రక్షణ సూత్రాలు పాటిస్తూ ఇచ్చిన పనిని సమర్థంగా పూర్తి చేయాలని సంస్థ చైర్మన్ రెస్క్యూ సిబ్బందికి సూచించారు. ఇదిలా ఉండగా ఎన్జీఆర్ఐ బృందాలు వారు ప్రమాద స్థలానికి చేరుకోవడానికి భూమి తొలిచే యంత్రాల (గ్రౌండ్ పెనట్రేటింగ్ ఇన్స్ట్రుమెంట్స్)ద్వారా ఐదు అనుకూలమైన ప్రాంతాలను ఎంపిక చేశారు. ఈ ప్రదేశాలలో తవ్వకాన్ని సమర్థంగా నిర్వహించడం కోసం ఎన్డిఆర్ఎఫ్ మరియు సింగరేణి బృందాలకు పనులు పురమాయించారు. దీనిలో సింగరేణి రెస్క్యూ బృందాలు అలు పెరగకుండా సమర్థంగా ముందుకు సాగుతున్నాయి. శుక్రవారం ప్రారంభమైన ఈ రెస్క్యూ ఆపరేషన్ ప్రత్యక్ష పరిశీలన, పర్యవేక్షణలో సంస్థ చైర్మన్ ఎన్.బలరామ్‌తోపాటు జనరల్ మేనేజర్ రెస్క్యూ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. అలుపెరగకుండా, అంకితభావంతో రెస్క్యూ సేవలందిస్తున్న సిబ్బందిని చైర్మన్ అభినందించారు. ఇచ్చిన లక్ష్యాలు సాధించాలని ఆయన సూచించారు.

ఎల్ఆర్ఎస్ ఫీజుపై 25 శాతం రాయితీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు ఫీజు చెల్లింపులో 25 శాతం రాయితీని ప్రకటించారు. 2020 స్కీంలో భాగంగా ఎల్ఆర్ఎస్కు దరఖాస్తు చేసుకున్న వారికి ఈ రాయితీ వర్తిస్తుంది. ఈ మేరకు శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో బల్దియా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జోనల్ కమీషనర్ ఉపేందర్‌రెడ్డి హెల్ప్ డెస్క్‌ను శుక్రవారం ఏర్పాటు చేసారు. ఈ డెస్క్‌లో బల్దియా అదనపు సీసీపీ గంగాధర్, జోనల్ సీపీ శ్యాంకుమార్, ఏసీపీ సాయిబాబలు అందుబాటులో ఉండి అక్కడికి వచ్చిన దరఖాస్తుదారుల అనుమానాలను నివృత్తి చేసారు. ఈ సందర్భంగా జోనల్ కమీషనర్ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ అనధికారిక ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు 2020లో రూ. వెయ్యి రుసుం చెల్లించిన దరఖాస్తుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చునన్నారు. ఇందుకు గాను పూర్తి ఫీజును మార్చి 31 లోగా చెల్లిస్తే 25 శాతం రాయితీ లభిస్తుందన్నారు. దరఖాస్తుదారుల సౌలభ్యం కోసం వారికి తగు సేవలను అందించేందుకు జోనల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు జోనల్ కమీషనర్ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ప్రతి నిత్యం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సిబ్బంది హెల్ప్ డెస్క్‌లో అందుబాటులో ఉండి సేవలను అందిస్తారన్నారు. దరఖాస్తుదారులు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న వారికి దరఖాస్తులో పొందుపరిచిన సెల్ నంబర్లకు తదుపరి ఫీజు చెల్లింపు సమాచారం చేరిందన్నారు. దరఖాస్తు పురోగతి, ఫీజు చెల్లింపు సమాచారం, డాక్యుమెంట్ల పరిశీలన సహా ఇతర అంశాలపై ఎటువంటి సందేహాలున్నా జోనల్ కార్యాలయంలోని హెల్ప్ డెస్క్ ద్వారా నివృత్తి చేసుకోవచ్చునని జడ్సీ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. వివరాలకు హెల్ప్ డెస్క్ నంబరు 9391869141లో సంప్రదించాలని ఆయన సూచించారు. హెల్ప్ డెస్క్‌లో కొత్తగా ఎటువంటి దరఖాస్తులు స్వీకరించబడవని ప్రజలు ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు. దరఖాస్తుదారులలో అవగాహన నిమిత్తం పలు ప్రాంతాలలో బ్యానర్లను సైతం ఏర్పాటు చేసామన్నారు.

పార్కు అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ డివిజన్ పరిధిలోని సిఫిల్ కాలనీలో రూ.10 లక్షలతో కొనసాగుతున్న పార్క్, ప్రహరీ గోడ సుందరీకరణ పనులను కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కులు ప్రజలకు ఆహ్లాదాన్ని అందిస్తాయని, పార్కులను అందంగా తీర్చిదిద్దే విధంగా కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, ఆర్టికల్చర్ వెంకటేష్, కిషోర్, కాలని అసోసియేషన్ సభ్యులు ఓమ్ రాజ్, చంద్రకాంత్, పెద్ది రాజు, వివేక్, జగనైయ్య, సోమయ్య, నాగేశ్వర్‌రావు, జగన్మోహన్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపు

విశాలాంధ్ర - దుండిగల్ : సైన్స్ ఫెయిర్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. శుక్రవారం నియోజకవర్గం 128 - చింతల్ డివిజన్‌లోని టివిఆర్ మోడల్ స్కూల్ నందు "స్పెక్ట్రం -5" పేరుతో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిధులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్‌లు విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతతో పాటు ఆత్మ స్థైర్యాన్ని పెంపొందిస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహమ్మద్ రషీదా రఫీ, నాయకులు చింతల్ అసోసియేషన్ సభ్యులు రవి, మురళి, టెంపుల్ కమిటీ సభ్యులు జగన్నాథం, చంద్రానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, కృష్ణమూర్తి, సత్యనారాయణ, పాఠశాల చైర్మన్ కోటిరెడ్డి, కరెస్పాండెంట్ సుబ్బా రెడ్డి, డైరెక్టర్లు శ్రీనివాస్ రావు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలో ఏ ఒక్క కులానికి అన్యాయం జరగనివ్వం

విశాలాంధ్ర-బషీర్ బాగ్: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణలో వంద సంవత్సరాల వరకు 59 కులాల్లో ఏ ఒక్క కులానికి అన్యాయం జరిగినా సహించేది లేదని బాధితులకు అండగా ఉంటానని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ అనుకూలంగా ఉందని, కానీ పార్టీలోని మాల నాయకులు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. ఎస్సీలోని ఉప కులాల ఆధ్వర్యంలో శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్లో జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు వర్గీకరణకు అనుకూలంగా ఉన్నారని, కాని మాల కులస్తులే అడ్డుపడుతున్నారని ఆరోపించారు. వర్గీకరణకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పూర్తిగా సహకరించారని చెప్పారు. వర్గీకరణలో గ్రూప్1, గ్రూప్ 2, గ్రూప్ 3కి బదులుగా ఎబిసిడిలుగా గ్రూపులను ఏర్పాటు చేయాలని 59 కులాలకు న్యాయం జరగాలన్నారు. ఇందు కోసం వర్గీకరణ నివేదికలోని లోపాలను సవరించి అమలు చేయాలని ఈ మేరకు కమిషన్‌ను కోరడం జరిగిందని, కమిషన్ మార్చి 10వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని ఆయన తెలిపారు. నేతకాని కులాలనికి ఆర్డిఓ ద్వారా కాకుండా తాహసిల్దార్ ద్వారా కులధృవీకరణ పత్రాలను ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో వారికి న్యాయం జరిగేంతవరకు అండగా ఉంటానన్నారు. ఈ సదస్సులో నేతకాని మహార్ సంఘం అధ్యక్షుడు దుర్గం రాజేష్, వెంకటేశ్వర్లు, దీపక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుల సర్వే నివేదికను బహిర్గతం చేయాలి : కవిత

విశాలాంధ్ర - హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను వేధించే వారు ఎంత పెద్ద నాయకులైనా, అధికారులైనా వదిలిపెట్టేలేదే లేదని ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. "సీఎం సొంత జిల్లా నుంచి చెబుతున్నా... కచ్చితంగా పింక్ బుక్కు మైంటైన్ చేస్తాం. పింక్ బుక్కులో అందరి చిట్టా రాసుకుంటాం. మాకూ టైమ్ వస్తుంది అప్పుడు అందరి సంగతి చెప్తాం" అని తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. తెలంగాణ జాగృతి అధ్వర్యంలో బీసీ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనడానికి శనివారం నాడు నాగర్ కర్నూల్ జిల్లా పర్యటనకు విచ్చేసిన ఎమ్మెల్సీ కవిత సింగోటంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవాలయాన్ని సందర్శించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ మంత్రి జూపల్లి కృష్ణారావు బీఆర్ఎస్ కార్యకర్తలను తీవ్రంగా వేధిస్తున్నారని, చిన్న విమర్శ చేసినా, ప్రశ్నించినా అక్రమ కేసులు పెట్టిస్తున్నార మండిపడ్డారు. కొల్లాపూర్ నియోజక వర్గానికి జూపల్లి కృష్ణారావు టూరిస్ట్ మంత్రిగా వ్యవహరిస్తున్నారని, ఎప్పుడో ఒకసారి మాత్రమే ఆయన నియోజకవర్గానికి వస్తున్నారని విమర్శించారు. సన్న వడ్లకు బోనస్ అని చెప్పి రాష్ట్ర ప్రభుత్వం బోగస్ చేసిందని, రైతు భరోసా, రుణమాఫీ గ్రామాల్లో సగం మందికి కూడా రాలేదని ఎండగట్టారు. మరోవైపు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తో కలిసి నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ కవిత విలేకరులతో మాట్లాడుతూ... కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి లక్షల ఎకరాలకు సాగునీటిని అందించిన ఘనత కేసీఆర్ దని, పాలమూరు రంగారెడ్డి, డిండి ప్రాజెక్టులు కేసీఆర్ హయంలో 60 శాతానికి పైగా పూర్తయ్యాయని గుర్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం నార్లాపూర్ వద్ద పంప్ హౌజ్ ను కూడా ప్రారంభించిందని, ఇప్పుడున్న ప్రభుత్వం నిజంగా నీళ్లు ఇవ్వాలనుకుంటే 8 టీఎంసీల నీటిని ఎత్తిపోయడానికి వ్యవస్థ సిద్ధంగా ఉందని తెలిపారు. నాగర్ కర్నూల్ లో జరిగిన బీసీ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించిన కుల సర్వే పూర్తి నివేదికను బయటపెట్టాలని, గ్రామాల వారీగా కులాల వారీగా జనాభాను బహిర్గతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీలకు విద్యా, ఉపాధి, రాజకీయ రంగాల్లో 46 శాతం రిజర్వేషన్లకు వేర్వేరు బిల్లులను పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. ఒకటే బిల్లు పెడితే మొదటికే మోసం వస్తుందని తొలి నుంచీ తాను వాదిస్తున్నానని,దాంతో మూడు బిల్లులను పెట్టాలని ప్రతిపాదించామని, మూడింటికి ఒకే బిల్లు పెడితే కోర్టుల్లో నిలవదని వివరించారు. కాంగ్రెస్ చేపట్టిన కుల సర్వే తప్పుడు తడఖగా ఉందని ఎండగట్టారు. 2014 కేసీఆర్ జరిపిన సర్వేలో బీసీలు 52 శాతం ఉన్నట్లు తేలిందని, ఇప్పుడు కాంగ్రెస్ చేసిన సర్వేలో 46 శాతం బీసీలు ఉన్నట్లు తేలిందని, ఈ వ్యత్యాసం ఎందుకు వచ్చిందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు.

సామ్రాజ్యలక్ష్మికి కొలను శుభాకాంక్షలు

విశాలాంధ్ర - కుత్బుల్లాపూర్: నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి ఆత్మీయులు సామ్రాజ్యలక్ష్మి జన్మదినం సందర్భంగా శుక్రవారం శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం నందు నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొని కొలన్ శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి సామ్రాజ్యలక్ష్మిని శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 7వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏనుగుల మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుండి ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

విశాలాంధ్ర - కాప్రా : మార్చ్ 1, 2 తేదీలలో మేడ్చల్ జిల్లా ఈసీఐఎల్‌లోని లయన్స్ క్లబ్ హాల్‌లో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు జరగనున్నాయని, ఈ సమావేశాలకు మేధావులు, విద్యావేత్తలు హాజరుకానున్నారని, ఈసీఐఎల్ ప్రాంతాన్ని జెండాలు, తోరణాలతో అలంకరించినట్లు ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్య ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ రెండు రోజుల పాటు జరిగే రాష్ట్ర సమితి సమావేశాల్లో మొదటి రోజు "సాంకేతికత, అభివృద్ధి నిరుద్యోగ సమస్య" అనే అంశంపై సెమినార్‌ను నిర్వహిస్తున్నట్లు ఈ సదస్సుకు ప్రధాన వక్తగా శాస్త్రవేత్త, సామాజిక కార్యకర్త ఎం.కృష్ణ ప్రసాద్ హాజరు కానున్నారని, అనంతరం అన్ని జిల్లాల నుండి హాజరైన సభ్యులతో కౌన్సిల్ సమావేశం జరుగుతుందన్నారు.

కుమార్ మొలుగారంకు సర్ సివి రామన్ ఎక్సలేన్సీ అవార్డు ప్రదానం

విశాలాంధ్ర-బషీర్ బాగ్: ఆధునిక భారతీయ విజ్ఞాన శాస్త్రవేత్తల పరిశోధన ప్రతిభను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపజేసిన వ్యక్తుల్లో సర్ సి.వి.రామన్ అని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం అన్నారు. జాతీయ విజ్ఞాన దినోత్సవం పురస్కరించుకొని ఉస్మానియా యూనివర్సిటీ విసి రెసిడెన్స్ ఛాంబర్‌లో తెలంగాణ మేధావుల పురం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో బర్కత్ పుర ఆఫీసులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. నా మతం సైన్స్ దానిని జీవితాంతం ఆదరిస్తా అని చెప్పి తుది శ్వాస వరకు శాస్త్రాన్వేషణలోనే గడిపిన దర్శనీకుడు శాస్త్రవేత్త ప్రొఫెసర్ సివి రామన్ అని అన్నారు. తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ ప్రసంగిస్తూ భారతదేశంలో పుట్టి ప్రయోగాలు చేసి నోబుల్ బహుమతి అందుకున్న మొదటి శాస్త్రజ్ఞుడు, భారతరత్న మొదటి బిరుదును అందుకున్న ప్రొఫెసర్ సివి రామన్ ఆదర్శాలు నేటి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకొని సైన్స్ రంగంలో అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రాజ నారాయణ ముదిరాజ్ శాలువా, పూలమాల, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో ఓయూ వైస్ ఛాన్సలర్ కుమార్‌ను సర్ సివి రామన్ ఎక్సలేన్సీ 2025 అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పన్ డైరెక్టర్ లైన్ ప్రేమ్ చాంద్ మునోత్ జైన్, సంస్థ కార్యదర్శి డాక్టర్ అక్తర్ అలీ, ప్రోగ్రాం అడ్వైజర్ డాక్టర్ రవితేజ, విద్యావేత్త ఇట్టా ఉదయశ్రీలు ఓయు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారంకు శాలువా పూలమాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి సైన్స్ ఎక్స్‌పో దోహదం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : విద్యార్థులు ఎంతో వేగంగా ఆలోచిస్తుంటారని, అనునిత్యం కొత్తదనం కోసం పరితపించే నూతన శాస్త్రవేత్తలని, వారికి తగిన స్వేచ్ఛను ఇవ్వగలిగినప్పుడు ఎన్నో అద్భుతాలను సృష్టించడంలో ఆశ్చర్యమేమీ లేదని డాక్టర్ పి. విజయ అన్నారు. ఈ మేరకు నోబెల్ బహుమతి గ్రహీత సర్ సివి రామన్ జయంతిని పురస్కరించుకొని ప్రతి యేటా ఫిబ్రవరి 28న నిర్వహించే జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శేరిలింగంపల్లి శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ కె.వాణి ప్రసాద్ నేతృత్వంలో శుక్రవారం నిర్వహించిన సైన్స్ ఎక్స్పో - 2025 కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. విద్యార్థులు తయారు చేసినటువంటి వివిధ నమూనాలను పరిశీలించి వాటి పనితీరును గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ పి. విజయ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలను పాఠశాలల్లో నిర్వహించడం వలన విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి ఎంతో దోహదపడుతుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాణి ప్రసాద్ మాట్లాడుతూ తమ పాఠశాలలో బోధనతోపాటు, విద్యార్థుల ఆలోచనలకు అనుగుణంగా వారిలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రత్యేక కార్యచరణను రూపొందించుకొని వారి సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని తెలియజేశారు. పాఠశాలల ఏజిఎం. శివరామకృష్ణ, ప్రాంతీయ ఇంచార్జ్ పద్మజ, అకాడెమిక్ డీన్ వి. రాజేష్ కుమార్, శ్రీనివాసరెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రావూస్ విద్యాసంస్థల విజ్ఞాన ప్రదర్శన

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి, గుల్మొహర్ పార్క్ కాలనీలోని రావూస్ ఇంటర్నేషనల్ స్కూల్ నందు జెగా ప్రైమా డా.సి. విరామన్ జన్మదిన కారణంగా రావూస్ విద్యాసంస్థలు ఈ విజ్ఞాన ప్రదర్శనను నిర్వహించారు. ఈ రోజు జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పాల్గొని వారి ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సైన్స్ ఎగ్జిబిషన్లను రావూస్ విద్యాసంస్థల చైర్మన్ పోల్సాని ప్రభాకర్‌రావు సందర్శించి విద్యార్థులు కనబరిచిన ప్రతిభను ప్రశంసించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రతిభను చూసి సంతోషం వ్యక్తం చేశారు. ఇంకా పలువురు ప్రముఖులు చూసి పిల్లలను ఎంతగానో మెచ్చుకున్నారు. ప్రతి సంవత్సరం రావూస్ విద్యాసంస్థలు విద్యార్థులకు విజ్ఞాన శాస్త్రం పట్ల అవగాహన కల్పించడానికి వారిలోని ప్రతిభను వెలికి తీయడానికి ఈ సైన్స్ ఎగ్జిబిషన్ను నిర్వహిస్తున్నారు.

లోటు భర్తీ ఎలా?

రాష్ట్ర బడ్జెట్ లెక్కలు మోసపూరితం: రామకృష్ణ

విశాలాంధ్రబ్యూరో-ఏలూరు: రాష్ట్ర ప్రభుత్వం 2025-26 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను మభ్యపెట్టే, మోసపూరిత బడ్జెట్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ విమర్శించారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ... గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందని విమర్శించిన కూటమి ప్రభుత్వం... 8 నెలల పాలనలో ఏం మార్పు సాధించిందో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పేరు గొప్ప...ఊరు దిబ్బ అన్నచందంగా ఉందని ఎద్దేవా చేశారు. రూ.3 లక్షల 22 వేల359 కోట్ల భారీ బడ్జెట్ ప్రతిపాదించారని, రెవెన్యూ లోటు, ద్రవ్య లోటు ఏ విధంగా పూడుస్తారో బడ్జెట్లో ప్రతిపాదించలేదని విమర్శించారు. ఈ లోటును ఆస్తులు విక్రయించడం లేదా అప్పులు తెచ్చి పూడుస్తారా లేదా ప్రజలపై భారాలు వేస్తారా అనేది స్పష్టత లేదని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో 60 శాతానికి పైగా ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తుంటే కేటాయింపులు అరకొరగా ఉన్నాయన్నారు. సాగునీటి రంగానికి బడ్జెట్లో కనీసం 10 శాతం కేటాయింపులు ఉండాల్సి ఉండగా... కవలం 3.5శాతం అంటే రూ.11,314 కోట్లు మాత్రమే కేటాయించి సాగునీటి రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నాలుగు దశాబ్దాల క్రితం ప్రారంభించిన ప్రాజెక్టులను పట్టించుకున్న పాపాన పోలేదని,ప్రస్తుత కేటాయింపులతో మరో నాలుగు దశాబ్దాలు అయినా ప్రాజెక్టులు పూర్తయ్యే అవకాశాలు కనపడటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు 45.72 నుండి 41 .1కి తగ్గించడం ద్వారా కేంద్రం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన నరేంద్ర మోదీని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పొగడటం విడ్డూరంగా ఉందన్నారు. ఇటీవల అమిత్ షా రాష్ట్రంలో పర్యటించినప్పుడు రాష్ట్రానికి 7 నెలల కాలంలో రూ.3 లక్షల కోట్లు రాష్ట్రానికి కేటాయించామని ప్రకటించారని... ఆ నిధులు ఏమయ్యాయో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కౌలు రైతులు లేకుండా వ్యవసాయం ఉండదని...ఈ బడ్జెట్లో కౌలు రైతులను పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతినెల మహిళలకు రూ.1500 తదితర పథకాలను అటకెక్కించారన్నారు. తల్లికి వందనం, దీపం పథకంలో భారీగా కోత విధించి మోసం చేశారన్నారు. గత ఎన్నికలలో కూటమి ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించి బడ్జెట్లో నిధులు కేటాయించలేదన్నారు. బడ్జెట్ను గొప్పగా కీర్తిస్తున్న కూటమినేతలు వాస్తవంలోకి రావాలని సూచించారు. పోసాని అరెస్టు ఉదంతంపై వ్యాఖ్యానిస్తూ... అసభ్యకరమైన పదజాలం ఎవరు వాడినా అభ్యంతరకరమన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పార్టీలే నాయకుల్ని నియంత్రించాలన్నారు. విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పులూరి హేమ శంకర్, బండి వెంకటేశ్వరరావు, మైసాక్షి వెంకటాచారి, కారం దారయ్య, కంచర్ల గురవయ్య, జేవీ రమణ రాజు, కొండేటి బేబి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎండీ మున్నీర్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయాలి

విశాలాంధ్ర-ఏలూరు: కష్టజీవులు, శ్రమజీవులకు సమస్యలు ఉన్నంతవరకు కమ్యూనిస్టు పార్టీ సజీవంగా ఉంటుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి,మాజీ శాసనసభ్యులు కే రామకృష్ణ పేర్కొన్నారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశం పార్టీ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో శుక్రవారం కారం ధారయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజానీకానికిగా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని ఆయన కోరారు. పార్టీ శ్రేణులు రాష్ట్రంలో ముఖ్యంగా ఏలూరు జిల్లాలో పేద ప్రజల సంబంధించి పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అర్హులైన ప్రజలచే అర్జీలు పెట్టించాలని ఆయన కోరారు. జిల్లాలో సీపీఐ పార్టీని, ప్రజాసంఘాలను నిర్మాణపరంగా అభివృద్ధి చేయుటకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, రాష్ట్ర సమితి సభ్యులు ఎండి మునీర్,బండి వెంకటేశ్వర రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు,సన్నేపల్లి సాయిబాబు, ఎం. వెంకటాచారి, కంచర్ల గురవయ్య,జేవీ రమణ రాజు, కొండేటి బేబి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పక్కాగా అమలు చేయాలి

కులవివక్ష నిర్మూలనకు పాలకులు ప్రయత్నించాలి: కరవది

విశాలాంధ్ర - పలాస: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం పక్కాగా అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు అన్నారు. కాశీబుగ్గ దళిత కమ్యూనిటీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్ ప్లాన్‌లో భాగంగా ఎస్సీ, ఎస్టీ నిధులు వారికే కేటాయించి అభ్యున్నతికి తోడ్పడాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పైబడినప్పటికీ నేటికీ కులవివక్ష కొనసాగుతూనే ఉందన్నారు. దాడులు జరుగుతుండడంతో సరైన విద్య, వైద్యం అందక దళితులు నేటికి వెనుకబడి ఉండే పరిస్థితి ఏర్పడిందన్నారు. కులవివక్ష నిర్మూలనకు పాలకులు ప్రయత్నం చేయాలన్నారు. ప్రతి ఒక్కరికి విద్య , సరైన వైద్యం అందించేందుకు ఆసుపత్రులలో వైద్యులు, మందులు లేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అట్రాసిటీ చట్టం వచ్చి ఏళ్లు గడుస్తున్నా పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదన్నారు. పోరాటాలు, ఆందోళనలు చేసినా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. బడ్జెట్‌లో సబ్ ప్లాన్ నిధులు పుష్కలంగా కేటాయించాలని కోరారు. ఎన్నో పోరాటాలు చేసి సుప్రీంకోర్టు నుంచి అట్రాసిటీ యాక్ట్‌ను తెచ్చుకున్నామని, దీనిపై పోరాటాలు చేసిన వారికి కౌంటర్ కేసులు పెట్టి స్టేషన్ బెయిల్ ఇవ్వడం సరైన పద్ధతి కాదన్నారు. దళితవాడలకు శ్మశానాలు , రహదార్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి కుటుంబానికి రెండు ఎకరాల భూమి ఇవ్వాలన్నారు. ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కోళ్ల చిన్నారావు, ప్రధాన కార్యదర్శి పిట్ట గోపి, ఉపాధ్యక్షుడు బాదాపు వాణి, డివిజన్ అధ్యక్షుడు ఎన్.ఖైలాస్, టెక్కలి డివిజన్ అధ్యక్షుడు పి.భాస్కరరావు, నియోజకవర్గ అధ్యక్షుడు విజయ్ నాయక్, పలాస అధ్యక్షుడు బోనెల గోపి పాల్గొన్నారు.

లాల్‌నీల్ జెండాల ఐక్యతతోనే సమసమాజం

పెనుగొండ లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: లాల్‌నీల్ జెండాలు కలిసి పని చేసినప్పుడే సమసమాజం సాధ్యమని అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. మన మంచి పుస్తకం, జాషువా కల్చరల్ సెంటర్, భీమ్ సేన సేవాదళ్ నిర్వహణలో డాక్టర్ కోయి కోటేశ్వరరావు కవితా సంపుటి 'నాగస్వరం' పరిచయ సభ గుంటూరు బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. ఏసీ కళాశాల విశ్రాంత ప్రధానాచార్యులు డాక్టర్ పోలె ముత్యం అధ్యక్షతన జరిగిన సభలో పెనుగొండ మాట్లాడుతూ మార్క్సిజం సమసమాజం గురించి చెప్పడం ఎంత ప్రాధాన్యత కలిగిన అంశమో అంబేద్కరిజమ్ సామాజిక న్యాయం గురించి చెప్పటమూ అంతే ప్రాధాన్యత కలిగిన అంశమని అన్నారు. సామాజిక న్యాయం కలిగినప్పుడే సమసమాజం అనే లక్ష్యం నెరవేరుతుందన్నారు. వర్గ, వర్ణ దృక్పథాలు సమన్వయంతో ముందుకు సాగాలనేది అరసం ఆకాంక్ష అని అన్నారు. దళిత సాహితీవేత్తలు ప్రతిపాదిస్తున్న దేశీయ మార్క్సిజాన్ని అరసం ఆహ్వానిస్తోందని తెలిపారు. లౌకికవాద, ప్రజాస్వామ్య శక్తులు బలపడే ఏ ప్రయత్నాన్నైనా అరసం ప్రోత్సహిస్తుందని చెప్పారు. అనంతరం పుస్తక రచయిత డాక్టర్ కోయి కోటేశ్వరరావును సత్కరించారు. తొలుత భీమ్ సేన సేవాదళ్ వ్యవస్థాపకులు నల్లపు నీలాంబరం వక్తలకు స్వాగతం పలుకగా, జాషువా కల్చరల్ సెంటర్ కార్యదర్శి పీవీ రమణ వందన సమర్పణ చేశారు. ఈ సభలో ప్రముఖ కవి, విమర్శకులు జి.లక్ష్మీనరసయ్య, జాషువా కల్చరల్ సెంటర్ గౌరవాధ్యక్షులు, విశ్రాంత డీఐజీ(ఆర్‌అండ్ఎస్) ఎస్.బాలస్వామి, ప్రముఖ కవి విల్సన్‌రావు కొమ్మవరపు, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్‌జే విద్యాసాగర్, బహుజన కెరటాలు సంపాదకులు పల్నాటి శ్రీరాములు, నరసరావుపేట ఎన్‌బీటీ అండ్ ఎన్‌వీసీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాకాని సుధాకర్, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చుక్కా నాగభూషణం, ఏఎన్‌యూ ప్రొఫెసర్ డాక్టర్ కె.శశిధర్, మన మంచి పుస్తకం నిర్వాహకులు కాపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతి పనులు 10 తర్వాత ప్రారంభం

ఎన్నికల కోడ్ ఆటంకంతోనే ఆలస్యం

వైసీపీ దుష్ప్రచారంపై మంత్రి నారాయణ ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్నికల కోడ్ వల్ల అమరావతి రాజధాని నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయని, ఈ నెల 10 తర్వాత ప్రారంభమవుతాయని మంత్రి నారాయణ తెలిపారు. గత ప్రభుత్వానికి ఒక ప్లానింగ్, ఆర్థిక క్రమశిక్షణ లేకపోవడంతో రాష్ట్రం ఎంతలా అతలాకుతలం అయిందో ప్రత్యక్షంగా చూశామన్నారు. బడ్జెట్‌లో మునిసిపల్ శాఖకు, సీఆర్డీఏకు అధిక నిధులు కేటాయించినందుకు సీఎం చంద్రబాబు నాయుడుకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం పబ్లిసిటీ సెల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో అమరావతి టెండర్ల ప్రక్రియ ఆలస్యం అయిందని, మార్చి పదో తేదీన టెండర్లు ఖరారు చేసి ఆ తర్వాత పనులు ప్రారంభించి మూడేళ్లలో పూర్తి చేస్తామన్నారు. అమరావతి సీడ్ కేపిటల్ నుంచి 16వ నంబరు జాతీయ రహదారికి కలిపే రోడ్ల నిర్మాణ పనులు, వీటి తర్వాత మధ్యలో నిర్మాణం నిలిచిపోయిన సీడ్ యాక్సిస్ రోడ్ నిర్మాణం కూడా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి చెప్పారు. ఐఏఎస్ అధికారుల బంగ్లాల నిర్మాణానికి చదరపు అడుగుకు 4,382 రూపాయిలు ఖర్చవుతుండగా, జగన్ తన పత్రికలో మాత్రం చదరపు అడుగుకు 9,300 రూపాయిలు ఖర్చవుతుందని దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర అదనపు వసతులు, జీఎస్‌టీతో పాటు ఇతర పన్నులు కలుపుకుని మొత్తం రూ.516 కోట్లు ఖర్చవుతుందన్నారు. ఇక మంత్రులు, జడ్జిల బంగళాల నిర్మాణానికి చదరపు అడుగుకు రూ.10,042 ఖర్చు అవుతుందని రాశారు. కానీ వాస్తవంగా చదదరపు అడుగుకు రూ.4,264 మాత్రమే ఖర్చవుతుందన్నారు. నిర్మాణంలో నాణ్యతకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ఇంజనీర్ల కమిటీ నిర్ధారించిన ధరల మేరకే టెండర్లు పిలిచాం తప్ప... ఏ కాంట్రాక్టరుకు కట్టబెట్టేందుకు చేయలేదని తెలిపారు.

కీలక రంగాల్లో వ్యూహాత్మక భాగస్వామ్యం బలోపేతం

- రక్షణ, భద్రత, సాంకేతికతపై దృష్టి
- ఈ ఏడాది చివరి కల్లా ఎఫ్‌టీఏ పూర్తి
- భారత్-ఈయూ నిర్ణయం
- ప్రధాని మోదీ-ఈయూ అధ్యక్షురాలు ఉర్సులా చర్చలు

న్యూఢిల్లీ: ఈ ఏడాది చివరి నాటికి సమగ్ర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందా(ఎఫ్‌టీఏ)న్ని పూర్తిచేయాలని భారత్-ఈయూ నిర్ణయించాయి. ఈ మేరకు భారత ప్రధాని నరేంద్రమోదీ-యురోపియన్ యూనియన్ (ఈయూ) అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ శుక్రవారం జరిపిన చర్చల్లో నిర్ణయం తీసుకున్నారు.ఈ ఏడాది చివరి నాటికి ఎఫ్‌టీఏని పూర్తి చేయాలని తమ బృందాలను ఆదేశించారు. ఇది భారత్- ఈయూ మధ్య పెరుగుతున్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయనుంది. ముఖ్యంగా ట్రంప్ ప్రభుత్వ వాణిజ్య విధానాలపై ప్రపంచవ్యాప్త ఆందోళనల మధ్య ఇరు దేశాలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. ఇక రక్షణ, భద్రత, కీలకమైన సాంకేతికత రంగాలలో భారత్-ఈయూ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని విస్తరించాలని కూడా ఇరువురు దేశాధినేతలు నిర్ణయించారు. వాన్ డెర్ లేయన్‌తో చర్చల తర్వాత మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో... భారత్-ఈయూ భాగస్వామ్యాన్ని సహజమైనది , సేంద్రీయమైనదిగా మోదీ అభివర్ణించారు. ఇది పరస్పర విశ్వాసం- భాగస్వామ్య ప్రజాస్వామ్య విలువలపై నిర్మించబడిందని పేర్కొన్నారు. పెట్టుబడి రక్షణ ఒప్పందం, భౌగోళిక సూచికలపై ఒప్పందం కోసం చర్చల పురోగతితో పాటు, పరస్పర ప్రయోజన కరమైన వాణిజ్య ఒప్పందాన్ని ముగించాలనే నిబద్ధతను ఆయన నొక్కి చెప్పారు. భారత్-పశ్చిమాసియా-ఐరోపా కారిడార్‌ను ప్రపంచ వాణిజ్యం, స్థిరమైన వృద్ధి, ఆర్థిక శ్రేయస్సును పెంచే కీలక చొరవగా మోదీ అభివర్ణించారు. కాలేజ్ ఆఫ్ కమిషనర్లతో పాటు వాన్ డెర్ లేయన్ పర్యటనను అపూర్వమైనదిగా పేర్కొన్నారు. రెండు దేశాల సంబంధాలను బలోపేతం చేయడంలో దాని ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, భద్రత, స్థిరత్వం ,ఆర్థిక అభివృద్ధికి తమ నిబద్ధతను ఇద్దరు నాయకులు పునరుద్ఘాటించారు. భారతదేశంతో సంబంధాలను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలనే ఈయూ ఆకాంక్షిస్తున్నట్లు వాన్ డెర్ లేయన్ పేర్కొన్నారు.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై పీయూష్ గోయల్‌తో చర్చలు

భారత్, ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై భారత వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూశ్ గోయల్‌తో యూరోపియన్ వాణిజ్య, ఆర్థిక భద్రతా విభాగం కమిషనర్ మారోస్ సెఫ్కోవిక్ దిల్లీలో చర్చించారు. ఈ సమావేశం వివరాలతో పీయూష్ గోయల్ 'ఎక్స్'లో ఒక ట్వీట్ చేశారు. "స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై ఎలాంటి దాపరికం లేకుండా, విశాల దృక్పథంతో చర్చలు జరిగాయి. భవిష్యత్తులోనూ ఈయూ-భారత్ విశ్వసనీయమైన వాణిజ్య భాగస్వాములుగా నిలుస్తాయి. పెట్టుబడుల విషయంలో కలిసి కట్టుగా ముందుకు సాగుతాయి. మరిన్ని కొత్త శిఖరాలను అధిరోహిస్తాయి" అని ఆయన వెల్లడించారు. ఈ చర్చల్లో ఈయూ అధ్యక్షురాలు ఉర్సులా కూడా పాల్గొన్నారు.

మార్చి 10 నుంచి 14 వరకు సమావేశాలు

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో ముడిపడిన కీలక అంశాలపై చర్చించేందుకు భారత్, ఈయూకు చెందిన సీనియర్ అధికారులు మార్చి 10 నుంచి 14 వరకు బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లో భేటీ కానున్నారు. ఇరు పక్షాల అధికారులు ఈ అంశంపై సమావేశం కావడం ఇది పదోసారి.

భారత్‌తో భద్రత, రక్షణ భాగస్వామ్య ఒప్పందం: ఉర్సులా

భారత్‌తో భద్రత, రక్షణ భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని భావిస్తున్నామని ఈయూ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ అన్నారు. గతంలో తాము ఇలాంటి ఒప్పందాన్ని జపాన్, దక్షిణ కొరియాతో కుదుర్చుకున్నామని తెలిపారు. సైనిక సామర్థ్యాలను పెంచుకునే దిశగా భారత్ వేగంగా పురోగమిస్తోందని- ఈ విషయంలో భారత్-ఈయూ పరస్పరం చేదోడును అందించుకోగలవు అని నమ్ముతున్నానన్నారు. ప్రధాని మోదీతో సమావేశానికి ముందు ఒక సదస్సులో ఉర్సులా కీలక వ్యాఖ్యలు చేశారు. "రక్షణ రంగ పారిశ్రామిక ప్రాజెక్టులలో ఈయూతో కలిసి పనిచేసేందుకు భారత్ ఆసక్తిగా ఉందని తెలిసి నాకు చాలా సంతోషం కలిగింది. సైనిక సామర్థ్యాలను పెంచుకునే దిశగా భారత్ వేగంగా పురోగమిస్తోంది. ఈ విషయంలో భారత్-ఈయూ పరస్పరం చేదోడును అందించుకోగలవు అని నేను నమ్ముతున్నాను. సీమాంతర ఉగ్రవాదం, సముద్ర జలాల్లో భద్రత, సైబర్ దాడులు, కీలకమైన మౌలిక సదుపాయాలపై ఉగ్ర దాడులు వంటి విషయాల్లో కలిసి పనిచేసేందుకు మేం సిద్ధం" అని ఉర్సులా ప్రకటించారు. గత 30 ఏళ్లలో భారత్-ఈయూ చాలా విషయాల్లో సంపూర్ణ విశ్వాసంతో పరస్పర సహకారాన్ని అందించుకున్నాయి. ఈ సహకారానికి పరిమితులు విధించుకునే సమయం కాదు ఇది. ప్రస్తుత కాలమాన పరిస్థితులకు అనుగుణంగా స్పందించాల్సిన సమయం ఇది. మాటలు కాదు కీలకమైన చేతల సమయం ఇదని ఆమె అన్నారు.

ఉక్రెయిన్ ఓడిపోతే ప్రపంచానికే ముప్పు

"ఉక్రెయిన్ విషయంలో మేం(ఈయూ) పూర్తి స్పష్టతతో ఉన్నాం. ఉక్రెయిన్ ఒకవేళ ఓడిపోతే, ప్రపంచంలో ఎక్కడైనా అదే తరహా పరిస్థితి పునరావృతమయ్యే ముప్పు ఉంటుంది. అంతర్జాతీయ సరిహద్దును ఉల్లంఘించి పొరుగు దేశంపై దండయాత్ర చేయడం అస్సలు సరికాదు" అని ఉర్సులా స్పష్టం చేశారు.

శోకంలో వివాదాలా: వినయ్ విశ్వం

కొచ్చి: శోక సమయంలో వివాదాల గురించి తమ పార్టీ పట్టించుకోదని సీపీఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి వినయ్ విశ్వం అన్నారు. సీనియర్ నాయకుడిని కోల్పోయి బాధ్యలో ఉంటే ఈ వివాదాలు ఏమిటని ప్రశ్నించారు. సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పి.రాజు గురువారం కన్నుమూశారు. అంత్యక్రియలు శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఆయన ఇంటి వద్ద ముగిశాయి. అంతకుముందు పరావుర్ టౌన్ హాల్‌లో రాజు భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. అయితే ఆర్థికపరమైన అవకతవకలతో రాజు క్రమశిక్షణా చర్యలను ఎదుర్కొన్న దృష్ట్యా ఆయన కుటుంబం పార్టీపై గుర్రుగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ కారణంగానే ఆయన మృతదేహాన్ని పార్టీ కార్యాలయం వద్ద ఉంచనివ్వలేదన్న వార్తలు వచ్చాయి. దీనిపై వినయ్ విశ్వం స్పందిస్తూ రాజు దీర్ఘకాలం పార్టీకి సేవలు అందించారని, ఆయన అందరికి ప్రియ కామ్రేడ్ అని అన్నారు. సీపీఐ ఎర్నాకులం జిల్లా కార్యదర్శి కేఎం దినకరన్ మాట్లాడుతూ కొందరు ఉద్దేశపూర్వకంగా వివాదాలు సృష్టిస్తున్నారన్నారు. రాజు కుటుంబాన్ని తప్పుదోవ పట్టించి పార్టీ ప్రతిష్ఠకు విఘాతం కలగిస్తున్నారని చెప్పారు. '13 నెలల కిందట రాజు క్రమశిక్షణా చర్యలను ఎదుర్కొన్నారు. రాష్ట్ర కార్యవర్గాన్ని, పార్టీ కంట్రోల్ కమిషన్‌ను ఆయన ఆశ్రయించినప్పటికీ జిల్లా శాఖ తీసుకున్న చర్యలకు అగ్రనేతల సమర్థన లభించింది' అని దినకరన్ చెప్పారు. పార్టీకి అందించిన తోడ్పాటు, ఆయన వయస్సును దృష్టిలో పెట్టుకొని క్రమశిక్షణా చర్యలను సరళీకరించే దిశగా కసరత్తు సాగుతుండగా రాజు కన్నుమూశారని దినకరన్ వెల్లడించారు.

నేడు కాగితాల రాజేశ్వరరావు వర్ధంతి

'నా పార్టీ' గేయ కావ్యం పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర-విజయవాడ: ప్రముఖ అభ్యుదయ రచయిత, కమ్యూనిస్టు కవి కాగితాల రాజేశ్వరరావు 21వ వర్ధంతి సభ విశాలాంధ్ర కార్యాలయంలో శనివారం సాయంత్రం ఐదు గంటలకు జరగనుంది. సీపీఐ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, అభ్యుదయ రచయితల సంఘం, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సంయుక్త అధ్వర్యంలో నిర్వహించే ఈ సభలో రాజేశ్వరరావు రచించిన 'నా పార్టీ గేయ కావ్యం' పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు.. మాజీ ఎమ్మెల్సీ, విశాలాంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శి జల్లి విల్సన్ సభాధ్యక్షులుగా వ్యవహరిస్తారు. అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు గద్దం కోటేశ్వరరావు, సి. రాఘవాచారి ట్రస్ట్ ట్రస్టీ అక్కినేని చంద్రరావు, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, బుద్ధభూమి మాసపత్రిక వర్కింగ్ ఎడిటర్ గోలి సీతారామయ్య, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు పి. చంద్రనాయక్ హాజరుకానున్నారు.

రూ.2వేల కోట్లతో 'జల్ జీవన్' పనులు

మంత్రి పార్థసారధి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జల్ జీవన్ మిషన్ కింద రూ.2,010 కోట్లు విలువ చేసే 7,797 పనులకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. ఈ పనులన్నీ తొమ్మిది నెలల్లో పూర్తి చేయాలని నిర్దేశించినట్లు చెప్పారు. శాసనసభ మీడియా పాయింట్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేబినెట్ నిర్ణయాలు వెల్లడించారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగాన్ని కేబినెట్ ఆమోదించిందన్నారు. అలాగే గృహ నిర్మాణానికి సంబంధించి గత ప్రభుత్వం యూనిట్ కాస్టుగా రూ.లక్షా 80వేలు చెల్లిస్తే ప్రస్తుతం రూ.2.5 లక్షలుగా నిర్ణయించి... మంత్రిమండలి ఆమోదం తెలిపిందన్నారు. ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, బీసీలకు రూ.లక్ష ఇచ్చేందుకు అంగీకరించిందని పార్థసారధి చెప్పారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన ఇళ్ల నిర్మాణ పనులన్నీ పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలలో ఇంకా 5.5 లక్షల ఇళ్ల నిర్మాణం మొదలు కాలేదన్నారు. వాటినీ పూర్తి చేసేందుకు కసరత్తు జరుగుతోందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల ఇళ్ల నిర్మాణానికి అదనపు సాయం అందించటం వల్ల రాష్ట్ర ఖనాజాపై రూ.4,135 కోట్ల అదనపు భారం పడిందని పార్థసారధి తెలిపారు. వైసీపీ నాయకులు బడ్జెట్ సమావేశాలకు రాకుండా ప్రతిపక్ష హోదా కోసం, తమ నాయకుడి మెప్పు కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రాభివృద్ధి కోసం పనిచేసే స్వభావం వైసీపీకి లేదన్నారు. సంక్షేమం పేరుతో గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల రుణభారాన్ని రాష్ట్ర ప్రజలపై మోపిందని, నిధులను దారి మళ్లించిందని పార్థసారధి విమర్శించారు.

ఈపీఎఫ్ వడ్డీ రేటు యథాతథం!

2024-25కి 8.25శాతం

న్యూఢిల్లీ: ఉద్యోగ భవిష్య నిధి (ఈపీఎఫ్) డిపాజిట్లపై వడ్డీరేటును 2024-25 ఆర్థిక సంవత్సరానికిగానూ ప్రస్తుతమున్న 8.25 శాతాన్నే కొనసాగించనున్నారు. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన ఈపీఎఫ్ఓ ట్రస్టీల కేంద్ర మండలి (సీబీటీ) సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఈపీఎఫ్ డిపాజిట్లపై వడ్డీరేటు 8.15 శాతంగా ఉండగా... దాన్ని 2024 ఫిబ్రవరిలో 8.25 శాతానికి పెంచారు. ఈసారి మాత్రం ఎలాంటి పెంపు లేదు. ఈ నిర్ణయం వివరాలను కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదం కోసం పంపనున్నారు. ప్రభుత్వ ఆమోదం లభించగానే, 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వడ్డీని దాదాపు ఏడు కోట్ల మందికిపైగా ఈపీఎఫ్ సభ్యుల ఖాతాల్లో జమ చేస్తారు.

కరోనా సంక్షోభం నెలకొన్న 2020-21లో ఈపీఎఫ్ డిపాజిట్లపై గరిష్ఠంగా 8.5 శాతం వడ్డీరేటును చెల్లించారు. దానివల్ల అప్పట్లో ఈపీఎఫ్ఓ ఖాతాదారులు గణనీయంగా లబ్ధి పొందారు. అయితే ఆ మరుసటి సంవత్సరమే (2021 -2022) వడ్డీరేటును నాలుగు దశాబ్దాల కనిష్ఠానికి (8.1 శాతం) తగ్గించారు. అంతకుముందు 1977-78లో ఈపీఎఫ్ డిపాజిట్లపై అత్యల్పంగా 8 శాతం వడ్డీరేటునే చెల్లించారు. 2011-12లోనూ ఈపీఎఫ్ డిపాజిట్లపై వడ్డీరేటు 8.25 శాతంగానే ఉండేది. దీన్ని 2012-13లో 8.5 శాతానికి పెంచారు. ఆ తర్వాత వరుసగా రెండేళ్ల పాటు ఈపీఎఫ్ సభ్యులకు అన్నీ శుభవార్తలే వినిపించాయి. 2013-14, 2014-15 ఆర్థిక సంవత్సరాల్లో వడ్డీరేటును ఈపీఎఫ్ ఏకంగా 8.75 శాతం మేర అందించింది. 2015-16లో దీన్ని మరింతగా పెంచి 8.8 శాతానికి చేర్చారు. ఇక ఆ తర్వాతి నుంచి ఈపీఎఫ్ వడ్డీరేట్లలో తిరోగమనం, ఆటుపోట్లు మొదలయ్యాయి. 2016-17లో ఈపీఎఫ్ వడ్డీరేటును 8.65 శాతానికి, 2017-18లో 8.55 శాతానికి తగ్గించారు. 2018-19లో దీన్ని స్వల్పంగా పెంచి 8.65 శాతానికి చేర్చారు. 2019-20లో మళ్లీ 8.5 శాతానికి తగ్గించారు.

మావోయిస్టు అనుబంధ ఎంబీఎం అగ్రనేత అరెస్ట్

న్యూఢిల్లీ: నిషేధిత మావోయిస్టులతో సంబంధం ఉన్న ఒక సంస్థకు చెందిన అగ్రనేతను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అరెస్టు చేసినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. చత్తీస్‌గఢ్ ఉగ్ర దాడికి నిధులు సమకూర్చిన కేసులో విచారణకు సంబంధించి మూల్వాసి బచావో మంచ్ (ఎంబీఎం) నాయకుడు రఘు మిడియామిని ఎన్ఐఏ గురువారం అదుపులోకి తీసుకుంది. ఎంబీఎంని చత్తీస్‌గఢ్ ప్రభుత్వం కూడా నిషేధించింది. 'మావోయిస్టులు వారి భారత వ్యతిరేక అజెండాను మరింత ముందుకు తీసుకెళ్లడానికి ఈ సంస్థ నిధుల సేకరణ, నిల్వ, పంపిణీలో నిమగ్నమై ఉంది. మావోయిస్టుల నేతృత్వంలో నిరసనలు నిర్వహించేందుకు, వాటిని కొనసాగించేందుకు స్థానిక స్థాయిలో నిధుల పంపిణీకి రఘు మిడియామి నోడల్ వ్యక్తి అని ఎన్ఐఏ విచారణలో వెల్లడయింది' అని దర్యాప్తు సంస్థ విడుదల చేసిన ఒక ప్రకటన పేర్కొంది. తదుపరి పరిశోధనల్లో మిడియామి ఎంబీఎం నాయకుడని తేలింది. గత ఏడాది ఫిబ్రవరిలో ఎన్ఐఏ స్వాధీనం చేసుకున్న ఈ కేసులో ఇద్దరు నిందితులను చత్తీస్‌గఢ్ పోలీసులు నవంబరు 2023లో అరెస్టు చేశారు. ఎంబీఎం సభ్యులు/ ఓవర్ గ్రౌండ్ వర్కర్లు అరెస్టయిన ఇద్దరి నుంచి రూ.6 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.